మంగళవారం
25•6•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
•సంపుటి 8 •సంచిక 361
•పేజీలు: 16 + 16


# నమస్తే తెలంగాణ


మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







## విదేశాల్లో భారతీయుల నల్లధనం..
## 34 లక్షల కోట్లు!



- 1980-2010 మధ్య పోగైన మొత్తమిది
- వెల్లడించిన మూడు సర్వేలు
- పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ ముందుకు నివేదిక

8

## ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలు

- తొలిరోజు ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకున్న 23,715 మంది విద్యార్థులు
- ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- అదేరోజు నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు



2



## ఆర్బీఐకి విరాల్ గుడ్‌బై

- డిప్యూటీ గవర్నర్ హోదాకు రాజీనామా చేసిన ఫైర్‌బ్రాండ్
- రిజర్వ్ బ్యాంక్ స్వేచ్ఛ కోసం మోదీ సర్కారుతో వైరం
- గతంలో తొమ్మిదినెలల ముందే తప్పుకొన్న గవర్నర్ ఉర్జిత్
- ఆధిపత్య ధోరణికి నిరసనగానే: కాంగ్రెస్

11

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

నిర్మల్ జిల్లా పెంబిలోని కడెం నదిలో ప్రవహిస్తున్న వరద నీరు



# విస్తారంగా వానలు

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి
- ఉపరితల ఆవర్తన ప్రభావం.. మూడ్రోజులపాటు భారీ వర్షాలు!
- నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 7.4 సెంటీమీటర్ల వర్షపాతం
- పొంగుతున్న వాగులు, వంకలు.. ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి
- రైతుల్లో హర్షం.. వానకాలం సాగుకు సిద్ధం

**నైరుతి** రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు పడ్డాయి. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 7.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యూ మండలంలో సిర్పూర్ వాగు, రావునూర్ వాగుపై ఏర్పాటుచేసిన తాత్కాలిక వంతెనలు తెగిపోయాయి. ఎగువన కురిసిన వానలతో జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. పలుచోట్ల వాగులు పొంగిపొర్లాయి. చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరుతున్నది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న మూడ్రోజుల పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆలస్యంగానైనా భారీ వర్షాలు పడుతుండటంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. ముమ్మరంగా సాగుకు సిద్ధమయ్యారు. రాజధాని హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

వివరాలు 3వ పేజీలో

# అజేయశక్తి టీఆర్‌ఎస్

- 27 నుంచి పండుగలా సభ్యత్వ నమోదు
- ప్రతి జిల్లాలో పార్టీ శిక్షణా తరగతులు: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 29 జిల్లా కార్యాలయాలకు ఒకేసారి భూమిపూజ
- శంకుస్థాపనలు చేసిన మంత్రులు, జెడ్పీ చైర్మన్లు
- సిరిసిల్లలో కార్యక్రమానికి హాజరైన కేటీఆర్
- ఒక్కో కార్యాలయ నిర్మాణానికి రూ.60 లక్షలు
- నిధులు కేటాయించిన పార్టీ అధినేత కేసీఆర్



సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద టీఆర్‌ఎస్ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ. చిత్రంలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, టీఆర్‌ఎస్ నాయకులు కూడా ఉన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి కార్యకర్తలే వారధి

- ప్రతి సంక్షేమ పథకం గడపగడపకూ చేరాలి
- తెలంగాణకు కేసీఆర్, టీఆర్‌ఎస్ శ్రీరామరక్ష
- ప్రజాశీస్సులతోనే అన్ని ఎన్నికల్లో అద్భుత ఫలితాలు
- దసరాకల్లా కార్యాలయాలు పూర్తికావాలి: కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో అభివృద్ధిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పరుగులు పెట్టిస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే ఎలా నిర్మించారన్న చర్చ దేశమంతా జరుగుతున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత రాష్ట్రాన్ని సాధించి, రెండోసారి అధికారంలోకి వస్తుందని, అజేయమైనశక్తిగా ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు మొదలుకొని మండల, జిల్లాపరిషత్ ఎన్నికల వరకు చరిత్రను తిరుగరాస్తూ ప్రజలు అద్భుతమైన ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో పాలన చేపట్టి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరవేసేందుకు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా టీఆర్‌ఎస్ కార్యకర్తలు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 29 జిల్లాల్లో టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఆయా జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు, జెడ్పీ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, పార్టీ ముఖ్యనేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రమంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల భూమి పూజల్లో, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గద్వాలలో, జీ జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో, ఈటల రాజేందర్ కరీంనగర్‌లో, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్‌లో, ఎర్రబెల్లి దయాకర్‌రావు జనగామలో, మల్లారెడ్డి మేడ్చల్‌లో, కొప్పుల ఈశ్వర్ జగిత్యాలలో, వేముల ప్రశాంత్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొని

మిగతా 2వ పేజీలో

## సదరన్ ట్రావెల్స్ నిర్వాకం



హిల్సా స్టేషన్ వద్ద చిక్కుకుపోయిన తెలంగాణ యాత్రికులు

- మానససరోవర యాత్రికులను అర్ధాంతరంగా వదిలేసిన సంస్థ
- నాలుగు రోజులుగా హిల్సా స్టేషన్ వద్ద 40 మంది పడిగాపులు
- ఎట్టకేలకు కఠ్మాండు చేరిక.. నేడోరేపో నగరానికి రాక

2

## కాళేశ్వరానికి జాతీయహోదా ఇవ్వండి

- మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు సహకరించండి
- విభజన సమస్యలు వెంటనే పరిష్కరించండి
- కేంద్రం చేపట్టిన ప్రజాప్రయోజన కార్యక్రమాలకు మొదట మద్దతునిచ్చింది తెలంగాణ ప్రభుత్వమే
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు



నామా నాగేశ్వరరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచంలోనే అద్భుతమైన రీతిలో నిర్మించిన బహుళార్థసాధక ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. విభజన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలకు కేంద్రం ఆర్థికంగా చేయూతనివ్వాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నామా నాగేశ్వర్‌రావు సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. ప్రపంచంలోనే ఒక అద్భుత నిర్మాణంగా చరిత్రకెక్కుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని గత కొంతకాలంగా కేంద్రాన్ని కోరుతున్నామని గుర్తుచేశారు. భారీ ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తిచేసి తమ ప్రభుత్వం కొన్నిరోజుల క్రితమే ప్రారంభించిందని తెలిపారు. తమ ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో

## సచివాలయ నిర్మాణంపై ఉపసంఘం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సారథ్యం
- నమూనాలు పరిశీలించనున్న సబ్ కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన సచివాలయం నిర్మాణంపై రాష్ట్రప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. రోడ్లు- భవనాలు, రవాణాశాఖల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ఈ కమిటీలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్ సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 27వ తేదీన నూతన సచివాలయ భవనానికి, నూతన అసెంబ్లీ భవనానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్న సంగతి తెలిసిందే. ఈ భవన నిర్మాణాల నమూనాలను పరిశీలించి, నిపుణులతో చర్చించి, ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకువెళ్లాలనేదానిపై బ్లూప్రింట్‌ను మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వానికి అందిస్తుంది. కొద్దిరోజుల క్రితం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సోమవారం మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. పాత సెక్రటేరియట్ స్థానంలోనే కొత్త సెక్రటేరియట్‌ను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.






## పాస్‌బుక్ ఇచ్చిన్రు..
## రికార్డులు మార్చలేదు

- అమ్మినోళ్లు అట్కాయిస్తున్నరని ఆన్‌లైన్ చేస్తలేరు
- పాత పాస్‌పుస్తకం ఉన్నా.. కొత్తదియ్యలేదు
- ఫిర్యాదుచేసినా పట్టించుకుంటలేరు
- నాగర్‌కర్నూల్ జిల్లా జాజాల గ్రామ రైతు ఆవేదన




బాధిత రైతు దామోదర్‌రెడ్డి

**ఓ రైతు** కొన్న భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చిన రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల్లో పేరు మార్చకపోవడంతో ఆ భూమి అతనిది కాకుండాపోయే పరిస్థితి ఏర్పడింది. తన భూమికి సంబంధించి రికార్డుల్లో పేరు మార్పిడి కోసం బాధిత రైతు రెండేండ్లుగా అష్టకష్టాలు పడుతున్నారు. అతను భూమి కొని ఇరవై ఏండ్లు కాగా, పాస్‌పుస్తకం వచ్చి పదిహేనేండ్లయింది. ఇప్పుడు రికార్డుల్లో పేరు మారలేదంటూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా నిలిపేశారు. తన భూమి ఆన్‌లైన్ ఎందుకు చేస్తలేరని రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే అమ్మినోళ్లు అభ్యంతరం చెప్తున్నారని దాటవేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల బాధిత రైతు రెండు విడుతల రైతుబంధు సాయం నష్టపోయారు. పదిహేనేండ్లుగా లేని సమస్య ఇప్పుడు రావడంపై నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం జాజాల గ్రామ రైతు దేరెడ్డి దామోదర్‌రెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

వివరాలు 4వ పేజీలో




# జూలై 3న తెలంగాణ, ఏపీ సీఎస్‌ల భేటీ?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో వచ్చేనెల మూడోతేదీన ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు) సమావేశం కానున్నట్టు తెలుస్తున్నది. వీరు ప్రధానంగా నీటిపారుదల, విద్యుత్, పౌర సరఫరాలశాఖల్లో నెలకొన్న విభజన సమస్యలపై చర్చించనున్నట్టు సమాచారం. అంతకుముందు ఈ నెల 28, 29 తేదీల్లో ఇరు రాష్ట్రాల సీఎంలు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశమై.. విభజన అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యమంత్రుల భేటీ అనంతరం జూలై 3న జరిగే సీఎస్‌ల సమావేశంలో ప్రధానంగా అపరిష్కృతంగా ఉన్న విభజన అంశాలపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకోనే అవకాశం ఉన్నదని అధికారవర్గాలు చెప్తున్నాయి.


సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన మంత్రి నిరంజన్‌రెడ్డి

# ఇస్టా సదస్సుకు రండి

- గవర్నర్, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆహ్వానం
- ముగింపు ఉత్సవంలో పాల్గొననున్న గవర్నర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 26 నుంచి జూలై 3 వరకు హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 32వ అంతర్జాతీయ విత్తన సదస్సు (ఇస్టా)కు రావాల్సిందిగా గవర్నర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆహ్వానించారు. సోమవారం సాయంత్రం మంత్రి నిరంజన్‌రెడ్డి.. వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా, ఇస్టా కో-ఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులుతో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. మంత్రి ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన గవర్నర్.. ఈ నెల 28న జరిగే సదస్సు ముగింపు కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా ఆహ్వానాలు పంపారు. సీఎం కేసీఆర్ గత ఐదేండ్లలో వినూత్న నిర్ణయాలతో దేశంలో తెలంగాణను విత్తనకేంద్రంగా నిలిపారని, ఇస్టా కాంగ్రెస్-2019తో తెలంగాణ ఖ్యాతి అంతర్జాతీయంగా వెలుగొందడం ఖాయమని మంత్రి పేర్కొన్నారు.





టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయ భవనం భూమిపూజ అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని కూడా ఉన్నారు .. కార్యక్రమానికి హాజరైన టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అజేయశక్తి టీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి...

శంకుస్థాపనలు చేశారు. ఇతర జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్లు, చైర్‌పర్సన్లు భూమి పూజ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డు వద్ద సమీకృత కలెక్టరేట్ సమీపంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగిస్తూ, నా తెలంగాణ కోటి ఎకరాల వీణ అన్న దాశరథిని గుర్తుచేస్తూ తెలంగాణ కోటి ఎకరాల మాగాణి కావాలన్న ఆశయంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని చెప్పారు. మనం చేస్తున్న పనులకు భగవంతుడి ఆశీస్సులు ఉన్నందునే కాళేశ్వరం ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసుకున్నామని అన్నారు. భవిష్యత్తులో పాలమూరు, రంగారెడ్డి, సీతారామ, డిండి ఎత్తిపోతలను పూర్తిచేసుకుని తెలంగాణ సస్యశ్యామలం కానున్నదని చెప్పారు. ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్న కేటీఆర్.. వారి త్యాగాలను భవిష్యత్ తరాలు గుర్తుచేసుకుంటాయని కొనియాడారు. ఇంజినీర్ల పని అద్భుతమని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం బాగుండాలన్నా, కృష్ణా, గోదావరి జలాలు రావాలన్నా అది కేసీఆర్, టీఆర్ఎస్ నాయకత్వంలోనే సాధ్యమని స్పష్టంచేశారు. ప్రతి ఇంటిలో కేసీఆర్ ఫొటో పెట్టుకునే రోజులు త్వరలో వస్తాయన్నారు. కార్యదక్షుడు, సత్తా ఉన్న నాయకుడు ఆనాడు ఉద్యమాన్ని, ఈ రోజు ప్రభుత్వాన్ని అద్భుతంగా నిర్వహించినందునే ప్రజల ఆశీర్వాదం మనకు ఉన్నదని, ఆ విషయం ప్రతి ఎన్నికల్లోనూ నిరూపితమయ్యిందని చెప్పారు. కేసీఆర్‌లాంటి నాయకుడు, టీఆర్ఎస్ ఉన్నంత కాలం తెలంగాణకు టీఆర్ఎస్ శ్రీరామ రక్ష అనే మాటను గ్రామగ్రామానా గుండెగుండెకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని కార్యకర్తలకు గుర్తుచేశారు.

## ఒకేసారి 29 జిల్లా పార్టీ కార్యాలయాలకు భూమి పూజ

ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా 29 జిల్లాలకు భూమి పూజలు నిర్వహించడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ ఏ రాజకీయ పార్టీ చేయలేదని, దేశంలోని ఇతర పార్టీలు కూడా ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో నిర్మాణాలు ప్రారంభించలేదని పలువురు గుర్తుచేస్తున్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పార్టీ కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర పార్టీ నుంచే ఒక్కో కార్యాలయం నిర్మాణానికి పార్టీ అధినేత కేసీఆర్ రూ.60 లక్షల చొప్పున కేటాయించారు. దసరానాటికి అన్ని కార్యాలయాలను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పార్టీ కార్యాలయాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 29 జిల్లాల్లో ఒక్కో ఎకరం చొప్పున స్థలాలను టీఆర్ఎస్ కొనుగోలుచేసింది. అన్ని కార్యాలయాలు ఒకే నమునాలో ఉండేలా కేసీఆర్ ప్రణాళిక సిద్ధంచేశారు.

## 27నుంచి పార్టీ సభ్యత్వ నమోదు

అజేయమైన రాజకీయ శక్తిగా ఎదిగిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. ఈ నెల 27న పార్టీ సభ్యత్వాన్ని తొలుత సీఎం కేసీఆర్ తీసుకున్న తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలతో జిల్లాలవారీగా చేపట్టనున్నట్టు చెప్పారు. పార్టీ కార్యాలయాలను దసరా పండుగ నాటికి పూర్తిచేసుకుని, అందులోనే శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు మెజార్టీ ఇచ్చిన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సుశిక్షితులైన గులాబీ కార్యకర్తలను తయారుచేయాలన్నది పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధార్మిక, కార్మిక క్షేత్రాలైన సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దసరా పండుగకు సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

### సిరిసిల్ల జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు

కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. మధ్యమానేరు నుంచి 11 టీఎంసీల నీటితో ఎగువ మానేరును నింపి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండులక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని చెప్పారు. వంటి పథకాలు అమలుచేస్తున్న సీఎం కేసీఆర్.. అన్నదాతలు అభివృద్ధి చెందాలంటే ఇంకేమి చేయాలన్న ఆలోచనతో ముందుకు పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, లోక బాపురెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, చీటి నర్సింగరావు, చిక్కాల రామారావు, జిల్లా అధికార ప్రతినిధి తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరానికి జాతీయహోదా ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి...

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని మూడేండ్ల రికార్డు సమయంలోనే ప్రాజెక్టును పూర్తిచేయగలిగారని వివరించారు. 21వ శతాబ్దంలో నీటిసంక్షోభం ప్రధాన సమస్యగా మారనున్నదని, సంక్షోభాన్ని తట్టుకోవటానికి ఎంతో ముందుచూపుతో తమ ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఆరువందల మీటర్ల ఎత్తుకు నీటిని పంప్‌చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేసినట్టు తెలిపారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరిస్తున్నామని నామా చెప్పారు. ఈ క్రమంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ అద్భుత ప్రాజెక్టుకు కేంద్రం వెంటనే జాతీయహోదా ఇవ్వాలని సభలో డిమాండ్‌చేశారు. ప్రజల ప్రయోజనం కోసం చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని, కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ పథకం ప్రవేశపెట్టకముందే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రారంభించిందని తెలిపారు. కేంద్రం కిసాన్‌సమ్మాన్ పథకం కింద ఏడాదికి ఐదెకరాలకు ఆరువేల రూపాయలను చెల్లిస్తుంటే.. ప్రస్తుతం తమ ప్రభుత్వం రైతుబంధు కింద ప్రతి ఎకరాకు సంవత్సరానికి పదివేల రూపాయలు ఇస్తున్నదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకోసం తమ రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఏడువందల గురుకులాలను ఏర్పాటుచేసిందని తెలిపారు. ప్రజాప్రయోజనాలను కాంక్షించి కేంద్రం ఏ కొత్త కార్యక్రమాన్ని చేపట్టినా తమ ప్రభుత్వం మొదట మద్దతునిచ్చిందన్న విషయాన్ని మరిచిపోరాదన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ విస్తృత ప్రయోజనాలను ఆశించి నిర్మిస్తున్న ప్రాజెక్టులకు కేంద్రం తనవంతు సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉన్నదని ఆయన స్పష్టంచేశారు. చాలాకాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నామా డిమాండ్ చేశారు.


సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు


సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నుంచి రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు అందుకొంటున్న గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్


స్వచ్ఛ అవార్డులు అందుకొన్న తెలంగాణకు చెందిన అధికారులు, ప్రతినిధులు

# రాష్ట్రానికి స్వచ్ఛ అవార్డుల పంట

- తెలంగాణకు ఐదు అవార్డులు
- ఢిల్లీలో ప్రదానం చేసిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నీతూకుమారి ప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వచ్ఛ మహోత్సవ్-2019లో వివిధ విభాగాల్లో తెలంగాణ ఐదు అవార్డులను సొంతం చేసుకున్నది. సోమవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డులను కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రదానం చేశారు. ప్రత్యేక వ్యక్తిగత విభాగంలో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లికి చెందిన బిక్షపతి, జగిత్యాల జిల్లా శాంతక్కపల్లికి చెందిన రమకు అవార్డులు అందుకున్నారు. జిల్లాల అంశాల్లో పెద్దపల్లి జిల్లా దేశంలో మూడో స్థానం, దక్షిణాది రాష్ట్రాల్లో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ అవార్డును పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన అందుకొన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులకు ఝార్ఖండ్, మహారాష్ట్ర, తెలంగాణ ఎంపికకాగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్ అవార్డును అందుకున్నారు. జిల్లాల ప్రత్యేక విభాగంలో వరంగల్ జిల్లాకు అవార్డు లభించింది. మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, సుందరీకరణలో రాష్ట్రం ఈ ప్రగతి సాధించింది.

## టీఆర్టీ ఎస్జీటీ విత్‌హెల్డ్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్టీ నియామకాల్లో భాగంగా విత్‌హెల్డ్‌లో ఉంచిన (నిలిపివేసిన) ఎస్జీటీ క్యాటగిరీలోని ఫలితాలు విడుదల చేసినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ జాబితాను తమ వెబ్‌సైట్లో పొందుపర్చినట్టు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. గతంలో టీఆర్టీ పరీక్షలు రాసిన పలువురు అభ్యర్థులు పలు సందర్భాల్లో టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులపై సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే, అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారు. ఒత్తిడి పెంచే విధంగా సభ్యులకు ఫోన్‌కాల్స్ చేయడంతోపాటు వాటిని రికార్డుచేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ విధివిధానాల ప్రకారం వారిపై చర్యలు తీసుకొని ఫలితాలను విత్‌హెల్డ్‌లో ఉంచింది. ఆ తర్వాత అభ్యర్థులు కమిషన్‌ను ఆశ్రయించి తమ పొరపాటును మన్నించాలని కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన కమిషన్ భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం చేయబోమని అభ్యర్థుల నుంచి హామీ పత్రం తీసుకొని వారి ఫలితాలను విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఇదే సమయంలో అభ్యర్థులపై పలు చర్యలు తీసుకొన్నది. ఆయా అభ్యర్థులు ఏడాది పాటు టీఎస్‌పీఎస్సీ నిర్వహించే ఏ రకమైన నోటిఫికేషన్లకు హాజరు కాకుండా, డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సైతం హాజరు కాకుండా అనర్హులను చేసింది. మే 27 నుంచి ఈ చర్యలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నది.

# సదరన్ ట్రావెల్స్ నిర్వాకం

## మానససరోవర యాత్రికులను అర్ధాంతరంగా వదిలేసిన వైనం

- నాలుగు రోజులుగా హిల్సాస్టేషన్ వద్ద 40 మంది పడిగాపులు
- ఎట్టకేలకు కఠ్మాండు చేరిక.. నేడోరేపో నగరానికి రాక

**దుండిగల్:** మానససరోవర యాత్రకు వెళ్లిన 40 మంది యాత్రికులు సదరన్ ట్రావెల్స్ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా నాలుగు రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఆహారం, నీరులేక అనేక ఇబ్బందులు పడ్డారు. బాధితుల్లో టీఆర్ఎస్‌కేవీ నేత మదన్‌గౌడ్ కుటుంబసభ్యులతోపాటు పలువురు ఉన్నారు. ఈ విషయం వాట్సప్ ద్వారా మీడియాకు తెలియడంతో సదరన్ ట్రావెల్స్ యాజమాన్యం స్పందించి సోమవారం సాయంత్రం వారిని నేపాల్ రాజధాని కఠ్మాండుకు తరలించినట్లు తెలుస్తున్నది. వారిని తిరిగి క్షేమంగా తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటున్నట్టు ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి తెలిపారు. వివరాల్లోకెళ్తే.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్‌కు చెందిన మదన్‌గౌడ్, ఆయన భార్య మంజుల, కుమారులు శివదత్తు, మహేశ్ ఈ నెల 13న సదరన్ ట్రావెల్స్ ద్వారా మానససరోవర యాత్రకు వెళ్లారు. అదేప్రాంతానికి చెందిన మరో ఐదుగురు సహా తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 44 మంది ఈ యాత్రకు బయలుదేరి వెళ్లారు. ప్రయాణ ఖర్చులు, బస తదితరాల కోసం సదరన్ ట్రావెల్స్‌కు ఒక్కొక్కరు రూ.2 లక్షలు చొప్పున చెల్లించారు. యాత్ర సజావుగా పూర్తిచేసుకుని నాలుగు రోజుల క్రితం తిరుగు ప్రయాణమైన వీరంతా నేపాల్, చైనా సరిహద్దులోని 'హిల్సా స్టేషన్' (హెలిప్యాడ్) వద్ద చిక్కుకుపోయారు. నాలుగురోజుల పాటు నిద్రాహారాలు లేకుండా గడిపారు. యాత్రకు తీసుకువెళ్లిన సదరన్ ట్రావెల్స్ యాజమాన్యం చేతులెత్తేసిందని, తమను పట్టించుకోలేదని, అస్వస్థతకు గురైనా జాలి కూడా చూపలేదని బాధితులు వాపోయారు. చివరకు మదన్ గౌడ్ వాట్సప్ ద్వారా తమబాధను వెలిబుచ్చడం, అది వైరల్ కావడంతో స్పందించిన ట్రావెల్స్ యాజమాన్యం.. సోమవారం బాధితులను హెలికాప్టర్ ద్వారా కఠ్మాండుకు తరలించినట్టు తెలుస్తున్నది. బాధితులు నేడోరేపో నగరానికి చేరుకోనున్నట్లు సమాచారం. హిల్సా స్టేషన్ వద్ద మంచు అధికంగా కురువడం వల్ల హెలికాప్టర్ ఎగురలేకపోయిందని, అందువల్లనే సమస్య తలెత్తిందని ఆ సంస్థ పేర్కొన్నది.


మానససరోవర యాత్రకు వెళ్లి నేపాల్-చైనా సరిహద్దులోని హిల్సా హెలిపాడ్ వద్ద పడిగాపులు కాస్తున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు


హిల్సాస్టేషన్ వద్ద సాయం కోసం ఎదురుచూస్తున్న యాత్రికులు

### ముహూర్తం

సూర్యోదయం: 5.48 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, అష్టమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 3.34 నుంచి సాయంత్రం 5.12 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.24 నుంచి 9.16 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.29 నుంచి 3.21 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.20 నుంచి 5.56 వరకు.

### లోకం పోకడ



డాడీ, ఇక మనం ఇంట్లో 'దొంగా-పోలీస్' ఆటాడుకుందాం!

# ప్రారంభమైన ఎంసెట్ కౌన్సెలింగ్

- తొలిరోజు ఫీజు చెల్లించి స్లాట్‌బుక్ చేసుకున్న 23,715 మంది విద్యార్థులు
- ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- అదేరోజు నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు
- ఎంసెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం సోమవారం నుంచి ఎంసెట్-2019 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి తొలి రోజు 23,715 మంది విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్‌బుక్ చేసుకున్నారు. ఆ విద్యార్థులు https://tseamcet.nic.in వెబ్‌సైట్ లాగిన్ కావాలని, సర్టిఫికెట్ల పరిశీలనకు ఈ నెల 27 నుంచి జూలై మూడు వరకు గడువు విధించామని ఎంసెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 27 నుంచి జూలై నాలుగు వరకు గడువు విధించామని పేర్కొన్నారు. తొందరగా ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకున్న విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి చాలా రోజుల వరకు అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

## ఈసెట్ కౌన్సెలింగ్‌కు 17,337 మంది స్లాట్ బుకింగ్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో లాటరల్ ఎంట్రీ (ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు) కోసం నిర్వహిస్తున్న ఈసెట్-2019 కౌన్సెలింగ్‌కు 17,337 మంది విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకున్నట్టు కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. సోమవారం ఒక్క రోజే 6,018 మంది ఫీజు చెల్లించారని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు స్లాట్ బుక్ చేసుకోవడానికి ఈ నెల 25 వరకే గడువు ఉందని పేర్కొన్నారు. ఈ నెల 26 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, ఈ నెల 27న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

## టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో గ్రూప్-2 అభ్యర్థుల జాబితా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రూప్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు సంబంధించిన జాబితాను ప్రతి సోమవారం తమ వెబ్‌సైట్లో పొందుపర్చనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూన్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు హాజరయ్యేవారి జాబితాతోపాటు మార్గదర్శకాలను ఇప్పటికే పొందుపర్చినట్టు పేర్కొన్నది. వారంవారం ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల జాబితాను సోమవారం తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది.

# పోలీసులకు వీక్లీ ఆఫ్ ప్రారంభం

- వరంగల్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో అమలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పోలీసులకు వారాంతపు సెలవులు (వీక్లీ ఆఫ్) ప్రారంభమయ్యాయి. వరంగల్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోని పోలీసులు సోమవారం నుంచి వీక్లీ ఆఫ్‌ను పొందారు. వారాంతపు సెలవును పొందినవారు కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు. మిగతా జిల్లాల్లో కూడా దాదాపు పదిరోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తికానున్నది. సీఎం కేసీఆర్ ఇచ్చినమాట ప్రకారం పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు అమలవుతుండటం సిబ్బందితోపాటు వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నది. రాష్ట్రం ఏర్పడిన ప్రారంభంలో నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దాదాపు ఏడాదిన్నరపాటు వారంతపు సెలవులను పాక్షికంగా అమలుచేశారు. పలు కారణాలతో అప్పుడు సాధ్యపడలేదు. తాజాగా డీజీపీ మహేందర్‌రెడ్డి ఈ ప్రక్రియపై అధ్యయనంచేసి, అన్ని విభాగాల వారికి అమలయ్యేలా చర్యలు ప్రారంభించారు. వారంతపు సెలవులను రానున్నరోజుల్లో పోలీసుశాఖలోని 60 వేల మందికి వర్తింపజేస్తారు. వీక్లీ ఆఫ్‌ను అందరికీ అమలు చేసేందుకు అదనపు డీజీ, ఐజీ, ఇతర అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లతోపాటు సిబ్బందితో మాట్లాడుతూ కార్యాచరణ రూపొందిస్తున్నారు.

### సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం వారాంతపు సెలవులు ప్రారంభం కావడం చాలా సంతోషం. పోలీస్ సిబ్బంది వీక్లీఆఫ్‌లతో కుటుంబానికి సమయం కేటాయించడంతోపాటు ఒత్తిడికి దూరమై ఆరోగ్యవంతులుగా మారుతారు. పోలీసింగ్‌లో వృత్తినైపుణ్యం పెరుగుతుంది. ఫ్రెండ్లీ పోలీసింగ్ మరింతగా బలపడుతుంది. ముఖ్యమంత్రికి, హోంమంత్రికి, డీజీపీకి కృతజ్ఞతలు.

**- గోపీరెడ్డి, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు**

## నూతన సీజేకు బార్‌కౌన్సిల్ సన్మానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ హైకోర్టు రెండో చీఫ్ జస్టిస్ (సీజే)గా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ రాఘువేంద్రసింగ్ చౌహాన్‌ను న్యాయవాదులు సన్మానించారు. సోమవారం హైకోర్టులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు జస్టిస్ చౌహాన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా సీజే మాట్లాడుతూ.. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు అత్యంత క్రమశిక్షణ గలవారని పేర్కొన్నారు. ఈ హైకోర్టు సంప్రదాయాలను కొనసాగించాలని కోరారు. న్యాయవాదుల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉన్నదని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు సూర్యకిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చలపతిరావు, ప్రధాన కార్యదర్శులు మలుగారి సుదర్శన్, రజినీకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## కొత్త చాంబర్లోకి డిప్యూటీ స్పీకర్ పద్మారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ డిప్యూటీ స్పీకర్ తిగుళ్ల పద్మారావుగౌడ్ కొత్త చాంబర్లోకి ప్రవేశించారు. సోమవారం ఉదయం అసెంబ్లీ అవరణలోని నూతన కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు పద్మారావును కలిసి అభినందనలు తెలిపారు. టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పద్మారావుకు శుభాకాంక్షలు తెలిపారు.



## రెవెన్యూశాఖలో అంతర్రాష్ట్ర బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ శాఖలో అంతర్రాష్ట్ర బదిలీ జరిగింది. వికారాబాద్ జిల్లాలో తాసిల్దారుగా పనిచేస్తున్న పీ చిన్న అప్పలనాయుడును ఆంధ్రప్రదేశ్‌కు, అక్కడ స్పెషల్ తాసిల్దార్ హోదాలో విజయవాడలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న బీ నారాయణను తెలంగాణకు బదిలీచేసింది. రెండురాష్ట్రాల అధికారులు పరస్పర బదిలీకి అంగీకారం తెలిపారు. దీంతో సోమవారం తాసిల్దార్ చిన్న అప్పలనాయుడును బదిలీచేస్తూ తెలంగాణ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులు జారీచేశారు.

## బీసీ ఉద్యోగార్థులకు ప్రత్యేక శిక్షణ

- గ్రూప్-2 అర్హులకు మాక్ ఇంటర్వ్యూలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీసీ ఉద్యోగార్థులకు స్టడీ సర్కిళ్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బీ వెంకటేశం తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-2 ఇంటర్వ్యూలకు ఎంపికైన బీసీ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-2కు ఎంపికైనవారికి హైదరాబాద్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలు జూన్ 27 నుంచి చేపడుతున్నట్టు తెలిపారు. గ్రూప్-2 ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ జీ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో శిక్షణ తరగతులు జరుపనున్నామని, పూర్తి వివరాలకు 6302427521 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

# విస్తారంగా వానలు



మెదక్‌లో వర్షానికి జలమయమైన రోడ్డు



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ చెరువులో వర్షంనీరు



ఆదిలాబాద్ జిల్లా గట్టేపల్లి గ్రామ పొలాల్లో వర్షం నీరు

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడ్రోజులపాటు భారీ వర్షాలు
- నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 7.4 సెంటీమీటర్ల వర్షపాతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. సోమవారం నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 7.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఎగువన కురిసిన వర్షాలతో జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. పలుచోట్ల వాగులు, చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. తొలకరి పలుకరింపుతో రైతులు ముమ్మరంగా సాగుకు సిద్ధమయ్యారు. మధ్యప్రదేశ్ దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ నుంచి 3.6 కిలోమీటర్ మధ్య ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. దీని ప్రభావంతో రాగల మూడ్రోజుల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కరీంనగర్ జిల్లా ఖాసింపేటలో 62.8 మిల్లీమీటర్లు, మెదక్ జిల్లా నాగపూర్‌లో 58.8, వాడిలో 54, సంగారెడ్డిలోని కంగ్టిలో 49, రాయికోడ్‌లో 26, కామారెడ్డి తాడ్వాయిలో 35.8, గాంధారిలో 36.8, భిక్కనూరు 36.8, నిజామాబాద్ చిన్నమవందిలో 43.3, జగిత్యాలలో 35.5, కత్లాపూర్‌లో 32.8, మాల్యాల్‌లో 30, ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరిలో 29.8, జగిత్యాల జిల్లా మన్నెగూడలో 29.5, కరీంనగర్ జిల్లా ఆసిఫ్‌నగర్‌లో 23.3, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో 23 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, షాబాద్, శంషాబాద్ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

### సిర్పూర్‌లో తెగిన తాత్కాలిక వంతెనలు

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 29.8 మి.మీ వర్షపాతం నమోదయింది. సిర్పూర్ యూ మండలంలో కంచన్‌పల్లి ఆశ్రమపాఠశాల ప్రహరీ కూలిపోగా.. సిర్పూర్ వాగు, రావునూర్ వాగుపై తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వంతెనలు తెగిపోయాయి. జైనూర్‌లో ఇండ్లలోకి వరద చేరింది. మంచిర్యాల మండలంలోని 29 గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, కుంటలు పొంగి పొర్లాయి. పలు చెరువుల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది.

### గట్టేపల్లిలో కోతకు గురైన చెరువు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం గట్టేపల్లిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో చెరువులు, చెక్‌డ్యాంలు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. పాతచెరువుకు గండిపడటంతో వరదనీరు పంటపొలాల్లో చేరింది. దీంతో సోయాబిన్ విత్తనాలు వరదనీటితో కొట్టుకుపోయాయి. నార్నూర్ మండలంలో ఎంపల్లి గ్రామ మట్టిరోడు కోతకు గురైం ది.నార్నూర్‌లోని ఆశ్రమపాఠశాల ప్రహరీ కూలిపోయింది.



### ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి

ధర్మపురి వద్ద సోమవారం గోదావరి నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. రెండుమాసాల క్రితమే ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ తగ్గి గోదావరి పూర్తిగా ఎండిపోయింది. ఆదివారం వరకూ ఎండిపోయినస్థితిలోనే కనిపించింది. అయితే ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి నదిలోకి స్వల్ప వరదనీరు చేరడంతో భక్తులు స్నానాలాచరించారు. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. స్నానాలాచరిస్తున్న భక్తులు అప్రమత్తమై ఒడ్డుకు వచ్చారు.

### నిర్మల్‌లో 74.3 మిమీ వర్షపాతం

నిర్మల్ జిల్లా కడెం, నిర్మల్, సోన్, దిలావర్‌పూర్, ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మండలాల్లో 74.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జ్లిలా కొండపాక మండలంలో భారీవర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని బీకే ఉప్పునుంతల, వంగురోనిపల్లి, లక్ష్మాపూర్, ఉడిమిళ్ల చెరువులు వర్షం నీటితో నిండిపోయాయి. మన్ననూర్, తుర్కపల్లి, మాచారం, బీకే తిరుమలాపూర్, మాధావానిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో కుండపోతవాన కురిసింది. మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో గాలివానకు రెండు ఇండ్లు కూలిపోయాయి.



తలుపులపై బిగించనున్న విగ్రహాలను పరిశీలిస్తున్న స్థపతి ఆనందవేలు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి

## యాదాద్రీశుని గర్భాలయ తలుపులు స్వర్ణమయం

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి గర్భాలయం తలుపులను స్వర్ణమయం చేసే ప్రక్రియను అధికారులు సోమవారం ప్రారంభించారు. 17/10 ఫీట్ల వెడల్పుతో ఉన్న తలుపులను స్వర్ణమయంచేసే ప్రక్రియలో భాగంగా తొలుత రాగిరేకులను అమర్చే పనులు నిర్వహించారు. నవ నారసింహులతోపాటు మరో మూడు అవతారాలను తెలిపే విగ్రహాలను అమర్చారు. తలుపులు అమర్చేందుకు ఏర్పాటుచేసిన శిలా గడపలు, చేకోట్లకు కూడా రాగి తొడుగులను అమర్చి ఎంత బంగారం అవసరమవుతుందోఅంచనావేశారు. రాగితో తయారుచేసిన పద్మాలు, లతలు, హంసల ప్రతిమలను కూడా తలుపులపై అమర్చాక ఎంత చూడముచ్చటగా ఉంటాయన్న విషయాన్ని స్థపతి డాక్టర్ ఆనందాచారి వేలు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి, కాంట్రాక్టర్ రవీంద్రాచారి పరిశీలించారు. రాగిరేకులపై బంగారుపూతను తీర్చిదిద్దేందుకు చెన్నైలోని గోల్డ్‌ప్లేటింగ్ సెంటర్‌కు పంపుతున్నట్టు చెప్పారు. ముఖమండపంలోని ధ్వజస్తంభాన్ని కూడా స్వర్ణమయం చేయనున్నట్టు తెలిపారు. ధ్వజస్తంభంపై అమర్చనున్న పద్మాలు, పీఠాలు, ఉపదండాలను కూడా చెన్నై పంపుతున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా తలుపులపై బిగించనున్న విగ్రహాలను పరిశీలించారు.

## చారిత్రక వరంగల్ కేంద్రంగా జిల్లా ఏర్పాటుచేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

- ప్రజల అభిప్రాయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం
- వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

**వరంగల్, నమస్తే తెలంగాణ:** కాకతీయుల రాజధాని, చారిత్రక వరంగల్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటుచేయాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోరారు. సోమవారం వరంగల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు, నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల ప్రజల అభిప్రాయాల మేరకు వరంగల్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటుచేయాలని కోరుతున్నామన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా సౌలభ్యంకోసం 33 జిల్లాలను ఏర్పాటుచేశారని తెలిపారు. వరంగల్ ప్రాంతంలో చారిత్రక ఖిలావరంగల్ కోట, ఎయిర్‌పోర్ట్, టెక్స్‌టైల్ పార్క్, ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ ఉన్నవని చెప్పారు. వ్యాపార, వాణిజ్యనగరమైన వరంగల్‌ను కేంద్రంగా చేసుకుని జిల్లాను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వరంగల్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేశంలోని అనేక పెద్దనగరాలు మూడు నాలుగు జిల్లాలుగా ఉన్నాయని, హైదరాబాద్ ఆరుజిల్లాలుగా కలిసి ఉన్నదని పేర్కొన్నారు. వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల స్థానంలో హన్మకొండ, వరంగల్ జిల్లాలుగా ప్రకటించాలని ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. చారిత్రకప్రాంతాలుగా పేరున్న ఈ ప్రాంతాల పేరుతో జిల్లాలు ఏర్పాటు చేస్తే దేశ స్థాయిలో గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలుగా ప్రకటించినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ మాత్రం ఒక్కటిగానే ఉంటుందని తెలిపారు.



విత్తనోత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్న రెండ్రోజుల వర్క్‌షాప్‌కు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో రైతు సమన్వయసమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తదితరులు ఉన్నారు.

# విత్తన ఎగుమతులతో రెట్టింపు ఆదాయం

### ఆఫ్రికా, ఆసియా దేశాల్లో అపార అవకాశాలు

- రైతులకు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన
- విత్తనోత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్‌పై హెచ్ఐసీసీలో వర్క్‌షాప్ ప్రారంభం
- నాణ్యమైన విత్తనోత్పత్తిలో అన్నదాతలకు సహకరిస్తామని రైతు సమన్వయ సమితి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి భరోసా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ నుంచి ఆసియా, ఆఫ్రికా దేశాలకు నాణ్యమైన విత్తనాలను ఎగుమతి చేసేందుకు అపారమైన అవకాశాలున్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ (ఇస్టా) 32వ సదస్సులో భాగంగా విత్తనోత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, రాష్ట్ర వ్యవసాయశాఖ, కేంద్ర వ్యవసాయశాఖ, ఎఫ్ఏవో సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండ్రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ స్వతహాగా రైతు కావడంతో అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు అవకాశమున్న పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. విత్తన ఎగుమతులతో రైతులకు రెట్టింపు ఆదాయం లభిస్తుందన్నారు. రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పాదకతకు నాణ్యమైన విత్తనమే కీలకమని, విత్తన ఎగుమతులు, మార్కెటింగ్‌కు అన్ని దేశాలూ అంగీకరించాలని పేర్కొన్నారు. అధిక విత్తనోత్పత్తికి రాష్ట్రంలో అత్యంత అనుకూల వాతావరణం ఉన్నదని, దాదాపు 1500 గ్రామాల్లోని 2.5 లక్షల మంది రైతులు 3లక్షల ఎకరాల్లో 65 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 413 విత్తన ప్రోసెసింగ్ ప్లాంట్లు, 13 పరీక్ష కేంద్రాలు పనిచేస్తున్నాయని, విత్తనోత్పత్తిలో నిమగ్నమైన రైతులకు సాయం చేసేందుకు రైతు సమన్వయ సమితి సభ్యులు ఎల్లవేళలా ముందుంటారని చెప్పారు.

### ప్రపంచ విత్తన వ్యాపారంలో భారత్ వాటా 4.4 శాతమే..

ప్రస్తుతం ప్రపంచ విత్తన వ్యాపారంలో భారత్ వాటా కేవలం 4.4 శాతమేనని, రాబోయే రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. గత రెండేండ్లలో ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) సంస్థ ద్వారా విత్తనాలు ఎగుమతిచేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. భారత విత్తనాలకు ఆఫ్రికా దేశాల్లో ఆదరణ ఎక్కువని, తెలంగాణ నుంచి ఇప్పటికే ఫిలిప్పీన్స్, సూడాన్, ఈజిప్టు దేశాలకు విత్తనాలు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. దక్షిణాసియాలోని మయన్మార్, థాయ్‌లాండ్, పాకిస్థాన్, నేపాల్, భూటాన్, శ్రీలంక తదితర దేశాలకు అవసరమైన అన్నిరకాల విత్తనాలను ఎగుమతిచేసే శక్తి తెలంగాణకు ఉన్నదని అన్నారు. దేశంలో మొక్కజొన్న, వరి, సోయాచిక్కుడు, సజ్జ, జొన్న పంటల హైబ్రిడ్ విత్తనోత్పత్తిలో తెలంగాణ వాటా 60 శాతం మేరకు ఉన్నదని పార్థసారథి తెలిపారు.

### విత్తన రంగంలో 17.18 శాతం వృద్ధిరేటు

వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయ వ్యాపారరంగంలో వృద్ధిరేటు 7.8 శాతంగానూ, విత్తనరంగంలో వృద్ధి 17.18 శాతంగానూ ఉన్నదని వెల్లడించారు. 2027 నాటికి భారత్ జనాభా చైనాను మించిపోతుందని, అందుకు అనుగుణంగా ఆహారభద్రతను మెరుగుపర్చేందుకు విత్తన ఆధారిత ప్రణాళికలు అవసరమన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే బాధ్యత విత్తన కంపెనీలపై ఉన్నదన్నారు. ప్రభుత్వరంగంలోని విత్తన కార్పొరేషన్ల ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి, విదేశాలకు ఎగుమతిచేసే పరిస్థితులు అభివృద్ధిచెందాలని తెలంగాణ విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు అన్నారు. విత్తనాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తి చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్, ఇస్టా కో-ఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులు, ఇస్టా అధ్యక్షుడు డాక్టర్ క్రెయిగ్ యంసిగిర్, ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి డాక్టర్ చికెల్ ఉబా, ఆఫ్రికా దేశాల విత్తన నిపుణులు, తెలంగాణ వ్యవసాయ వర్సిటీ, ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు తెలంగాణ అనుకూలం

- సాగుకు 2.78 లక్షల హెక్టార్ల గుర్తింపు
- కడెం విత్తనోత్పత్తి క్షేత్రంలో ప్రదర్శన
- ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామిరెడ్డి



ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను చూపుతున్న ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు 18 జిల్లాల్లోని 206 మండలాల్లో 2.78 లక్షల హెక్టార్లను సాగుకు అనుకూలంగా గుర్తించినట్లు ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని బొప్పాస్‌పల్లిలో 2 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటుచేసి పామాయిల్ పంటను సాగుచేసినట్టు చెప్పారు. నిర్మల్ జిల్లాలోని కడెం మండంలోని వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఆయిల్‌పామ్ ప్రదర్శన క్షేత్రం ఏర్పాటుచేయడానికి ప్రతిపాదించినట్టు వెల్లడించారు. గోదావరి నదీపరివాహక జిల్లాలు ఆయిల్‌పామ్‌సాగుకు అనువైనవిగా గుర్తించినట్టు చెప్పారు. ఉద్యానశాఖ, భారత పామాయిల్ పరిశోధన కేంద్రం (ఐఐవోపీఆర్), ఆయిల్‌ఫెడ్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఆ కమిటీ 2019 ఏప్రిల్ 4న కడెం ఫాం సందర్శించి సోమవారం నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేసినట్టు చెప్పారు. కమిటీ నివేదిక ప్రకారం క్షేత్రంలోని 26 ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని సూచిస్తూ, ఏడాది పొడవునా నీటి వసతి కల్పించేందుకు సూక్ష్మసేద్యం, నీటి కుంట ఏర్పాటుచేయాలని సూచించినట్లు సంచాలకుడు తెలిపారు.

## సీఎఫ్‌టీఆర్ఐని సందర్శించిన మైసూర్ బృందం

- స్పీకర్ పోచారం, ఉద్యానశాఖ డైరెక్టర్‌తో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంటర్ ఫర్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ) మైసూర్ డైరెక్టర్ రాఘవరావు సోమవారం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ రీసోర్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త జ్యోతిర్మయి, తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ బీ బాబు పాల్గొన్నారు. సీఎఫ్‌టీఆర్ఐ మైసూరు సాంకేతిక సహకారంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యానఅభివృద్ధి సంస్థ మేడ్చల్ జిల్లాలోని దుండిగల్ మండలం దూలపల్లి గండిమైసమ్మ గ్రామంలో చేపట్టాల్సిన సుగంధద్రవ్యాల ప్రోసెసింగ్ యూనిట్‌పై రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై చర్చించారు. యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి వచ్చిన అనుమతులు, కేంద్రప్రభుత్వం ఆమోదించిన గ్రాంటు, యూనిట్ సివిల్ వర్క్స్, నిధుల లభ్యతపై వివరించారు.డీపీఆర్ ప్రకారం సివిల్ వర్క్స్‌కు ప్రతిపాదించిన రూ.12 కోట్ల అంచనాను రూ.6 కోట్లకు తగ్గించాల్సిందిగా సివిల్ ఇంజినీర్లతో చర్చించి వివరాలు పంపాలని సంచాలకుడు కోరారు. అనంతరం సీఎఫ్‌టీఆర్ఐ బృందం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్, వారి బృందాన్ని వ్యవసాయశాఖ మంత్రితో కలిసి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటుచేయాల్సిన సుగంధద్రవ్యాల ప్రోసెసింగ్ యూనిట్లను సందర్శించాలని, రాష్ట్రంలో నియోజకవర్గాలవారీగా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలపై చర్చించాల్సిందిగా సూచించారు.



స్పీకర్ పోచారంతో సమావేశమైన సీఎఫ్‌టీఆర్ఐ మైసూర్ డైరెక్టర్ రాఘవరావు తదితరులు

SRI KONDA LAXMAN TELANGANA STATE HORTICULTURAL UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad - 500 030
Advt.No.002/PG Acad/2019 Date:25-06-2019
**Notification for Admission into M.Sc. (Hort.) and Ph.D. (Hort.) Courses – 2019-20**
Applications are invited for admission into M.Sc. (Hort.) with specialization in **1) Fruit Science, 2) Vegetable Science, 3) Floriculture & Land scape Architecture, 4) Plantation, Spices, Medicinal and Aromatic Crops** from candidates possessing B.Sc.(Hort.)/B.Sc.(Hons.) Horticulture and for Ph.D. (Hort.) from candidates with M.Sc.(Hort.) degree. Applications and Prospectus may be downloaded from the SKLTSHU website: www.skltshu.ac.in. Last date for receipt of filled in application is **20.07.2019** by **4.00 P.M.**
DR. K. RAVINDER REDDY
REGISTRAR

# పాస్‌బుక్ ఇచ్చిన్రు.. రికార్డులు మార్చలేదు

## అమ్మినోళ్లు అట్కాయిస్తున్నరని ఆన్‌లైన్ చేస్తలేరు

పాత పాస్‌పుస్తకం ఉన్నా.. కొత్తదియ్యలేదు

ఫిర్యాదుచేసినా పట్టించుకుంటలేరు

నాగర్‌కర్నూల్ జిల్లా జాజాలవాసి ఆవేదన

**హైదరాబాద్ నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం జాజాల గ్రామానికి చెందిన దేరెడ్డి దామోదర్‌రెడ్డికి అదే ఊరిలోని సర్వే నంబర్ 84/2/అలో 1.27 ఎకరాల భూమి ఉన్నది. సదరు భూమిని మేరెడ్డి ముత్యాల్‌రెడ్డి నుంచి 1991లో కొన్నారు. 1995 ఆ భూమిని రిజిస్ట్రేషన్ కోసం భూమి కొనుగోలు ఒప్పంద పత్రాలన్నీ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించారు. రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన చలాన్ కూడా కట్టారు. కానీ, దామోదర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇచ్చిన పత్రాలన్నీ అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయని అధికారులు చెప్పారు. తర్వాత దామోదర్‌రెడ్డి పేరిట 1.27 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు దామోదర్‌రెడ్డే మోఖాపై ఉన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో దామోదర్‌రెడ్డికి భూమి విక్రయించిన ముత్యాల్‌రెడ్డి అకస్మాత్తుగా వచ్చి ఆ భూమి తాను ఎవరికీ అమ్మలేదంటూ అభ్యంతరం తెలిపారు. దీంతో దామోదర్‌రెడ్డికి రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా ఆపి, పార్ట్-బీలో చేద్దామని పక్కన పెట్టారు. తాను భూమి కొన్న 20 ఏండ్లకు ముత్యాల్‌రెడ్డి ఎందుకు అభ్యంతరం తెలిపారని బాధితుడు దామోదర్‌రెడ్డి తెలుసుకోగా, అసలు విషయం బయటపడింది. దామోదర్‌రెడ్డికి సర్వే నంబర్ 84/2/అలో ఉన్న 1.27 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేసినప్పుడు ఆన్‌లైన్ రికార్డుల్లో మాత్రం దామోదర్‌రెడ్డి పేరిట భూమార్పిడి చేయలేదు. దీంతో రికార్డుల్లో ముత్యాల్‌రెడ్డే కొనసాగుతున్నారు. అందువల్ల భూరికార్డుల ప్రక్షాళన సమయంలో అభ్యంతరం తెలిపారు. తాను భూమి కొన్నప్పుడే రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో కూడా తన పేరు నమోదుచేస్తే ఈ సమస్య వచ్చేది కాదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముత్యాల్‌రెడ్డి తనకు భూమి అమ్మలేదని చెప్పగానే రెవెన్యూ అధికారులు విచారణ చేయకుండానే తనకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా నిలిపివేయడం అన్యాయమని బాధితుడు వాపోతున్నారు.

### రెండేండ్ల నుంచి తిరుగుతున్న

నా సమస్యను పరిష్కరించాలని రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నం. చేస్తం.. చేస్తం అంటున్నారే కానీ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. సదరు భూమిపై బ్యాంకులో గతంలో లోన్ కూడా తీసుకున్నం. పహాణీలో కూడా నా పేరే ఉన్నది. ముత్యాల్‌రెడ్డి వచ్చి అమ్మలేదని చెప్పగానే రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా ఆపడంతో రెండు విడుతల రైతుబంధు నష్టపోయిన. ఉన్నతాధికారులు విచారించి నాకు న్యాయం చేయాలి.

**- దేరెడ్డి దామోదర్‌రెడ్డి, బాధితుడు**




నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం జాజాల గ్రామానికి చెందిన దేరెడ్డి దామోదర్‌రెడ్డి పాత పాస్‌పుస్తకం

### అప్పుడే ఆన్‌లైన్ చేసుంటే సమస్య ఉండేది కాదు

ఈ సమస్య ఎన్నో ఏండ్ల కిందటిది. దామోదర్‌రెడ్డికి పాస్‌పుస్తకాలు వచ్చాయి. కానీ రికార్డుల్లో మాత్రం ముత్యాల్‌రెడ్డి ఉన్నారు. మోఖా మీద దామోదర్‌రెడ్డే ఉన్నారు. దామోదర్‌రెడ్డికి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరుచేసినప్పుడు ఆన్‌లైన్‌లో నమోదైన ముత్యాల్‌రెడ్డి పేరును తొలగించి దామోదర్‌రెడ్డి పేరును ఎంటర్‌చేస్తే సమస్యే ఉండేది కాదు. అప్పుడున్న రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగానే ఈ సమస్య వచ్చింది. సమస్య పరిష్కరిస్తామని ఇద్దరికీ నోటీసులిచ్చాం. కానీ ఎవరూ రాలేదు. దామోదర్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి మా దగ్గరికి వస్తే రికార్డు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

**- నాగమణి, వంగూర్ తాసిల్దార్**

### పార్ట్-బీలో చేస్తమని చెప్పాం

గతంలో ఉన్న పట్వారీలు దామోదర్‌రెడ్డి కొన్న భూమికి సంబంధించిన ఆన్‌లైన్ రికార్డుల్లో నుంచి ముత్యాల్‌రెడ్డి పేరును తొలగించలేదు. దీంతో భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ముత్యాల్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. అందుకే దామోదర్‌రెడ్డికి కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టాం. ఈ సమస్యపై ఇంతకుముందున్న అధికారులు సర్వేచేసి రిపోర్టు కూడా ఇచ్చారు. అందులో మోఖాపై దామోదర్‌రెడ్డే ఉన్నారని నిర్ధారించారు. పార్ట్-బీలో చేస్తామని చెప్పాం.

**- జ్యోతి, జాజాల వీఆర్వో**

# వారసత్వ హక్కు కాదు పొమ్మన్నారు

- కాసుల కక్కుర్తితో అక్రమార్కులకు పాస్‌పుస్తకం
- ఏండ్ల తరబడి తిరిగినా, కోర్టు డైరెక్షన్ ఇచ్చినా పట్టని తాసిల్దార్
- ధర్మగంటను ఆశ్రయించిన ఖమ్మం జిల్లా మర్లపాడు రైతు వెంకమ్మ



**సత్తుపల్లి, నమస్తే తెలంగాణ:** తనను పెంచుకొన్న పెద్దనాన్నకు వారసురాలిగా సంక్రమించిన ఆస్తిని.. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి అక్రమార్కులకు ధారదత్తం చేశారు. ఒకరికి చెందాల్సిన భూమిని మరో మహిళ పేరిట పాస్‌పుస్తకం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. నీవే వారసురాలివని తెలిపే పత్రాలు తెమ్మని దబాయిస్తున్నారు. ఏండ్లుగా తనకు న్యాయం జరుగకపోవడంతో 'నమస్తే తెలంగాణ' ధర్మగంటను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన జీగూరు వెంకమ్మను.. ఆమె పెద్దనాన్న పెంచుకొన్నారు. వెంకమ్మ పెద్దనాన్న పేరిట మర్లపాడులోని సర్వే నంబర్ 1625లో 1.05 గుంటల భూమి ఉన్నది. పెద్దనాన్న, పెద్దమ్మ చనిపోవడంతో.. వెంకమ్మ కుటుంబం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి వలస వెళ్లింది. ఇదే అదునుగా వీరి భూమిపై కన్నేసిన కొందరు వ్యక్తులు స్థానిక రెవెన్యూ సిబ్బంది సాయంతో ఆక్రమించారు. ఈ విషయం తెలుసుకొన్న వెంకమ్మ కుమారులు తమ పొలాన్ని చదును చేసి ఫెన్సింగ్ వేసుకొనే పనులు మొదలెట్టారు. ఇదే సమయంలో అక్రమార్కులు రంగప్రవేశంచేసి ఫెన్సింగ్ తొలగించారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఈ భూమి తమదని, పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయంటూ చూపడంతో విస్తుపోవడం వెంకమ్మ వారసుల వంతైంది. దీంతో తమ దగ్గర ఉన్న పహాణీలు, 1- బీ హక్కుపత్రాలను వేంసూరు తాసిల్దార్‌కు చూపి అక్రమార్కుల పాస్‌పుస్తకాలు రద్దుచేయాలని కోరారు. 'మీరే ఆ భూమికి వారసులనే ఆధారాలు ఏమైనా ఉన్నాయా? ఉంటే చూపండి' అని తాసిల్దార్ ప్రశ్నించారు. 2016లో సత్తుపల్లి సివిల్ కోర్టు వెంకమ్మ వారసురాలు అంటూ వెల్లడించిన పత్రాలను తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. 2014 నుంచి తమ భూమి అన్యాక్రాంతమైందని.. 1954 నుంచి 2018 వరకు ఆన్‌లైన్ పహాణీలు, 1- బీ హక్కుపత్రాలలో తన పేరు ఉన్నప్పటికీ సాదాబైనామా ప్రక్రియను అదునుగా తీసుకొని తప్పుడు వీలునామాతో కొందరు పాస్‌పుస్తకాలు చేయించుకొన్నారని వెంకమ్మ ఆరోపిస్తున్నారు. మర్లపాడు వీఆర్వో కిషోర్ రూ.30 వేలు లంచం అడిగాడని, అంత మొత్తం తాను ఇవ్వలేనని తెలుపడంతో అక్రమార్కులకు కొమ్ముకాసి తన భూమికి పాస్‌పుస్తకాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నిసార్లు ఆధారాలతో అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందంటూ వాపోయారు 68 ఏండ్ల వెంకమ్మ. 2018లో హైకోర్టును ఆశ్రయించగా కల్లూరు ఆర్డీవో, వేంసూరు తాసిల్దార్‌ను పేరు మార్పునకు డైరెక్షన్ ఇచ్చేవరకే చేగూరు సీతామహాలక్ష్మి పేరిట పాస్‌బుక్‌లు జారీచేశారని వెంకమ్మ పేర్కొన్నది. 'జీ'గూరు వెంకమ్మ పేరిట రావాల్సిన పాస్‌పుస్తకాన్ని 'చే'గూరు సీతామహాలక్ష్మి పేరిట జారీఅవడంలో ఆంతర్యం.. పొరపాటు అనుకోవాలా? కాసుల కక్కుర్తి అనుకోవాలా? అనేది వేంసూరు రెవెన్యూ అధికారులకే తెలియాలి. న్యాయబద్ధంగా వారసత్వ హక్కు కలిగి ఉన్న తనకు తన భూమి హక్కు పత్రాలు సంక్రమించేలా, అక్రమార్కులను శిక్షించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వెంకమ్మ 'నమస్తే తెలంగాణ' ధర్మగంటకు విజ్ఞప్తిచేశారు.

# మా భూమిని మరొకరికి పట్టాచేశారు



**మాడ్గుల:** నా పేరు చాకలి బాలకిష్టయ్య. మాది రంగారెడ్డి జిల్లా మాడ్గుల. 20 ఏండ్ల కిందట బతుకుదెరువు కోసం కుటుంబంతోసహా హైదరాబాద్‌కు వలస వెళ్లి వచ్చాం. అయితే సర్వే నంబర్ 652లో నా తండ్రి నారయ్య నుంచి వారసత్వంగా రావాల్సిన 1.20 ఎకరాల భూమిని మాకు తెలియకుండా రెవెన్యూ అధికారులు వేరేవారికి విరాసత్‌చేశారు. సర్వే నంబర్ 652లో నాలుగు ఎకరాల భూమి ఉన్నది. ఇందులో రామస్వామికి ఎకరం, నారయ్యకు 1.20 ఎకరాలు, నారయ్య సోదరుడు సాయన్నకు 1.20 ఎకరాలు ఉన్నది. అయితే నా తండ్రి నారయ్య పేరిట ఉన్న భూమిని మాకు తెలియకుండా అధికారులు మరొకరికి విరాసత్‌చేశారు. న్యాయం చేయాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మాకు చెందిన 1.20 ఎకరాల భూమిన 1954 నుంచి 2010 వరకు ఖాస్రా, పహాణీలో వచ్చింది. ఆ తర్వాత నుంచి చూపించడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని కోరుతున్నా.

### బాలకిష్టయ్యకు న్యాయంచేస్తాం

సర్వే నంబర్ 652లో ఉన్న భూమిలో భూప్రక్షాళనలో ఉన్న భూమి కన్నా 1.20 ఎకరాలు తక్కువగా రికార్డుల్లో వస్తుంది. సర్వేచేసి బాలకిష్టయ్య తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే భూమిని అతడికే ఇస్తాం. ప్రస్తుతం కాస్తులో ఉన్న వారితోపాటు పక్క పొలాల వారితో విచారణ నిర్వహించాం. సర్వే తదుపరి బాలకిష్టయ్యకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

**- మన్నయ్య, వీఆర్వో**

# లంచం ఇవ్వలేదని కక్షగట్టాడు

- రికార్డుల నుంచి రెండెకరాల భూమి తొలగించాడు
- తాసిల్దార్ బిర్రుతో వీఆర్వో చుక్కలు చూపిస్తుండు
- ఏడాదిన్నర నుంచి తిరుగుతున్నా న్యాయం దక్కడంలేదు
- వరంగల్ రూరల్ జిల్లా సన్నూరు గ్రామ రైతు ఆవేదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'కొన్నభూమిని రికార్డుల్లోకి ఎక్కించాలంటే వీఆర్వో రూ.20 వేలు అడిగిండు. దీనిపై ఆర్డీవోకు ఫిర్యాదుచేయడంతో నాపై కక్ష సాధిస్తున్నడు. తాసిల్దార్ బిర్రు చూసుకొని నా రెండెకరాల పైచిలుకు భూమిని రికార్డుల నుంచి తొలగించిండు. ఏడాదిన్నరగా వీఆర్వో ముప్పుతిప్పలు పెడుతున్నడు. నాకు మీరే న్యాయం చేయాలి' అంటూ వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన రైతు సుధగాని వెంకటేశ్వర్లు ధర్మగంటను ఆశ్రయించారు. రైతు సుధగాని వెంకటేశ్వర్లు, తండ్రి కొమురయ్యకు సర్వే నంబర్ 286లో 4.30 ఎకరాల భూమి ఉన్నది. దీనికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం ఇచ్చిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకంలో రెవెన్యూ అధికారులు ఎకరం తగ్గించి 3.30 ఎకరాల భూమిని మాత్రమే ఎక్కించారు. దీంతోపాటు సర్వే నంబర్ 360లో 1.15 ఎకరాలు భూమి (కొనుగోలు చేసింది) ఉన్నది. దీనికి సంబంధించి రికార్డుల్లో ఎక్కించి, కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని బాధితుడు రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకోగా.. వాస్తవాలను పక్కనపెట్టి ఇతరుల పేరు మీద భూమిని రికార్డుల్లోకి ఎక్కించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలా మొత్తం 2.15 ఎకరాల భూమి ఆ రైతు రికార్డుల్లో లేకుండాపోయింది. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా ఎలాంటి సమాధానం రాలేదు. వీఆర్వో, తాసిల్దార్లను పలుమార్లు కలిసినా ప్రయోజనం లేకుండాపోయింది. భూమి రికార్డుల్లోకి ఎక్కించాలంటే రూ.20 వేలు ఇవ్వాలని వీఆర్వో వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధితుడు వీఆర్వోపై ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. ఇక అప్పటినుంచి దాదాపు ఏడాదిన్నరగా సదరు రైతును వీఆర్వో తిప్పలు పెడుతున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ కనికరించడం లేదు. తాసిల్దార్ అండతో వీఆర్వో.. తనను ఎవరూ ఏమీ చేయలేరని బాధిత రైతును భయపెడుతున్నారు. దీంతో బాధితుడు న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకున్నారు.



### నా భూమిని రికార్డుల్లో ఎక్కించండి

భూమికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నప్పటికీ రికార్డుల్లోకి ఎక్కించకుండా, పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. మా గ్రామంలో ఇలాంటి సమస్యను ఎంతో మంది ఎదుర్కొంటున్నారు. వీఆర్వో, తాసిల్దార్‌కు ఫిర్యాదుచేసినా ప్రయోజనం ఉండటం లేదు. సొంత భూమి ఉండి కూడా రైతుబంధు సహా ఇతర ప్రయోజనాలు పొందలేకపోతున్నాను.

**- సుధగాని వెంకటేశ్వర్లు, రైతు**

### నా చేతుల్లో ఏమీలేదు

ఈ రైతు విషయంలో నా చేతిలో ఏమీలేదు. భూమికి సంబంధించిన పత్రాలు ఆయనకు ఉన్నాయి కావచ్చు. కానీ, వాస్తవంగా అంత భూమి అక్కడ లేదు. అలాంటప్పుడు ఎవరి నుంచి భూమి ఇవ్వాలి. ఇంకా ఇబ్బందులు ఉంటే ఆర్డీవో కోర్టుకు వెళ్లవచ్చు.

**- రవిచంద్రారెడ్డి, తాసిల్దార్, రాయపర్తి**

# ఆన్‌లైన్ నమోదులో రెవెన్యూ నిర్లక్ష్యం

భూయజమానికి సరికొత్త సమస్యలు

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారంలో ఘటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భూమికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నా.. భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి రెవెన్యూ అధికారులు.. యజమానులకు సరికొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామ శివారులోని 190/2 సర్వే నంబర్‌లో మందాడి సైదులుకు చెందిన ఎకరం భూమిని 2007 లో మామిడి బేబి సరోజన కొన్నారు. రూ.20 స్టాంపు పేపర్‌పై రాసుకొని కొనుక్కొని ఆ భూమిని సాగుచేసుకున్నారు. 2016 జూన్ 10 న ఈ భూమికి సంబంధించిన 13 బీ నమూనాను అప్పటి తాసిల్దార్ జారీచేశారు. కానీ, బేబి సరోజనకు సంబంధించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో డిజిటల్ పాస్‌బుక్ రాలేదు. రైతుబంధు కూడా అందలేదు. పన్నెండేండ్ల క్రితం కొన్న భూమిని ఆన్‌లైన్‌లో నమోదుచేయకుండా కబ్జాదారులకు అవకాశమివ్వడంతో సరోజనకు కష్టాలు మొదలయ్యాయి. ఈమె భూమి పక్కనే ఉన్న భూమికి సంబంధించిన మందాడి మల్లమ్మ సంబంధీకులు సరోజన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ భూమిలో సాగుచేసేందుకు కూడా సిద్ధపడ్డారు. సరోజనను మోఖా మీదకు రాకుండా అడ్డుపడుతున్నారు. ఈ వివాదంపై సరోజన కోర్టుకు కూడా వెళ్లారు. సరోజనకు భూమిని అమ్మిన సైదులు కోర్టుకు వచ్చి.. తాను సరోజనకు భూమి అమ్మినట్టు చెప్పడంతో కోర్టు కూడా ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్థానిక తాసిల్దార్ ప్రమీల వచ్చి స్థానికులను విచారించి, రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక కూడా పంపించారు. ఆ నివేదికలో కూడా 190/2 సర్వే నంబర్‌లో ఎకరం భూమి సరోజనకు చెందినదేనని రాశారు. మందాడి మల్లమ్మకు సంబంధించిన వారు యాజమానిని సాగుచేసుకోనివ్వకుండా శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని కూడా ఆమె పేర్కొన్నారు. అన్ని రకాల అనుకూలతలు ఉన్నా కూడా ఆన్‌లైన్‌లో నమోదుచేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలు సరోజన వాపోతున్నారు.

### సరోజన కాస్తులో లేరు

బేబి సరోజన కొనుగోలు చేసిన భూమినే మరొకరికి విక్రయించారు. వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో వారి పేరు మీదుగా రిజిస్ట్రేషన్‌లోకి వచ్చింది. ఆ భూమికి సంబంధించి డిజిటల్ పాస్‌బుక్ కూడా కొన్నవారికి జారీ అయింది. ప్రస్తుతం ఆ సర్వే నంబర్‌లోని మొత్తాన్ని ఆన్‌లైన్‌లో నమోదుచేశాం. సర్వే నంబర్‌లో ఉన్న భూమి కంటే ఎక్కువగా నమోదు చేయడానికి వీలుండదు. సరోజన ప్రస్తుతం ఆ భూమిలో కాస్తులోలేరు. గతంలో 13 బీని మాన్యువల్‌గా గతంలో ఉన్న తాసిల్దార్ జారీచేశారు.

**- ప్రమీల, తాసిల్దార్, పెన్‌పహాడ్**

# మూడెకరాల పట్టాభూమి మాయం!

అమ్ముకోగా మిగిలిన భూమికి పాస్‌పుస్తకం ఇవ్వడంలేదు

ఫిర్యాదుచేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

'ధర్మగంట'ను ఆశ్రయించిన రంగారెడ్డి జిల్లా పెంజర్ల రైతు గంగుల మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పెంజర్ల గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ x/3లో గంగుల మోహన్‌రెడ్డి, అతని ముగ్గురు సోదరులకు కలిపి మొత్తం 23 ఎకరాల భూమి ఉన్నది. ఇది తండ్రి నుంచి వీరికి వారసత్వంగా వచ్చింది. దీనికి సంబంధించిన ఆర్వోఆర్, పహాణీతోపాటు పాత పాస్‌పుస్తకాలు ఉన్నాయి. ఇందులో 26 గుంటలను 2011లో జగదీశ్‌కు, మరో 19.14 ఎకరాల భూమిని 2012లో ఓ కంపెనీ పేరిట మంద కృష్ణకు విక్రయించారు. ఇలా మొత్తం 20 ఎకరాలు అమ్ముకొన్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ కూడా అయింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ మిగిలిన మూడెకరాల విషయంలో సమస్య వచ్చింది. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా అమ్మకుండా మిగిలిపోయిన మూడెకరాల భూమికి సంబంధించి తమకు కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదు. కలెక్టర్ నుంచి వీఆర్వో దాకా ఎన్నోసార్లు అర్జీ పెట్టుకున్నా కనికరించడంలేదు. దీంతో బాధితుడు గంగుల మోహన్‌రెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

### పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఆడుకొంటున్నారు

'మేము నలుగురం అన్నదమ్ములం. మా అందరికీ కలిపి 23 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో 20 ఎకరాలు విక్రయించాం. ఇందులో ఓ కంపెనీ తరపున 19.14 గుంటలు కొనుగోలుచేశారు. దీనికి సంబంధించి సేల్ ఆఫ్ డీడ్ చేసుకొన్నారు. రెవెన్యూ అధికారులు మిగిలిన మూడెకరాలకు సంబంధించి మాకు పాస్‌పుస్తకం ఇవ్వడం లేదు. 2017 పహాణీ, ఆర్వోఆర్ ప్రకారం ఆ భూమి మా పేరిట ఉన్నది. ఇదే విషయమై అన్ని ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశాను. కలెక్టర్ ఇచ్చిన లెటర్‌ను డిప్యూటీ తాసిల్దార్‌కు ఇచ్చి.. న్యాయంచేయాలని అడిగినా ప్రయోజనం లేదు. పలు కారణాలు చెప్తూ తప్పించుకొన్నారు. అనంతరం తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్ బదిలీ అయ్యారు. ఇప్పుడున్న డిప్యూటీ తాసిల్దార్‌ను అడిగితే కలెక్టర్ నుంచి వచ్చిన లెటర్ దొరకడంలేదని చెప్తున్నారు. దయచేసి మా రికార్డులు పరిశీలించి, ఆన్‌లైన్‌లో సరిచేసి, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నాం. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల మా భూమి మాకు కాకుండా పోతున్నది. అన్ని రికార్డులు ఉన్నప్పటికీ పట్టా ఇవ్వకుండా మాతో ఆడుకొంటున్నారు.



**- గంగుల మోహన్‌రెడ్డి, పెంజర్ల గ్రామం, కొత్తూర్ మండలం, రంగారెడ్డి జిల్లా**

### రైతులే మోసం చేస్తున్నారు

ఒక్క మోహన్‌రెడ్డి మాత్రమే కాదు..అక్కడ ఎంతోమంది కంపెనీకి భూములు అమ్ముకున్నారు. ఇప్పుడు మళ్లీ భూమి కావాలని అంటున్నారు. వాళ్లే మోసం చేస్తున్నారు. భూమి వీళ్ల దగ్గర కొనుగోలు చేసినందుకు కంపెనీవాళ్లు, ఇతర కొనుగోలుదారులు ఇబ్బందిపడుతున్నారు. మోహన్‌రెడ్డి విషయంలో ఆ భూమి ఆయనేదనని చెప్పలేకపోతున్నాం. చాలా సమస్యలు ఉన్నాయి. ఇష్యూ మొత్తం నాకు తెలుసు. పరిష్కారం వెంటనే కాదు. ఈ విషయమై నివేదిక తయారుచేస్తున్నాం.

**- వెంకట్‌రెడ్డి, కొత్తూర్ తాసిల్దార్**

# నడువలేని స్థితిలో ఉన్నా.. తిప్పించుకొంటున్నారు



**తుంగతుర్తి:** నా పేరు దారం దామోదర్. మాది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామం. గ్రామంలోని సర్వే నంబర్ 78అఆలో 33.5 గుంటల భూమి నా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చింది. ఇందుకు సంబంధించిన పాత పాస్‌పుస్తకం కూడా ఉన్నది. ఈ భూమిని 20 ఏండ్లుగా సాగుచేస్తున్నా. కానీ, భూరికార్డుల ప్రక్షాళనలో కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. దీంతో నేను రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరమయ్యారు. రెండేండ్ల క్రితం నాకు పక్షవాతం రావడంతో నడువలేకపోతున్నాను. నా కుమారుల సహాయంతో రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. నడువలేని స్థితిలో ఉన్నా అధికారులు కనికరించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాకు కొత్త పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరుతున్నాను. ఈ విషయమై తాసిల్దార్ పాండునాయక్‌ను వివరణ కోరగా దామోదర్ పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి త్వరలోనే అందజేస్తామన్నారు.



సోమవారం కారును స్వాధీనం చేసుకుంటున్న విశ్వనాథ స్వామిజీ

## పీఠాధిపతికి వింత అనుభవం

### విశ్వనాథ స్వామీజీ కారుతో ఉడాయించిన డ్రైవర్

**శామీర్‌పేట:** విశ్వనాథ పీఠాధిపతి విశ్వనాథ స్వామీజీకి వింత అనుభవం ఎదురైంది. లఘుశంక తీర్చుకొనేందుకు కారు దిగగానే.. అదును చూసి డ్రైవర్ కారుతో ఉడాయించాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైలోని విశ్వనాథ పీఠాధిపతి విశ్వనాథ స్వామి చెన్నై నుంచి హైదరాబాద్ మీదుగా నాగ్‌పూర్ వెళ్తున్నారు. 44వ జాతీయ రహదారిలోకి వెళ్లేందుకు ఔటర్ రింగు రోడ్డు మీదుగా వస్తున్నారు. కీసర నుంచి కొద్ది దూరం వెళ్లగానే స్వామిజీ మూత్రవిసర్జనకు దిగారు. ఇదే అదనుగా డ్రైవర్ కారుతో పారిపోయాడు. దీంతో స్వామి స్థానికుల సాయంతో శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కంట్రోల్‌రూంతోపాటు అన్ని పీఎస్‌లను అప్రమత్తం చేయడంతో.. జీపీఆర్ఎస్ సాయంతో కారు పటాన్‌చెరులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను పట్టుకొని స్వామిజీకి కారు అప్పగించారు.



సోమవారం షూటింగ్‌లో భాగంగా చార్మినార్ వద్ద సిగరెట్ కాలుస్తున్న హీరో రామ్

## సినీ హీరో రామ్‌కు జరిమానా

### చార్మినార్ వద్ద పొగతాగినందుకు రూ.200 చలానా

**చార్మినార్:** నిబంధనలు పట్టించుకోకుండా చారిత్రక కట్టడం వద్ద పొగతాగిన సినీ హీరో రామ్‌కు చార్మినార్ పోలీసులు జరిమానా విధించారు. సోమవారం చార్మినార్ వద్ద 'ఇస్మార్ట్ శంకర్' సినిమా షూటింగ్‌లో భాగంగా రామ్ సిగరెట్ వెలిగించి బహిరంగ ప్రాంతాల్లో పొగ ఊదుతూ కనిపించారు. దీనిని గమనించిన పోలీసులు.. చారిత్రక చార్మినార్ వద్ద ధూమపానం సేవించడాన్ని నిషేధించిన కారణంగా రామ్‌కు రూ.200 చలానా విధించారు. ఈ ఘటనపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. చట్టానికి అందరూ సమానమేనని పోలీసులు నిరూపించారని మెచ్చుకున్నారు.





నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ఊటుకూరు పెదపాలెంలో చేపట్టిన సహాయచర్యలు (ఇన్‌సెట్) ప్రాణాలతో బయటపడ్డ బాలుడు

# నెల్లూరు జిల్లాలో విషాదం

- ఆడుకుంటూ వెళ్లి బోరుబావిలో పడిన ఇద్దరు చిన్నారులు
- రెండుగంటలు శ్రమించి బయటకు తీసిన సిబ్బంది
- చికిత్స పొందుతూ బాలిక మృతి
- మృత్యుంజయుడిగా బాలుడు



మృతిచెందిన చిన్నారి మోక్షిత

**విడవలూరు:** ఏపీలోని నెల్లూరు జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం సాయంత్రం విడవలూరు మండలం ఊటుకూరు పెదపాలెంలో బోరు బావిలో పడిన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు చని పోయారు. గోపిరాజ్ (4) ప్రాణాలతో బయట పడగా.. మోక్షిత (3)దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయింది. మోక్షిత స్వస్థలం ప్రకాశం జిల్లా చీరాల కాగా.. నెల్లూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. పక్కింట్లో ఉండే గోపిరాజ్‌తో కలిసి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇద్దరు పిల్లలు 20 అడుగుల లోతు గుంతలో పడిపోయారు. గంట తర్వాత బాలుడిని స్థానికులు బయటకు తీయగా.. మోక్షిత కోసం అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గుంతకు సమాంతరంగా జేసీబీతో మట్టిని తవ్వారు. రెండుగంటల అనంతరం ఆ పాపను బయట కు తీసుకొచ్చారు. అయితే, శ్వాస తీసుకో వడంతో ఇబ్బంది ఉండటంతో దవాఖానకు తరలించగా..చికిత్స పొందుతూ ఆ చిన్నారి చనిపోయింది. గోపిరాజ్ మాత్రం మృత్యుం జయుడిగా బయటపడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు వెల్లడించారు.

### అమెరికాలో రోడ్డు ప్రమాదం..

## హైదరాబాద్ యువకుడు మృతి



వసీంఅలీ (ఫైల్)

**చార్మినార్:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ పాతబస్తీ యువకుడు మృతిచెందాడు. డబీర్‌పురకు చెందిన వసీం అలీ (27) కొన్నేండ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం అమెరికా వెళ్లాడు. శాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతంలోని పాల్‌అవెన్యూలో నివసిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున విధులు ముగించుకుని కారులో తన స్నేహితునితో కలిసి ఇంటికి బయలుదేరాడు. పాల్‌అవెన్యూ సమీపంలో వేగంగా వచ్చిన మరోకారు ఢీకొట్టింది. దీంతో వసీం కార్డియో అరెస్ట్‌తో మృతి చెందాడు. ఈ సంఘటనపై అక్కడి ఎంబసీ అధికారులు తమకు సమాచారం అందించారని వసీం సోదరుడు ముబీన్ తెలిపారు. వసీం మృతదేహాన్ని శాన్‌ఫ్రాన్సిస్కో దవాఖాన మార్చురీలో భద్రపర్చారని, మృతదేహాన్ని తమకు అందించేలా రాష్ట్రప్రభుత్వం, కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆరు నెలల చిన్నారి కొనుగోలు..

## పోలీసులకు చిక్కిన నిందితుడు

- నిజామాబాద్‌లో కొనుగోలు చేసినట్టు ఒప్పుకొన్న నిందితుడు
- బాలుడిని శిశువిహార్‌కు అప్పగించిన బోయిన్‌పల్లి పోలీసులు



పోలీసులు చేరదీసిన బాలుడు

**కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ:** ఆరు నెలల చిన్నారిని కొనుగోలు చేసిన ఓ పాత నేరస్థుడు బోయిన్‌పల్లి పోలీసులకు చిక్కాడు. బాలుడిని శిశువిహార్ ప్రతినిధులకు అందజేసిన పోలీసులు.. నిందితుడిని కటకటాల వెనుకకు పంపారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజేశ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మున్నాపూర్‌కు చెందిన సీహెచ్ ప్రసాద్ లంగర్‌హౌస్ కాళీమందిర్ ప్రాంతంలో ఉంటున్నాడు. ఈ నెల 22న సాయంత్రం నిజామాబాద్ వెళ్లిన ప్రసాద్.. తిరుగుప్రయాణంలో మద్యం సేవించి బస్సు దొరుకకపోవడంతో బస్టాండ్‌లోనే పడుకొన్నాడు. మరుసటిరోజు అక్కడే ఉన్న కొందరు బిచ్చగాళ్లు చిన్న పిల్లలతో ఉండటం చూసి.. ఓ బాబును తనకిమ్మని అడిగాడు. రూ.10వేలు డిమాండ్ చేసి రూ.4వేలు తీసుకొన్న ఓ మహిళ.. ఆరు నెలల పసికందును ప్రసాద్‌కు అందజేసింది. బాలుడ్ని తీసుకొని బస్సెక్కిన ప్రసాద్ ఉదయం 10.30 గంటలకు బోయిన్‌పల్లిలో దిగాడు. అక్కడే పెట్రోలింగ్‌లో ఉన్న బోయిన్‌పల్లి పోలీసులకు ప్రసాద్ తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దాంతో ఆదుపులోకి తీసుకొని విచారించగా బాలుడ్ని కొని తీసుకొచ్చినట్టు ఒప్పుకొన్నాడు. చోరీ కేసులో గతంలో ప్రసాద్ జైలుకెళ్లాడని ఇన్‌స్పెక్టర్ రాజేశ్ తెలిపారు.

## అమరావతిలో అన్నదాతల ఆత్మహత్యలు!

### రెండేండ్లలో 11 మంది బలవన్మరణం.. ఇన్నేండ్లు తొక్కిపెట్టిన టీడీపీ సర్కారు

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఏపీ రాజధాని అమరావతిలో రెండేండ్లలో 11 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఇంతకాలమూ ఈ విషయాన్ని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తొక్కిపెట్టినప్పటికీ.. తాజాగా సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగుచూసింది. రాజధాని నిర్మాణం జరుగుతున్న క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) పరిధిలోని అమరావతి మండలంలో ఐదుగురు, తుళ్లూరులో ముగ్గురు, పెదకూరపాడులో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడినట్టు తేలింది. వీరిలో కొందరు తమ భూములకు నష్టపరిహారం అందక, మరికొందరు అప్పుల భారం మోయలేక బలవన్మరణాలకు పాల్పడినట్టు వెల్లడైంది. సమాచారహక్కు చట్టం కింద దాఖలైన అర్జీకి స్పందిస్తూ.. తుళ్లూరు సబ్‌డివిజనల్ ఆఫీసర్ రైతుల ఆత్మహత్యలపై సమాచారమిచ్చారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ 11 మంది రైతుల్లో ఆరుగురు దళితులేనని రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి బీ కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. రికార్డులకు ఎక్కకుండా ఆత్మహత్య చేసుకొన్నవారి సంఖ్య 20 మంది వరకు ఉంటుందని రైతు హక్కుల కోసం పోరాడే కార్యకర్త నరసింహం చెప్తున్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వమైనా ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు న్యాయంచేయాలని కోరారు. తన భర్త మరణానంతరం తమ కుటుంబానికి రూ. 7 లక్షల అప్పు మిగిలిందని అత్తలూరుకు చెందిన రైతు టీ వెంకటేశ్వరరావు (30) భార్య రోజా ఆవేదన వ్యక్తంచేశారు.

## విజయవాడలో 12 లారీలు దగ్ధం

- సుమారు రూ.2 కోట్ల ఆస్తినష్టం

**విజయవాడ:** ఏపీలోని విజయవాడ నగర శివారు ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 12 లారీలు మంటల్లో చిక్కుకున్నాయి. ఆరు లారీలు పూర్తిగా కాలిపోయాయి. మరో ఆరు లారీలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి గురైన లారీలు సౌత్ ఇండియా లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందినవిగా పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు భావిస్తున్నారు. సుమారు రూ.2 కోట్ల ఆస్తినష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనావేశారు.

# అఫిలియేషన్ విధానం రద్దు!

### ఇకపై కాలేజీలకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి!

ప్రైవేటు ఏజెన్సీలకు ఆ బాధ్యతలు ● టీచర్ ఎడ్యుకేషన్ వర్సిటీ ఏర్పాటుకు ప్రాధాన్యం

మూడువిభాగాలుగా వర్సిటీల విభజన ● జాతీయ విద్యావిధానంపై విద్యావేత్తల వెల్లడి



సోమవారం జాతీయ విద్యావిధానంపై జరిగిన చర్చలో పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి ఏ అశోక్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇక నుంచి అన్ని యూనివర్సిటీల పరిధిలో కొనసాగుతున్న అఫిలియేషన్ కాలేజీల విధానానికి స్వస్తి పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను మూడు విభాగాలుగా విభజించే ప్రయత్నం జరుగుతున్నది. వాటిలో అన్ని కాలేజీలకు అటానమస్ (స్వతంత్ర హోదా) తప్పనిసరిగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ స్థాయితోపాటు రాష్ట్రాలవారీగా కొనసాగుతున్న కళాశాలలకు ఇకపై నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు తప్పనిసరి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఒకే రకమైన న్యాక్ సంస్థ కాకుండా ప్రైవేటు ఏజెన్సీలకు ఆ బాధ్యతలు ఇవ్వాలన్న ప్రతిపాదనలు వస్తున్నాయి. సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జాతీయ విద్యావిధానంపై జరిగిన చర్చలో ఈ మేరకు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నేషనల్ యూనివర్సిటీస్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వర్గీస్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి ఏ అశోక్, ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ సొసైటీ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వీ వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాసరావు, వీసీలు, న్యాక్ మాజీ డైరెక్టర్ వీఎస్ ప్రసాద్, ఇక్ఫాయ్ యూనివర్సిటీ వీసీ మహేందర్‌రెడ్డి, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు. దాదాపు రెండుగంటలపాటు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని, యూనివర్సిటీలను పూర్తిగా పరిశోధనలకు పరిమితంచేయాలని పేర్కొన్నారు. అవసరమైన వసతులు కల్పించడంతోపాటు తగిన విధంగా నిధులు పెంచాలని సూచించారు. అన్ని కాలేజీలకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి చేసేక్రమంలో దేశ వ్యాప్తంగా ఒకే రకమైన న్యాక్ సంస్థ కాకుండా ప్రైవేటు ఏజెన్సీలకు ఆ బాధ్యతలు ఇవ్వాలన్న ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే.. మెరుగైన ఫలితాలు వస్తాయని కొందరు.. స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కౌన్సిల్‌ను కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుందని మరికొందరు అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

**ఒకే గొడుగు కిందకు విద్యావిధానం**

జాతీయ విద్యావిధానం ప్రతిపాదనలపై కేవలం ప్రాథమిక స్థాయిలోనే చర్చ జరిగిందని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఉన్నత విద్యావిధానంపై రకారకాల యూనివర్సిటీలు కొనసాగుతున్నాయని, ఈ విధానం మంచిది కాదనే ప్రస్తావన వచ్చిందన్నారు. ప్రతిపాదనలపై వర్సిటీలవారీగా విద్యార్థులు, అధ్యాపకుల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నామన్నారు. వాటిని క్రోడీకరించి ఈ నెల 28 వరకు ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలతో కేంద్రానికి నివేదిక అందజేస్తుందని, అప్పటివరకు ప్రతిపాదనలుగానే భావించాల్సి ఉందని అన్నారు.

# నయీం ముఠాపై పీడీ చట్టం



పాశం శ్రీను | అబ్దుల్ నాసిర్ | అబ్దుల్‌ఫయీం | హసీనాబేగం

### భార్యతోపాటు మరో ముగ్గురికి ఏడాదిపాటు జైలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నయీం గ్యాంగ్ సభ్యుల బెదిరింపులు, భూదందాలు, సెటిల్మెంట్లకు చెక్ పెట్టేందుకు నలుగురు ప్రధాన అనుచరులపై రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్ పీడీయాక్ట్‌ను విధించారు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత కొద్దిరోజులపాటు సైలెంట్‌గా ఉన్న అనుచరులు.. ఇటీవల భువనగిరి ప్రాంతంలో తమ ఉనికిని చాటుకొనేందుకు బెదిరింపులకు దిగారు. ఈ సమాచారం అందుకున్న రాచకొండ పోలీసులు మార్చి నెలలో పాశం శ్రీను, నయీం భార్య హసీనాబేగం, అబ్దుల్‌ఫయీం, అబ్దుల్‌నాసిర్‌ను అరెస్టుచేసి, జైలుకు తరలించారు. విచారణలో బయటపడ్డ వీరి నేరాలు, ప్రజలను భయపెట్టిన తీరును దృష్టిలో పెట్టుకొని మరోసారి ఈ ముఠా కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు నివారణచర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ నలుగురిపై పీడీయాక్ట్‌ను విధించి, ఏడాదిపాటు జైలులో ఉండేలా చర్యలు తీసుకొన్నారు.

**నయీం గ్యాంగ్ సభ్యులు నేర చరిత్ర**

నయీంకు ప్రధాన అనుచరుడైన పాశం శ్రీను ఆయనకు కుడిభుజంగా వ్యవహరించాడు.105 కేసుల్లో నిందితుడు. 2016లో పీడీయాక్ట్‌పై ఏడాదిపాటు జైలులో ఉన్నాడు. ఇటీవల అతనిపై మరో ఐదు కేసులు నమోదయ్యాయి. భూకబ్జాలకు పాల్పడటం, యజమానులను బెదిరించడం, నయీం పేరుతో వసూళ్లకు దిగి ప్రజల్లో భయాందోళనలు సృష్టించాడు. అమాయకుల స్థలాలను కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తాడు. యజమానులను తుపాకీతో బెదిరిస్తాడు.

**87 కేసుల్లో అబ్దుల్‌నాసిర్ నిందితుడు**

కిడ్నాప్‌లు, కుట్ర, అక్రమంగా నిర్బంధించడం వంటి 18 నేరాలతోపాటు మరో 87 కేసుల్లో అబ్దుల్‌నాసిర్ నిందితుడిగా ఉన్నాడు. 2017లో పీడీయాక్ట్ మీద జైలుకువెళ్ళాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి యథావిధిగా దందాలను మొదలుపెట్టాడు. ఇటీవల నాలుగు కేసుల్లో నిందితుడిగా బుక్ అయ్యాడు.

**ఫయీం నాలుగు కేసుల్లో నిందితుడు**

నయీంకు సోదరుడైన అబ్దుల్‌ఫయీం భూకబ్జాలు, మోసాలకు పాల్పడుతాడు. నాలుగు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నయీంతో కలిసి వందలాదిమందిని బెదిరించాడు. నయీం భార్య హసీనాబేగం 2006వ సంవత్సరం నుంచి నయీంతో కలిసి అనేక నేరాలకు పాల్పడింది. భూకబ్జాలకు పాల్పడటం, అమాయకులను బెదిరించడం, కిడ్నాప్‌లకు సంబంధించిన 29 కేసుల్లో నిందితురాలిగా ఉన్నది. 2017లో అరెస్టై జైలుకు వెళ్ళింది. తాజాగా భువనగిరి ప్రాంతంలో నాలుగు కేసుల్లో నిందితురాలిగా నమోదైంది. ఈ గ్యాంగ్ భువనగిరి, భువనగిరిటౌన్‌తో యాదాద్రి ప్రాంతంలో వందల ఎకరాలను కబ్జాచేసింది.

### విజయ డెయిరీ సిబ్బందిపై

## క్రమశిక్షణ చర్య

- ఆలస్యంగా హాజరుతో ఒకరి సస్పెన్షన్, ముగ్గురికి మెమోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో ఎండీ శ్రీనివాసరావు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉదయం 11 గంటలు దాటినా 90 శాతం మంది ఫెడరేషన్ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నా 99 శాతం మంది దాన్ని నియోగించకపోవడంపై మండిపడ్డారు. బయోమెట్రిక్ నిర్వహణలో విఫలమై, విధులకు ఆలస్యంగా వచ్చిన ఏఎంను వెంటనే సస్పెండ్‌చేసిన ఆయన, మరో ముగ్గురు అధికారులకు మెమోలు ఇచ్చారు. కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన సుమారు 90 మందికి ఒకరోజు వేతనాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# కొకైన్‌తో పట్టుబడ్డ నైజీరియన్లు

- ముగ్గురి అరెస్టు.. రూ.15 లక్షల విలువైన 254 గ్రాముల కొకైన్ పట్టివేత
- ముంబై, బెంగళూరు కేంద్రంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా



స్వాధీనం చేసుకున్న కొకైన్‌తోపాటు నిందితులను సోమవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో మీడియాకు చూపుతున్న హైదరాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ అంజిరెడ్డి తదితరులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ గోల్కొండ ప్రాంతంలోని ఒక నివాసంలో కొకైన్‌తోపాటు ముగ్గురు నైజీరియన్లను ఆదివారంరాత్రిఆబ్కారీ అధికారులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.15 లక్షలకు పైబడి విలువచేసే 254 గ్రాముల కొకైన్‌తోపాటు 3.2 లక్షల నగదు, మూడు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో సోమవారం మీడియాకు హైదరాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ నంద్యాల అంజిరెడ్డితో కలిసి డిప్యూటీ కమిషనర్ వివేకానందరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన లక్కీ అలియాస్ ఓబీ 2016లో హైదరాబాద్ వచ్చి గోల్కొండలోని ఖాదర్‌బాగ్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. స్వదేశం నుంచి డ్రగ్స్‌ను తీసుకువచ్చి విక్రయిస్తూ పలువురితో పరిచయాలు పెంచుకున్నాడు. గత జనవరిలో లక్కీ స్వదేశానికి వెళ్లిపోయి తన స్థానంలో జాడీపాస్కల్ అనే వ్యక్తిని నియమించాడు. లక్కీ నేరుగా జాడీపాస్కల్‌కు డ్రగ్స్‌ను పంపకుండా ముంబైలోని డాండి అనే తన అనుచరుడి ద్వారా పాస్కల్‌కు మాదకద్రవ్యాలను పంపించేవాడు. ఆదివారం ముంబై చెందిన డాండి అనుచరుడు ఒకోరో ఉచెన్నా శామ్యుల్, బెంగళూరుకు చెందిన ఎబుకా అనుచరుడు ఒగోచు కుచిమ గుడ్‌లక్‌లు గోల్కొండ, ఖాదర్‌బాగ్‌లో నివాసముంటున్న జాడీపాస్కల్ వద్దకు డ్రగ్స్‌కు సంబంధించిన డబ్బులు వసూలు చేయడానికి వచ్చారు. సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి ఖాదర్‌బాగ్‌లోని పాస్కల్ నివాసముంటున్న ఇంటిపై దాడులు జరిపారు. దాడుల్లో పాస్కల్‌తోపాటు ఒకోరో ఉచెన్నా శామ్యుల్, ఒగోచు కుచిమ గుడ్‌లక్‌లను అరెస్టు చేశారు.

## కిడ్నీ కొంటామని 21 లక్షలకు టోకరా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆర్థిక ఇబ్బందులతో కిడ్నీ అమ్ముకోవడానికి సిద్ధపడ్డ ఓ ప్రైవేటు ఉద్యోగిని సైబర్ మోసగాళ్లు నిండా ముంచారు. బాధితుడి నుంచి రూ. 21 లక్షలు కాజేశారు. ఈ ఘటన హైదరాబాద్ శివారులో చోటుచేసుకున్నది. సోమవారం బాధితుడు రాచకొండ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ విష్ణుపురం ప్రాంతానికి చెందిన రాజు (పేరు మార్చాం) ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో కిడ్నీని అమ్ముకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుదామని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం గూగుల్‌లో సెర్చ్ చేయగా.. అతడికి డాక్టర్ వెస్లీ నిర్వహిస్తున్న ఓ వెబ్‌సైట్ కనిపించింది. కిడ్నీ ఇస్తానంటూ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో డాక్టర్ వెస్లీ రాజుకు ఫోన్‌చేసి కిడ్నీ దానం చేస్తే రూ. 1.60 కోట్లు ఇస్తామంటూ నమ్మబలికాడు. నమ్మిన రాజు కిడ్నీ అమ్మకానికి సిద్ధపడ్డాడు. అయితే సదరు డబ్బు చెల్లించేందుకు మాకు కొంత మొత్తం డిపాజిట్ చేయాలంటూ.. వెస్లీ, క్యూరీ, రవి బన్సల్ అనే పేర్లతో కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి 2018 సెప్టెంబర్ నుంచి 2019 మే వరకు 21 లక్షల రూపాయలు 27 ఖాతాల్లో జమ చేయించుకున్నారు. ఆ తర్వాత రాజు ఫోన్ కాల్స్‌కు వారు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక విచారణలో నైజీరియన్ ముఠా మోసంగా అనుమానిస్తున్నారు.

### కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై

## చర్యలు తప్పవు

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియా పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో కుంతియా మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తున్నదని.. తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిని మార్చే ఉద్దేశమేమీ లేదని.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతారని స్పష్టం చేశారు.

# మిమ్మల్ని ఎలా నమ్ముతాం?

- ఆ రొంపిలోకి పిల్లల్ని దింపిందే మీరు
- మీ గత చరిత్రపై అనుమానాలున్నాయి
- యాదాద్రి చిన్నారులను కలుసుకోనివ్వాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని తిరస్కరించిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాదాద్రి వ్యభిచారగృహాల నుంచి పోలీసులు రక్షించిన చిన్నారి బాలికలను కలుసుకోనివ్వాలని, తాము వారి పెంపుడు తల్లులమని పేర్కొంటూ ఏడుగురు మహిళలుసహా ఓ వ్యక్తి దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. బాధిత పిల్లల అక్రమ రవాణా, లైంగికదోపిడి, వ్యభిచారకూపంలోకి దింపడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న మిమ్మల్ని ఎలా నమ్ముతామని ప్రశ్నించింది. యాదాద్రి వ్యభిచార కూపం నుంచి రక్షించిన చిన్నారులను రంగారెడ్డి, నల్లగొండ బాలల సంక్షేమ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ శిశు గృహాల్లో సంరక్షిస్తున్నారు. సదరు చిన్నారులను కలుసుకోవడానికి పెంపుడు తల్లిదండ్రులమని చెప్తున్నవారిని పోలీసులు అనుమతించలేదు. సదరు మహిళలు పిల్లల అక్రమ రవాణాలో నిందితులుగా ఉన్నారు. పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లలో ఏ ఒక్కరూ చిన్నారులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కాదని, వారిని అనుమతిస్తే పిల్లల మానసికస్థితిపై ప్రభావం పడుతుందని చెప్పారు. దర్యాప్తు కీలకదశలో ఉన్న సమయంలో నిందితులను అనుమతించడం సరికాదన్నారు. దాంతో పెంపుడు తల్లిదండ్రులుగా పేర్కొంటున్న వారి విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. 'మీ చరిత్రపై తీవ్రమైన అనుమానాలు ఉన్నాయి. పిల్లల అమ్మకాలు, కొనుగోళ్ల విషయంలో నిందితులుగా ఉన్న మిమ్మల్ని ఎలా నమ్ము తాం? పిల్లల సంరక్షణ బాధ్యత కోర్టు నిర్ణయానికి వదిలేయండి. వారు మా పిల్లలు' అని ధర్మాసనం స్పష్టంచేసింది. మరోవైపు ఎంతమంది పిల్లలను రక్షించారు? వారిని ఎక్కడెక్కడి నుంచి రక్షించారు? వారిని ఎక్కడ ఉంచారు? వారి సంరక్షణ చర్యలు.. వంటి వివరాలతో రాచకొండ పోలీస్ కమిషనరేట్ సమర్పించిన నివేదికను తమ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

### అసెంబ్లీ, సచివాలయ నిర్మాణంపై

# కాంగ్రెస్ కేసులు

- మరోసారి హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి
- వారసత్వ కట్టడాలను కూల్చొద్దంటూ ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి పిల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన సచివాలయంతోపాటు, అసెంబ్లీ భవనాల నిర్మాణం చేపట్టాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో రెండు వేర్వేరు కేసులు దాఖలయ్యాయి. వీటిలో ఒకటి గతంలోనే దాఖలవగా.. తాజాగా మరో పిటిషన్ దాఖలైంది. ప్రస్తుతమున్న పాత సచివాలయం స్థానంలో అన్ని సౌకర్యాలతో కొత్త సచివాలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. పాత సచివాలయ భవనాలను కూల్చరాదని 2016లోనే పిటిషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి.. తన పిటిషన్‌పై విచారణ జరుపాలని సోమవారం మరోసారి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న వాటిలో చాలా భవనాలు నూతనంగా నిర్మించినవేనని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడుతామని హైకోర్టు పేర్కొన్నది.

**హెరిటేజ్ భవనాలను కూల్చొద్దు..**

మరోవైపు ఎర్రమంజిల్‌లో ఉన్న అసెంబ్లీ, శాసనమండలి భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించేందుకు ఈ నెల 27న భూమి పూజ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. 1870లో నవాబ్ సఫ్దర్ జంగ్ ముషీర్దౌలా ఫక్రుల్ ముల్క్ నిర్మించిన పాత అసెంబ్లీ భవనం వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన విషయాన్ని ఉస్మానియా వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి జే శంకర్ తన పిటిషన్‌లో హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హెరిటేజ్ కన్జర్వేషన్ కమిటీ అనుమతి లేకుండా ఈ భవనాన్ని కూల్చడంగానీ, మరమ్మతులు చేయడంగానీ జరుగకుండా చూడాలని ఆయన కోరారు.

## మినీ అంగన్‌వాడీ టీచర్ల వేతనాల పెంపునకు కృషి

- టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ పేర్కొన్నారు. సోమవా రం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్కేవీ అనుబంధ మినీ అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నాలుగు వేల మంది మినీ అంగన్‌వాడీలకు తక్కువగా జీతాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వంతో చర్చించి వారి వేతనాలు పెంచేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఇది కేంద్ర పథకం కాబట్టి ఇప్పటికే కేంద్ర మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి సె లవులు, టీచర్లుగా గుర్తింపు, జీతాల పెంపు, పదోన్నతులు సాధించుకున్నామన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పదేండ్ల కాంగ్రెస్ పాలన అవినీతి పాలనకు, పాలనావిధానాల లేమికి తార్కాణంగా నిలిచింది. అలాగే దేశానికి సమర్థవంతమైన నాయకత్వ అవసరాన్ని గుర్తుచేసింది. నరేంద్ర మోదీ లాంటి వారు దేశానికి నాయకత్వం వహించటం గొప్ప విషయం.

**ప్రతాప్ చంద్రసారంగి, కేంద్రమంత్రి**

ఎస్పీ హయాంలో యూపీలో అనేక దళిత వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ ప్రయోజనాలు, ఐక్యకూటమి ధర్మాలను గౌరవించి ఎస్పీతో జతకట్టాం. కానీ వారు బీఎస్పీకి ద్రోహం చేశారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్ ఎన్నికల్లో ఎస్పీతో పొత్తు పెట్టుకోం. బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుంది.



**మాయావతి, బీఎస్పీ అధినేత్రి**

**చరిత్రలో నేడు**



1678
మొదటిసారి పీహెచ్‌డీ డిగ్రీని పొందిన మహిళ వెనెటియన్ ఎలీనా కోర్నారో పిస్కోపియా.

1920
అంతర్జాతీయ న్యాయస్థానాన్ని హేగ్‌లో పెట్టాలని లీగ్ ఆఫ్ నేషన్స్ నిర్ణయం.





1932
ఇంగ్లండ్ లార్డ్స్ మైదానంలో భారత్-ఇంగ్లండ్‌ల మధ్య ప్రారంభమైన మొదటి క్రికెట్ టెస్ట్ మ్యాచ్.

ఒడిషా రాజకీయాల్లో నవశకం ప్రారంభమైంది. నిన్నటిదాకా కత్తులు దూసిన బీజేపీ, బీజేడీ స్నేహగీతం ఆలపిస్తూ ఒకే బాటన నడుస్తున్నాయి. బీజేపీ తరఫున రాజ్యసభ ఎంపీగా పోటీచేస్తున్న ఐఏఎస్ మాజీ అధికారి అశ్వినీ వైష్ణవ్ ఎన్నికకు నవీన్ పట్నాయక్ మద్దతు ప్రకటించారు. ప్రతిగా ఒడిషా నుంచి రాజ్యసభకు అధికార పార్టీ అభ్యర్థులుగా ఎంపికైన ముగ్గురు సభ్యుల ఎన్నిక లాంఛనం కానున్నది. గత సాధారణ ఎన్నికల దాకా వైరిపక్షాలుగా వ్యవహరించిన బీజేపీ, బీజేడీ పార్టీలు స్నేహరాజకీయం నేపథ్యంలోంచే జమిలి ఎన్నికలకు నవీన్ పట్నాయక్ మద్దతు పలుకటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

ఇరాన్‌పై వైమానిక దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చివరి క్షణంలో నిలిపి వేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇరాన్ వ్యక్తుల చేత అమెరికన్లకు ఎలాంటి హాని జరుగనందున ఇరాన్ పౌరుల ప్రాణాలకు నష్టం కలుగటం ఇష్టం లేకనే దాడిని నిలిపేశానని ట్రంప్ ప్రకటించటం గమనించదగ్గది. కొంతకాలంగా తీవ్ర ఉద్రిక్తతలకు కేంద్రమైన హార్మోజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన ఓ డ్రోన్‌ను కూల్చివేయటంతో యుద్ధమేఘాలు కమ్మాయి. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహరించిన తీరు ఆహ్వానించదగినది.

**ది హిందూ**



# చెన్నై నీటి కొరత

ఇటీవలి కాలంలోనే భారీ వరదలు ముంచెత్తిన చెన్నై నగరం ఇప్పుడు నీళ్ళు లేక కటకటలాడటం పాలకుల అసమర్థతకు ప్రత్యక్ష ఉదాహరణ. ఎండలు మండిపోతున్నాయి. రుతుపవనాలు ఆలస్యమై 200 రోజుల పాటు సుదీర్ఘమైన ఎండకాలం తట్టుకోలేక చెన్నై నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. గతవారం వర్షపు జల్లులు పడినా నీటి బాధ నుంచి విముక్తి లేదు. నగరంలోని ఐటీ సంస్థలు నీళ్ళు లేక ఉద్యోగస్తులు తమ వెంట నీళ్ళు తెచ్చుకోవాలని లేదా ఇంటినుంచే పని చేయాలని ఆదేశాలు జారీచేశాయి. ఒక్క చెన్నై నగరమే కాదు, తమిళనాడు అంతటా ఇదే గడ్డు పరిస్థితి. వానలు లేవు కనుక నీళ్ళు లేవని చెప్పదలుచుకుంటే ఇక ప్రభుత్వాల అవసరమే లేదు. చెన్నైకి నీటి కొరత కొత్తగా ఏర్పడిన పరిస్థితి కాదు. గత ఐదేండ్లుగా నీటి కొరత పెరుగుతూనే ఉన్నది. అయినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. చెన్నై నగరానికి వరదలు రావడానికి ఏ కారణాలు దోహదపడ్డాయో, అవే ఇప్పుడు నీటి కొరత ఏర్పడటానికి కూడా కారణం. నగర అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా సాగలేదు. ఇష్టారీతిన రియల్‌ఎస్టేట్ వ్యాపారం సాగింది. నీటి ప్రవాహాలను, జలాశయాలను గుర్తించి పరిరక్షించాలనే సోయి లేకపోవడం వల్ల ఏర్పడిన దుస్థితి ఇది. నీటి ప్రవాహాలకు అడ్డంగా కట్టడాలు వెలిశాయి. భారీ వర్షాలు పడితే వాటిని నిలువచేసే జలాశయాలు కబ్జా అయ్యాయి. ఇంకా మిగిలి ఉన్న జలాశయాలు కూడా నీటి ప్రవాహాలు లేక ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. ఇది ఒక చెన్నై నగర పరిస్థితే కాదు. దేశంలోని నగరాలన్నిటి పరిస్థితి ఇదేవిధంగా ఉన్నది. నగర ప్రణాళికల్లో విప్లవాత్మక మార్పులు రాకపోతే రాబోయే రోజులు దారుణంగా ఉంటాయనడానికి చెన్నై నగర పరిస్థితి ఒక హెచ్చరిక.

చెన్నై నగరంలో నీటికొరత మూలంగా అక్రమంగా భూగర్భ జలాలు తోడి ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీళ్ళను అమ్ముకునే వ్యాపారం భారీగా సాగింది. ప్రతి మధ్యతరగతి కుటుంబం వేలాది రూపాయలను నీళ్ళ కోసమే ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడ్డది. నీటి కొరత వల్ల తీవ్రంగా బాధలు పడ్డది ఈ డబ్బులు చెల్లించలేని అట్టడుగు ప్రజలు. ఒక దశలో డబ్బు పెట్టినా నీళ్ళు దొరుకడమే కష్టమైన పరిస్థితి. ఇంత జరిగినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. అసలు నీటి సమస్యే లేదని కూడా ప్రభుత్వ పెద్దలు మాట్లాడారు. పరిస్థితి దిగజారుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని న్యాయస్థానం చీవాట్లు పెట్టింది. వానలు పడుతాయి కదా అనే భరోసా తప్ప, స్వతహాగా నీటి కొరత తీర్చడానికి ప్రభుత్వం సిద్ధపడలేదని తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానానికి సమర్పించిన నివేదికను పరిశీలించినా పాలకుల అసమర్థత తెలిసిపోతుంది. చెన్నైలో 201 జలాశయాలు ఉంటే వాటిలో ఐదింటిని మాత్రమే పునరుద్ధరించినట్టు రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడించింది.

> **మన దేశంలో చరిత్రలోనే అత్యంత తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనబోతున్నదని నీతి ఆయోగ్ తన నివేదికలో హెచ్చరించింది. 2020 నాటికి 21 నగరాలలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని తెలిపింది. ఈ 21 నగరాలలో ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలు కూడా ఉండటం గమనార్హం. నీటి వనరుల నిర్వహణను మెరుగుపరుచుకోవాలని, అదీ తక్షణం చేపట్టాలని కూడా సూచించింది. నీటి లభ్యత ఉన్నదనే అనుకున్నా, ఐదో వంతు గ్రామాలకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఉండటం గమనార్హం.**

దూపయినప్పుడే బాయి తవ్వడు మొదలుపెట్టినట్టు– నీటి కొరతను అధిగమించడానికి ఐదు వేల కోట్ల రూపాయల సహాయం చేయాలని రాష్ట్ర ప్రభు త్వం కేంద్రాన్ని కోరడం ఆశ్చర్యకరం. నిధులతో తక్షణం నీళ్ళు రావు. మొదటినుంచి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాల్సింది.

దేశవ్యాప్తంగా నీటి లభ్యతపై కేంద్ర జల సంఘం వివరాలు భీతి గొలిపేవిగా ఉన్నాయి. దేశంలోని 91 ప్రధాన జలాశయాలలో 80 శాతం సాధారణం కన్నా తక్కువ నిలువ కలిగి ఉన్నాయి. ఇందులో పదకొండు జలాశయాల్లో అసలు నీరే లేదు. ఇప్పటివరకు వర్షపాతం 39 శాతం మాత్రమే ఉన్నది. ఇవన్నీ తాజా గణాంకాలు. గతేడాది నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ఇప్పటికైనా గమనించదగినది. మన దేశంలో చరిత్రలోనే అత్యంత తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనబోతున్నదని నీతి ఆయోగ్ తన నివేదికలో హెచ్చరించింది. 2020 నాటికి 21 నగరాలలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని తెలిపింది. ఈ 21 నగరాలలో ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలు కూడా ఉండటం గమనార్హం. నీటి వనరుల నిర్వహణను మెరుగుపరుచుకోవాలని, అదీ తక్షణం చేపట్టాలని కూడా సూచించింది. నీటి లభ్యత ఉన్నదనే అనుకున్నా, ఐదో వంతు గ్రామాలకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఉండటం గమనార్హం. ఇష్టారాజ్యంగా భూగర్భ జలాలను తోడుకోవడం, అసమర్థ నీటి నిర్వహణ మూలంగా ఇప్పటికే 12 శాతం దేశ జనాభా 'డే జీరో' పరిస్థితిలో ఉన్నదని నీతి ఆయోగ్ వెల్లడించింది. ఇప్పుడే ఇంత దారుణ పరిస్థితి ఉంటే 2030 నాటికి దేశంలో నీటి అవసరాలు లభ్యత కన్నా రెండు రెట్లు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల కోట్లాది మంది ప్రజలకు మంచి నీళ్ళు ఇవ్వలేని దుస్థితి ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసింది. దేశవ్యాప్తంగా నల్లా నీరు అందించడానికి పథక రచన చేస్తున్నదని చెబుతున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు కానీ, మిషన్ భగీరథకు మంచి నీటి ప్రాజెక్టుకు కానీ తోడ్పాటు అందించకపోవడం గమనార్హం. దేశ వ్యాప్తంగా నీటి సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి రాష్ట్రాలతో సమన్వయం చేసుకొని అమలుచేయకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది.

**జనగళం**

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రహదారి ప్రమాదాల్లో మన దేశం ప్రపంచంలో 13వ స్థానంలో నిలిచింది. రోజుకు సగటున దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. దేశంలోని నగరాల్లో సగటున రోజుకు నలుగురు చనిపోతున్నారు. ఇవ్వాళ ప్రమాదాల గురించి ఆందోళన చెందుతున్న మనం రేపు క్షేమంగా ఉంటామన్న భరోసా లేదు. రేపు నేను కూడా ప్రమాద సంఖ్యలో ఒకటిగా మారవచ్చన్నది ఊహించుకుంటేనే గుబులు పుడుతున్నది. మన భద్రత మనపై, మన జాగ్రత్తలపై కూడా ఆధారపడిలేదు. ఎదుటి వారి నిర్లక్ష్యం కూడా నీ ప్రాణం మీదికి తేవచ్చు. కాబట్టి దీన్ని అందరి సమస్యగా భావించాలి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ, రోజూ కొత్త వాహనాలు కూడా అదనంగా రోడ్లపైకి చేరుతున్నాయి. ట్రాఫిక్ కిక్కిరిసిపోతున్నా రోడ్ల నిర్మాణం, నిర్వహణలో ఏ మాత్రం మార్పులు చోటుచేసుకోవడం లేదు. రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ లాంటి దేశాలు ఎన్నో విస్తృత పరిశోధనలను చేపట్టి రహదారుల నిర్మాణంలో కొత్త పోకడలను అనుసరిస్తున్నాయి. కానీ మన దేశంలో మాత్రం పాత చింతకాయ పచ్చడి పద్ధతులనే పట్టుకొని వేళ్లాడుతున్నారు. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలతో పాటు వచ్చే ఇరువై ఏండ్లకు కావల్సిన వసతులకు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టవలసి ఉండగా, మనదేశంలో రహదారుల నిర్మాణం ప్రస్తుత అవసరాలకు కూడా సరిపోకపోతుండటం దురదృష్టకరం. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి కూడా అత్యవసర వైద్యం అందించడంలో ప్రభుత్వాల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణం, నిర్వహణపై శ్రద్ధపెట్టి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలి. రోడ్లు విశాలంగా నిర్మించి పుట్‌పాత్‌లు ఏర్పాటుచేయాలి. అంతేకాకుండా రోడ్లు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరించాలి. జరిమానాలు విధించే పద్ధతి ఎలాంటి ఫలితాలనివ్వడం లేదు కాబట్టి అసలు నిబంధనలను ఉల్లంఘించే వీల్లేకుండా మెరుగైన శాస్త్రీయ పద్ధతులలో రహదారులు డిజైనింగ్ చేయాలి.

**- సి.సాయిప్రతాప్, ఏఎస్‌రావునగర్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం



**సి.పార్థసారథి, ఐఏఎస్**

# 'విత్తన భాండాగారం' దిశగా..

**తెలంగాణ దేశ విత్తన రాజధానిగా ఇప్పటికే పేరొందింది. ఇందుకు అనేక విధానాలు, పటిష్ఠ కార్యాచరణ తోడ్పడింది. ఫలితంగా మొదట జాల్నా ప్రధాన కేంద్రంగా ఉన్న విత్తనోత్పత్తి, విత్తన పంటలు ఆ తర్వాత ఏలూరు ప్రధానంగా కేంద్రంగా నడిచింది. పత్తి, మక్కజొన్న విత్తన పంటల సాగుకు నిలయంగా ఉండేది. విత్తన పంటల సాగుకు కావలసిన పుష్కలమైన సూర్యరశ్మి, పొడి వాతావరణం రాష్ట్రంలో ఉన్నది. దీంతోపాటు ప్రభుత్వ విధానాలు తోడవటంతో నేడు తెలంగాణ దేశ విత్తన రాజధానిగా ఎదిగింది.**

రైతులకు లబ్ధి చేకూర్చే శాస్త్రీయ, ఆర్థిక విధానాలతో వ్యవసాయ లీడర్‌గా ఎదిగిన తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. అంతర్జాతీయ, దేశీయ విత్తన ఎగుమతుల ప్రమాణాలను రూపొందించే 'అంతర్జాతీయ విత్తన పరీక్ష అసోసియేషన్' 32వ అంతర్జాతీయ విత్తన సదస్సుకు వేదికైంది. అంతర్జాతీయ విత్తన సంస్థల ప్రతినిధులు, నిపుణులు, పాలసీదారుల మేధోమథనం, చర్చలకు ఈ సదస్సు వేదిక అయ్యింది. ఈ వేదిక ద్వారా విత్తన సంబంధిత అంశాలతో పాటు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్న సహజ వనరులను ఉపయోగించుకొని తెలంగాణ 'ప్రపంచ విత్తన భాండాగారం'గా ఎదిగే అవకాశం ఉన్నది.

తెలంగాణ దేశ విత్తన రాజధానిగా ఇప్పటికే పేరొందింది. ఇందుకు అనేక విధానాలు, పటిష్ఠ కార్యాచరణ తోడ్పడింది. ఫలితంగా మొదట జాల్నా ప్రధాన కేంద్రంగా ఉన్న విత్తనోత్పత్తి, విత్తన పంటలు ఆ తర్వాత ఏలూరు ప్రధానంగా కేంద్రంగా నడిచింది. పత్తి, మక్కజొన్న విత్తన పంటల సాగుకు నిలయంగా ఉండేది. విత్తన పంటల సాగుకు కావలసిన పుష్కలమైన సూర్యరశ్మి, పొడి వాతావరణం రాష్ట్రంలో ఉన్నది. దీంతో పాటు ప్రభుత్వ విధానాలు తోడవటంతో నేడు తెలంగాణ దేశ విత్తన రాజధానిగా ఎదిగింది. దేశంలో సాగుకు కావలసిన 60 శాతం విత్తనాలు ఒక్క మన రాష్ట్రం నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. అధిక విలువ కలిగిన తక్కువ మొత్తంలో కావలసిన హైబ్రిడ్ కూరగాయలు, నూనెగింజలు, హైబ్రిడ్ పత్తి, మక్కజొన్న, వరి హైబ్రిడ్ల విత్తనోత్పత్తి రాష్ట్రంలోనే కేంద్రీకృతమై ఉన్నది. 400 పైగా అంతర్జాతీయ, జాతీయ విత్తన సంస్థలకు నిలయంగా తెలంగాణ ఉన్నది. అంతర్జాతీయంగా రవాణా సౌకర్యాలు ఉన్నాయి. తక్కువ కాలంలో పూర్తిచేసే సామర్థ్యమున్న ప్రాసెసింగ్ సదుపాయాలున్నాయి. అందుకే విత్తన సంస్థలు తమ వ్యాపార ప్రధాన కేంద్రంగా తెలంగాణను ఎంచుకున్నాయి. విత్తన రాజధానిగా ఉన్నప్పటికీ ఆ ఫలితాలు, లాభాలు రైతులందరికీ లేవు. రైతులందరికీ అందాలంటే విత్తనోత్పత్తిలో వారికి మెలకువలు నేర్పించాలి. చాలామంది రైతులు విత్తన పంటలు పండించటంలో మంచి నైపుణ్యంతో ఉన్నారు. అయితే కోత అనంతరం, పండించి విత్తనాల నాణ్యతను కాపాడుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రస్తుతం విత్తనాలను పురుగులు ఆశించడానికి అనువైన వాతావరణం ఉన్నది. ఒక సీజన్‌లో పండించిన విత్తనం నిల్వ చేస్తే మరో సీజన్ నాటికి పుచ్చులవుతున్నాయి. విత్తన మొలక శాతం తగ్గిపోతున్నది. దీనికితోడు ఆసియా ఖండపు దేశాలలో భారత్ నుంచి ఎగుమతికి పుష్కల అవకాశాలున్నాయి. ఆఫ్రికా ఖండం దేశాలలో మన విత్తనాలకు మేలైన ఎగుమతి అవకాశాలున్నాయి. అయితే ప్రపంచ దేశాలకు విత్తనాలు ఎగుమతి చేయాలంటే కొన్ని ప్రమాణాలు పాటించే అంతర్జాతీయ సంస్థల విత్తన ప్రమాణాలు అందుకోవాలి. అంతర్జాతీయ విత్తన పరీక్ష అసోసియేషన్, ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ, అంతర్జాతీయ విత్తన ఫెడరేషన్, ఆసియా పసిఫిక్ అసోసియేషన్, ఆర్థిక, సహకార, అభివృద్ధి ఆర్గనైజేషన్‌లు అంతర్జాతీయంగా విత్తన నాణ్యతా ప్రమాణాలు



ఏకతాటిపైకి తెస్తున్నాయి. మార్కెట్లలో రైతులకు అమ్మకానికి ఉంచే ప్రతి విత్తనం సంచులలో లేదా పౌచ్‌లలో అమ్మాలి. దానికితోడు 1966 భారత విత్తన చట్టం ప్రకారం విత్తనం ధృవీకరించబడిన, లేకున్నా భారతీయ ప్రమాణాల ప్రకారం లేబిలింగ్ నిబంధనలు పాటించాలి. వాటిలో కనీస జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, మొలక శాతం కచ్చితంగా ముద్రించి ఉండాలి. విదేశాలకు ఎగుమతి చేయాలం టే ISTA ధృవీకరించిన ప్రయోగశాలలో పరీక్షించిన విత్తనాలను మాత్రమే ఎగుమతి చేయాలి. ఆయా దేశాలు వాటిని మాత్రమే దిగుమతి చేసుకుంటాయి.

విత్తన ఎగుమతుల ద్వారా రైతుల ఆదాయాలు పెరుగాలంటే అంతర్జాతీయ విత్తన ప్రమాణాలపై అవగాహన అవసరం. ఆ మేరకు అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న పరిశోధనల ఫలితాలు, ఆయా దేశాల ఎగుమతి విత్తన ప్రమాణాలు తెలియాలి. వాటికనుగుణంగా మన విత్తన నాణ్యత ఉండాలి. ఆ ప్రమాణాల నేరుగా మన నిపుణులకు, రైతులకు అందించే ప్రయత్నమే ISTA విత్తన సదస్సు. 1924లో మొదలైన ఈ అంతర్జాతీయ విత్తన సంస్థ ఇప్పటివరకు ఐరోపా, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో మాత్రమే నిర్వహణకు ISTA అంగీకరించింది. ప్రతి మూడేండ్లకు ఒకసారి జరిగే విత్తన సదస్సు ఈసారి తెలంగాణలో జరుగుతున్నది. ఆసియా దేశాలలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న విత్తన సదస్సు ఇది. ఈ సదస్సుకు 80 దేశాల నుంచి 400 మంది ప్రపంచ విత్తన నిపుణులు హాజరుకానున్నారు. జూన్ 26 నుంచి జూలై మూడవ తేదీ వరకు జరిగే ఈ విత్తన సదస్సు మారుతున్న ప్రపంచంలో విత్తన సాంకేతిక శాస్త్రం, నాణ్యత అనే అంశంపై జరుగనున్నది. ఐదు సెషన్లుగా ఈ సదస్సు జరుగుతుంది. విత్తన మొలక శాతం, నిద్రావస్థలో ఆధునిక పరిశోధనలు, భవిష్యత్ తరాలకు విత్తన నాణ్యత మెరుగుపరుచటం మారుతున్న పర్యావరణ నేపథ్యంలో విత్తన ఆరోగ్యం, శిలీంధ్రాల ప్రభావం, విత్తనోత్పత్తి; విత్తన నాణ్యత అంచనా వేసేందుకు నూతన పరిజ్ఞానం, ఆధునిక పద్ధతులు ప్రధాన అంశాలుగా విత్తన సదస్సు జరుగనుంది. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ విత్తన సదస్సు నిర్వహించటం కేవలం రాష్ట్రానికి గర్వకారణం. అంతేకాదు రాష్ట్రానికి విత్తనరంగంలో మరిన్ని లాభాలను చేకూర్చనున్నది. ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరవుతారు. కాబట్టి తెలంగాణలో విత్తన పంటల సాగు, నాణ్యమైన విత్తనం ఎగుమతులకు ఉన్న బలాలను ప్రపంచదేశాలకు తెలిపినట్టవుతుంది. అంతర్జాతీయ అనుభవాలతో రాష్ట్రంలో నాణ్యమైన అధిక విత్తనోత్పాదకతకు మరింత పరిజ్ఞానం తోడయ్యే అవకాశం ఉన్నది. మరిన్ని బహుళజాతి విత్తన సంస్థలు రాష్ట్రంలో తమ పరిశోధన, అభివృద్ధి సంస్థలు, వ్యాపారాలలో పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నది. కాబట్టి మరిన్ని ఉపాధి అవకాశాలు మనకు అందుతాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ కోరుకుంటున్నట్లు 'తెలంగాణను విత్తన భాండాగారం'తో పాటుగా 'ప్రపంచ విత్తన సముదాయం'గా తీర్చిదిద్దే అవకాశాలున్నాయి. ISTA సదస్సు నిర్వహణతో విత్తనరంగంలో తెలంగాణ మార్కును, తెలంగాణ విత్తన బ్రాండ్‌ను మరింత ముందుకుతీసుకెళ్తాం.

> **విత్తన ఎగుమతుల ద్వారా రైతుల ఆదాయాలు పెరుగాలంటే అంతర్జాతీయ విత్తన ప్రమాణాలపై అవగాహన అవసరం. ఆ మేరకు అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న పరిశోధనల ఫలితాలు, ఆయా దేశాల ఎగుమతి విత్తన ప్రమాణాలు తెలియాలి. వాటికనుగుణంగా మన విత్తన నాణ్యత ఉండాలి. ఆ ప్రమాణాల నేరుగా మన నిపుణులకు, రైతులకు అందించే ప్రయత్నమే ISTA విత్తన సదస్సు. 1924లో మొదలైన ఈ అంతర్జాతీయ విత్తన సంస్థ ఇప్పటివరకు ఐరోపా, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో మాత్రమే నిర్వహణకు ISTA అంగీకరించింది. ప్రతి మూడేండ్లకు ఒకసారి జరిగే విత్తన సదస్సు ఈసారి తెలంగాణలో జరుగుతున్నది. ఆసియా దేశాలలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న విత్తన సదస్సు ఇది. ఈ సదస్సుకు 80 దేశాల నుంచి 400 మంది ప్రపంచ విత్తన నిపుణులు హాజరుకానున్నారు.**

**(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రధాన కార్యదర్శి)**

# కేసీఆర్ శకంలో చారిత్రక కట్టడాలు

విశ్లేషణ



**బి.ఎస్.రాములు**

ఇప్పుడు నడుస్తున్నది కేసీఆర్ శకం. 2001లో కేసీఆర్ శకం ప్రారంభమైంది. నదుల పుట్టుక వలె అనేక మలుపులు తిరుగుతూ కొండలను చీల్చుకుంటూ, బండలను తొలుచుకుంటూ మహారణ్యాల గుండా, భూగర్భ సొరంగాల గుండా, ఆకాశహర్మ్యాల మీదుగా కేసీఆర్ శకం వడివడిగా ముందుకుసాగుతున్నది. వర్తమాన చరిత్రను చరిత్రగా గుర్తించడం అంత సులభం కాదు. సామాన్య రొటీన్ సంఘటనలుగా భావిస్తుంటారు. కాలక్రమంలో అవి చారిత్రక సంఘటనలుగా, చరిత్ర మలుపులుగా ఆలస్యంగా గుర్తిస్తుంటారు. ముందే గుర్తించగలిగినవారు సమాజానికి మార్గనిర్దేశం చేస్తారు. కేసీఆర్ చరిత్ర నిర్మాత. తనదైన కేసీఆర్ శకాన్ని నిర్మిస్తున్న ప్రభుత్వాధినేత. చారిత్రక కట్టడాల ఆవశ్యకతను గుర్తించిన దూరదృష్టి ఆయనను చరిత్రలో కలకాలం నిలుపుతుంది.

చారిత్రక కట్టడాలు సృష్టించే సంపద, వారసత్వం, సంస్కృతి, స్ఫూర్తి అమూల్యమైనది. ఆయా చారిత్రక దశలను, పరిణామాలను, సైన్స్, టెక్నాలజీలను, నాటి అవగాహనను, అవసరాలను, ఆసక్తులను అవి తెలియజేస్తాయి. సాహిత్యం, కళలు కూడా చరిత్ర పరిణామంలో రూపుదిద్దుకొని తర్వాతి కాలాల్లో పరిణామశీలంగా కొనసాగుతూ వర్తమానంలో స్ఫూర్తినిస్తాయి. తీర్చిదిద్దుతాయి. నూతనత్వానికి విత్తనాలవుతాయి. యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణం, మెట్రోరైలు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరంలోను, జిల్లాలోను మరిన్ని శిల్పారామాలు, పార్కులు, కోట్లాది మొక్కలతో హరితవనాల సృష్టి, కాళేశ్వరం రీ-డిజైనింగ్ ప్రాజెక్టు, నూతన సచివాలయ, శాసనసభల నిర్మాణం, ముఖ్యమంత్రి నివాస ప్రగతిభవనం మొదలైనవి ఈ చారిత్రక నిర్మాణాల కోవకు చెందుతాయి.

కేసీఆర్ దూరదృష్టికి ఈ నూతన నిర్మాణాలు ప్రత్యక్ష నిదర్శనం. శాతవాహనుల కట్టడాలు చరిత్రలో కలిసిపోయాయి. మిగిలిన కట్టడాలు నాగార్జునసాగర్‌లో మునిగిపోయాయి. కొన్ని మాత్రమే వెలికితీసి నందికొండలో భద్రపరిచారు. చాళుక్యుల, కాకతీయుల, విజయనగర రాజుల, కుతుబ్‌షాహీ, నిజాం రాజుల కట్టడాలు ఎన్నో నేటికీ సజీవంగా నిలిచాయి. కాకతీయులు నిర్మించిన చెరువులు నేటికీ ఫలాలను అందిస్తున్నాయి. గుళ్ళు గోపురాలు పూజలందుకుంటున్నాయి. మరికొన్ని శిథిలాలుగా మారినా, చరిత్ర ఆనవాళ్ళుగా నిలిచి ఆకర్షిస్తున్నాయి. నాటి శ్రమశక్తి కొన్ని శతాబ్దాల తరబడి సంపదను సృష్టిస్తున్నది. టూరిజం ఆదాయాన్ని ప్రజల వినోద విజ్ఞానాన్ని వికసింపజేస్తున్నది. అమెరికా వెళితే న్యూజెర్సీ ద్వీపంలో వెలిసిన లిబర్టీ స్టాచ్యూ ఒక స్ఫూర్తికి, సందేశానికి చిహ్నంగా నిలిచింది. కాళేశ్వరం రీ డిజైనింగ్‌లో పడిన శ్రమను, సచివాలయం, శాసనసభలు యాదాద్రి, వేములవాడ దేవాలయాల పునర్నిర్మాణం, పరిసరాల పునర్నిర్మాణ చరిత్ర ఇలాంటిదే. తెలంగాణ చరిత్రలో అనేక పథకాలతో, నిర్మాణాలతో కేసీఆర్ శకం అంటూ ఐదేండ్లలోనే రూపుదిద్దుకుంటున్నది ఇది తెలంగాణ వాళ్లుగా, భారతీయులుగా మనం గర్వించాల్సిన విషయం.

కొందరు చారిత్రక కట్టడాల పేరిట ఆధునిక అవసరాలను కాదని, గతాన్ని యథాతథంగా కొనసాగించాలంటారు. ఆధునికతను అందుకునేవారు కూడా ఈ పని చేయడం విచిత్రమైన విషయం. ఉస్మానియా దవాఖాన స్థానంలో మంచి ఆధునిక వైద్యశాల నిర్మిద్దామనుకున్నప్పుడు ఇలాగే అడ్డుపడ్డారు. దీంతో అది పెచ్చులూడి పోతూ ఎప్పుడూ పెళ్ళలు మీద పడుతాయో అనే భయం భయంగా రోగులు బతుకుతున్నారు. చాలామంది 20-30 ఏండ్ల కాకముందే తమ ఆశల పల్లకిగా కట్టుకున్న భవనాలను కూలగొట్టి బహుళ అంతస్థుల భవనాలను నిర్మింపజేసుకుంటున్నారు. ముషీరాబాద్ జైలు అక్కడి నుంచి తొలిగించి చర్లపల్లిలో కట్టడం వల్ల ముషీరాబాద్‌లో బహుళ అంతస్థుల గాంధీ దవాఖానగా వెలిసింది.

ముఖ్యమంత్రి కేసీఆర్ బహుముఖ ప్రజ్ఞాశీలి. రాజనీతి శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు. కేసీఆర్‌ది సామాజిక స్పృహ కలిగిన దూరదృష్టి. రాజకీయాల్లో తక్షణ ప్రయోజనాలు ప్రజలకు అందించే కృషి ఒకవైపు, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టితో మరొకవైపు ఆలోచిస్తూ, ఆచరిస్తూ, కేసీఆర్ ముందుకుసాగుతున్న క్రమాన్ని అర్థం చేసుకోలేకపోతే ఆగిపోతారు. అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తే చరిత్ర అవశేషాలుగా మిగిలిపోతారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ మైదానంలో సచివాలయం, శాసనసభలు కట్టాలని ఒక ప్రయత్నం చేసినప్పుడు అడ్డుకున్నది వీళ్లే. ఓయూకు 'మకలక మహాభాయి' అనే నృత్యకారిణి మౌలాలి గుట్టపై ఉంటూ అడిగిన తోడనే తనదైన ఆస్తిని 14 వందల ఎకరాలు ఉస్మానియా యూనివర్సిటీ కోసం ఇచ్చింది. అందులో ఎవరు వాడని, అటువైపు ఎవరూ పోని, దూరదర్శన్ వెనుక గల కొన్ని ఎకరాలను పేదల డబుల్ బెడ్‌రూమ్ కోసం బహుళ అంతస్థుల భవనాలు నిర్మించాలనుకున్నప్పుడు అడ్డుకున్నారు. నేడు మకలక మహాభాయి ఉండి ఉంటే సంతోషంగా ఇచ్చి ఉండేది. ఎక్కడో వరంగల్ రోడ్డున పోచారం, వెంకటాపూర్ పరిసరాల్లో డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మాణమవుతున్నాయి.

ఎర్రగడ్డ మానసిక వైద్యశాల పక్కన గల టీబీ దవాఖాన విలువైన ఎకరాల వైశాల్యంలో సెక్రటేరియేట్ లేదా మరో భవన సముదాయం నిర్మించాలనుకున్నప్పుడు ఇలాగే!. తెలంగాణ కళాభారతి ఎన్టీఆర్ ఓపెన్ స్టేడియం స్థలంలో బహుళ సాహితీ, సాంస్కృతిక భవన సముదాయాన్ని నిర్మించాలనుకున్నప్పుడు ఇలాగే అడ్డుతగిలారు. ఔటర్ రింగ్ రోడ్డు రూపకల్పన సందర్భంగా కూడా అడ్డుతగిలారు. మెట్రో రైలు మార్గానికి అడ్డంకులు సృష్టించారు.

సెక్రటేరియేట్, శాసనసభ నూతన భవనాలను నిర్మించాలనుకుంటున్న కేసీఆర్ సంకల్ప బలం గొప్పది. వీటికి సంబంధించిన ఆలోచనలు ఎన్నో ప్రదేశాల ఆలోచనల మీదుగా చివరకు ఉన్నచోటనే కట్టాలని శాసనసభను ఎర్రమంజిల్‌లో కట్టాలనే స్థిర నిర్ణయం తీసుకోవడం స్వాగతించాల్సిన అంశం. కేసీఆర్ చేసిన ఆలోచనలను అడ్డుకున్నవాళ్లే సెక్రటేరియేట్ భవనాలు కూల్చివేతకు కారకులని మర్చిపోతున్నారు. మరోచోటకు తరలిద్దామని చేసిన ఆలోచనలను స్వాగతించి ఉంటే సెక్రటేరియేట్ భవనాలు పేద పిల్లల రెసిడెన్షియల్ స్కూళ్ళకు, కాలేజీలకు, విద్యాసంస్థలకు ఎంతగానో ఉపయోగపడేవి. దూరదృష్టిలేని మేధావులు, ప్రతిపక్షాలు, ఆధునిక ఆలోచనలను, అడ్వాన్స్ థింకింగ్‌ను అడ్డుకుంటూ రావడం విచారకరం. వారే ఈ నష్టాలకు కారకులు. మళ్ళీ వారే వందల కోట్లు ప్రజాధనం నూతన కట్టడాలకు హెచ్చించడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు.

సచివాలయం నిర్మాణంలో, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన విషయంలో, హుస్సేన్‌సాగర్ చుట్టూ చికాగో, న్యూ జెర్సీ, న్యూయార్క్ నగరాల్లో వలె బహుళ అంతస్థుల పర్యావరణ స్నేహపూరిత భవనాలను నిర్మిద్దామని చేసిన అనేక ప్రతిపాదనలను ఏవో కారణాలతో వ్యతిరేకిస్తూ రావడం చూస్తున్నదే. వీరంతా అడ్డుకుంటున్నది కేసీఆర్‌ను అనుకుంటున్నారు. కానీ వారు అడ్డుకుంటున్నది తెలంగాణ దీర్ఘకాలిక అభివృద్ధి పథకాలను, ప్రపంచంతో పోటీ పడే ఆలోచనలను సాకారం చేయడాన్ని అనే విషయం మరిచిపోతున్నారు.

భాక్రానంగల్, నాగార్జునసాగర్ ఇప్పుడు నిర్మిస్తున్న కాళేశ్వరం, యాదాద్రి, వేములవాడ క్షేత్రాలు, శాసనసభల భవనాలు, సచివాలయం తదితర నిర్మాణాలు రేపటికి బృహత్తర చారిత్రక కట్టడాలుగా ప్రశంసలందుకుంటాయి. వీటి ప్రయోజనాలు పొందినవారు, వీటిని సందర్శించేవారు భవిష్యత్‌తరాల్లో అవి ఎంత గొప్ప నిర్మాణాలో ప్రశంసిస్తారు. టూరిజం కూడా పెరుగుతుంది. వినోద, విజ్ఞాన యాత్రలకు ఆకర్షక కేంద్రాలవుతాయి.

> **సచివాలయం నిర్మాణంలో, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన విషయంలో, హుస్సేన్‌సాగర్ చుట్టూ చికాగో, న్యూ జెర్సీ, న్యూయార్క్ నగరాల్లో వలె బహుళ అంతస్థుల పర్యావరణ స్నేహపూరిత భవనాలను నిర్మిద్దామని చేసిన అనేక ప్రతిపాదనలను ఏవో కారణాలతో వ్యతిరేకిస్తూ రావడం చూస్తున్నదే. వీరంతా అడ్డుకుంటున్నది కేసీఆర్‌ను అనుకుంటున్నారు. కానీ వారు అడ్డుకుంటున్నది తెలంగాణ దీర్ఘకాలిక అభివృద్ధి పథకాలను, ప్రపంచంతో పోటీ పడే ఆలోచనలను సాకారం చేయడాన్ని అనే విషయం మరిచిపోతున్నారు.**

**(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# కాళేశ్వరంతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు



రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ బండ్ 2 మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్

## హైదరాబాద్ తాగునీటికి 40 టీఎంసీలు

### నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామనీ, హైదరాబాద్ ప్రజలకు తాగు నీటికి 40 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 16 టీఎంసీలను ఇవ్వనున్నట్టు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిర్వాసితుల త్యాగ ఫలంతోనే రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మించుకుంటున్నామనీ, వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో నిర్మిస్తున్న కాళేశ్వరం 9వ ప్యాకేజీ భూగర్భ కాల్వ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శమన్నారు. భవిష్యత్తులో పాలమూరు, రంగారెడ్డి, సీతారామా, డిండి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామన్నారు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్, విద్యాసాగర్ లాంటి నాయకుల కలలు సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకుపోతున్నారని చెప్పారు. మధ్య మానేరు నుంచి 11టీఎంసీల నీటిని ఎగువ మానేరుకు ఎత్తిపోసి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని దసరాకు ప్రారంభిస్తామని తెలిపారు. తర్వాత సిరిసిల్ల పట్టణంలో జరిగిన పద్మశాలీ జిల్లా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై ప్రసంగించారు. పద్మశాలీయులు ఐక్యతగా ఉంటూ ఆధునీకీకరణ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్లను తమిళనాడులోని తిరుపూరులా మార్చుకోవాలన్నారు. పద్మశాలీయుల అభివృద్ధి కోసం తనవంతుగా రూ.10 లక్షల 116 విరాళంగా ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోకబాపురెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణ, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, చీటి నర్సింగరావు, చిక్కాల రామారావు, తోట ఆగయ్య, జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రాజన్న సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ వైద్యుడు యాదగిరిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్





సూర్యాపేట జిల్లాకేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి మట్టి తవ్వుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్



కరీంనగర్‌లో టీఆర్ఎస్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి, సుంకె, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



జగిత్యాలలో పార్టీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్



జనగామలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# ఉత్సవంలా శంకుస్థాపనలు

## 29 జిల్లాల్లో టీఆర్ఎస్ భవనాలకు భూమిపూజ

### పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు

### విరాళాలు ప్రకటించిన పలువురు ప్రజాప్రతినిధులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల భవన నిర్మాణానికి శంకుస్థాపనలను మహోత్సవంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్రంలోని 29జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు భూమి పూజ చేయగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలుచోట్ల సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు భవన నిర్మాణాలకు విరాళాలు ప్రకటించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద సమీకృత కలెక్టరేట్ సమీపంలో ఎకరం స్థలంలో టీఆర్ఎస్ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం డీ పోచంపల్లి పరిధిలోని ఎకరం స్థలంలో నిర్మించనున్న మేడ్చల్ జిల్లా టీఆర్ఎస్ కార్యాలయ భవనానికి కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, నవీన్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. వరంగల్ అర్బన్ హన్మకొండలో, జనగామలో పార్టీ కార్యాలయాల భవనాలకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భూమి పూజ చేశారు. వరంగల్ అర్బన్ పరిధిలో మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, జనగామ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

**కరీంనగర్‌లో మంత్రి ఈటల..**

కరీంనగర్ శివారులోని చింతకుంట వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఎదురుగా ఉన్న స్థలంలో టీఆర్ఎస్ భవనానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ భూమి పూజ చేయగా మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, ఉమ్మడి జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, నూతన జెడ్పీ అధ్యక్షురాలు విజయ, మేయర్ రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్ హాజరయ్యారు. సూర్యాపేటలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో పార్టీ కార్యాలయం కోసం విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి భూమి పూజ చేయగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నూతన జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొన్నారు. నిజామాబాద్ నగరంలో రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీలు వీజీ గౌడ్, రాజేశ్వర్‌రావు, ఆకుల లలిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, మేయర్ ఆకుల సుజాత తదితరులు పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ భవన నిర్మాణ పనులకు సంక్షేమ శాఖ మంత్రి ఈశ్వర్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ వేడుకలో నూతన జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత సురేశ్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి) వద్ద నూతనంగా నిర్మించనున్న టీఆర్ఎస్ భవన్ నిర్మాణానికి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేయగా ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

**పాలమూరులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్..**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయ సమీపంలో టీఆర్ఎస్ భవన నిర్మాణానికి ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. నారాయణపేటలోని సింగారం చౌరస్తా వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ వనజ భూమి పూజ చేశారు. ఇక్కడ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాద్మి శివకుమార్, శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మెదక్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ భూమిపూజ చేయగా ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, సీహెచ్ మదన్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ భవన్‌కు జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి హుడా కాలనీ సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద నిర్వహించిన భూమి పూజలో ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అంజయ్య, జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**విరాళాలు..**

సిద్దిపేట పొన్నాల శివారులోని పినాకిని క్లబ్ పక్కన టీఆర్ఎస్ భవన్ కోసం జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ ఫారూక్‌హుస్సేన్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, కార్పొరేషన్ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలమల్లు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్‌లోని చిల్డ్రన్ పార్క్ సమీపంలో టీఆర్ఎస్ భవన్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి భూమి పూజ చేయగా ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ రూ.2.50 లక్షల విరాళాన్ని ప్రకటించారు.



మేడ్చల్ జిల్లా డీ పోచంపల్లి వద్ద నిర్మించనున్న టీఆర్ఎస్ కార్యాలయ భవనానికి భూమిపూజ చేస్తున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, నవీన్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు



నిజామాబాద్ నగరంలో టీఆర్ఎస్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పారతో మట్టి తీస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్సీలు



మెదక్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలిసి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి తదితరులు



భువనగిరిలో పాల్గొన్న ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల, గొంగిడి సునీత, మాజీ ఎంపీ బూర



సిద్దిపేటలో టీఆర్ఎస్ కార్యాలయ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి భూమి పూజలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు



నిర్మల్ జిల్లా టీఆర్ఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తదితరులు

## కూలిన బ్రిడ్జి గట్టర్

**ముత్తారం:** పెద్దపల్లి - భూపాలపల్లి జయశంకర్ జిల్లాలను కలిపే ఖమ్మంపల్లి -తాడిచర్ల మండల సరిహద్దులో మానేరుపై బ్రిడ్జి నిర్మాణ పనుల్లో సోమవారం అపశ్రుతి దొర్లింది. పిల్లర్ల మధ్య గట్టర్‌ను క్రేన్ సాయంతో జాకీ ద్వారా పైకి ఎత్తి అమర్చుతుండగా జాకీకి ఉన్న ఎడాప్టర్ విరిగింది. దీంతో బ్రిడ్జిపై నుంచి గట్టర్ కింద పడి విరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందనీ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీలోనూ టీఆర్ఎస్ భవన్

### మాజీ ఎంపీ వినోద్‌కుమార్

**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ:** దేశ రాజధానిలోనూ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమలో టీఆర్ఎస్ నాయకుడు శ్రీపతి రవీందర్‌గౌడ్ తల్లి లక్ష్మి మృతి చెందగా హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుదీర్‌కుమార్‌తో కలిసి సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తాను, రాజ్యసభ సభ్యుడు సంతోశ్‌కుమార్ ఢిల్లీ రాష్ట్ర మంత్రితో మాట్లాడామనీ, వెయ్యి గజాల స్థల సేకరణ చేశామని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ కనుమరుగయ్యే దశలో ఉందని చెప్పారు. వచ్చే నెలలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.



వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ వేములవాడ రాజన్న సన్నిధిలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో 30 మంది వేద పండితులు వరుణయాగం నిర్వహించారు. -వేములవాడ కల్చరల్



వర్షాలు కురవాలని కోరుతూ భద్రాద్రి సీతారామస్వామి సన్నిధిలో అర్చకులు వరుణజపం చేశారు. అనంతరం గోదావరి నది నుంచి నీటిని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. -భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ

# ఆగని అఘాయిత్యాలు

## వేర్వేరు ప్రాంతాల్లో చిన్నారులపై లైంగికదాడులు

### ఖనిలో ఐదోతరగతి బాలికపై పాఠశాల వాచ్‌మన్ ఘాతుకం

### తాండూరులో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాలికలపై అకృత్యాలు

**ఫెర్టిలైజర్‌సిటీ/తాండూరు /ములకలపల్లి:** అభం శుభం తెలియని చిన్నారులపై అకృత్యాలు ఆగట్లేదు. ఇటీవల జరిగిన ఘటనలపై ఆగ్రహజ్వాలలు చల్లారకముందే తాజాగా సోమవారం వేర్వేరు జిల్లాల్లో బాలికలపై లైంగికదాడులు కలకలంరేపాయి. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేసే ఓ వృద్ధుడు ఐదో తరగతి చదువుతున్న ఓ బాలిక(10)పై లైంగిక దాడికి పాల్పడగా, నిందితుడిని చిన్నారి బంధువులు చితకబాది ఆందోళనకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఓ చిన్నారి గాంధీనగర్‌లోని గాంధీ పార్కు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నది. ఈ నెల 21న చిన్నారిని ఆమె తండ్రి పాఠశాలలో వదిలి వెళ్లారు. అప్పటికి విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రాకపోవడంతో వాచ్‌మెన్ సర్వర్ (60) ఆ చిన్నారిని బెంచీపై కూర్చొబెట్టి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అయితే శనివారం పాఠశాలకు ఆ చిన్నారి వెళ్లలేదు. సోమవారం సైతం పాఠశాలకు వెళ్లనని మారాం చేయడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా, జరిగిన విషయాన్ని తెలిపింది. వివరించింది. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు సర్వర్‌ను నిలదీసి చితకబాదారు. సమాచారం అందుకున్న వన్ టౌన్ సీఐ రమేశ్, ఎంఈవో డానియల్ విచారణ జరిపారు. సర్వర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. బాలిక బంధువుల ఫిర్యాదుతో సర్వర్‌పై 376 ఐపీసీ రెడ్ విత్ 511, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, 8 ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**ఇంట్లోకి పిలిచి..**

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం బోజ్యానాయక్ తండాకు చెందిన ఓ బాలిక(11)ను అదే గ్రామానికి చెందిన టాత్యానాయక్(45) ఈ నెల 19న ఇంట్లోకి పిలిచి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తుండడం గమనించిన స్థానికులు విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులు బతుకు దెరువుకోసం పుణెలో ఉంటున్నారు. నిందితునిపై బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేసి, బాలికకు వైద్యపరీక్షలు చేయించారు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పాత మోటుగూడెంలో తండ్రి పశువుల కాపలాకు వెళ్లగా ఇంట్లో నిద్రిస్తున్న బాలికపై యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నెల 22 రాత్రి బాలిక (16) తండ్రి పశువుల కాపలాకు పొలానికి వెళ్లగా ఇద్దరు కుమార్తెలు ఇంట్లో నిద్రిస్తున్నారు. కొద్దిసేపటి తర్వాత పెద్ద కుమార్తె నిద్రలేచి తన చెల్లెలు పక్కన లేకపోవడంతో గ్రామస్థుల సాయంతో తండ్రికి సమాచారం అందించింది. గ్రామస్థులు గాలించగా నిర్మానుష్య ప్రదేశంలో బాలిక కనిపించింది. అప్పటికే యువకుడు పారిపోయాడు. ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిందితుడు మొగరాలగుప్ప కొండ్రు భాస్కర్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు.



సూర్యాపేటలో కల్యాణలక్ష్మి లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## ఆడపిల్లలు భారం కాదు

### మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్:** ఆడబిడ్డలు కుటుంబానికి భారం కాదనీ, వరంగా భావించే రోజులు వచ్చాయని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కార్యక్రమాల కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం వ్యాప్తంగా 586 మందికి రూ.5.46 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 129 మందికి రూ.59.76 లక్షల సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ అమయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవల్లికా ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగారకుడిపై భారీగా మీథేన్

వెల్లడించిన నాసా క్యూరియాసిటీ రోవర్

జీవం ఆనవాళ్లపై పరిశోధకుల అధ్యయనం



**వాషింగ్టన్:** అంగారక గ్రహంపై భారీగా మీథేన్ వాయువు ఉన్నట్లు అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రయోగించిన క్యూరియాసిటీ రోవర్ గుర్తించింది. లేజర్ స్పెక్ట్రోమీటర్ ద్వారా అరుణ గ్రహంపై రోవర్ జరిపిన పరిశోధనల సమాచారాన్ని నాసా శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. అంగారకుడిపై ఉన్న వాతావరణంలో వంద కోట్లలో 21 ప్రమాణాల (యూనిట్లు) మీథేన్ వాయువు ఉన్నట్లు అంచనా వేశారు. ఇంత పెద్ద పరిమాణంలో ఈ వాయువు ఉంటే అంగారకుడిపై తప్పక జీవరాశి ఉండే ఉంటుందని నాసా శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భూమిపై మీథేన్ ఆధారంగా కొన్ని సూక్ష్మజీవులు మనుగడ సాగించడమే దీనికి నిదర్శనంగా వారు భావిస్తున్నారు. ఈ మీథేన్ మూలం ఏమిటో శాస్త్రవేత్తలకు అంతుబట్టడం లేదు. కొన్ని సమయాల్లో నమోదవుతున్న మీథేన్ వాయువు హెచ్చుతగ్గులపై భిన్న కోణాల్లో పరిశోధనలు చేస్తున్నారు. దీని కోసం క్యూరియాసిటీ రోవర్ గతంలో పంపిన సమాచారం విశ్లేషిస్తున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రయోగించిన ట్రేస్ గ్యాస్ ఆర్బిటార్ అంగారకుడి చుట్టూ పరిభ్రమిస్తున్నది. దీని సమాచారంతోపాటు గ్రహంపై క్యూరియాసిటీ రోవర్ పరిశోధనలను క్రోడీకరించిన తర్వాతే అంగారకుడిపై మీథేన్ వాయువు ఉనికిని నిర్ధారించడంతోపాటు దాని మూలం తెలిసే అవకాశముందని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## నొప్పి భరించలేను.. నా చేతులు నరికేయండి!



ఈ యువకుడి పేరు అబుల్ బజందర్. వయస్సు 28 ఏండ్లు. బంగ్లాదేశ్‌కు చెందిన అబుల్ 'ఎపిడెర్మోడిస్‌ప్లాసియా వెరుసిఫార్మిస్' (ట్రీమ్యాన్ సిండ్రోమ్) అనే అరుదైన జన్యుసంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీనివల్ల ఇతడి చేతులు, కాళ్ల మీద చెట్టుబెరడులాగా చర్మం పెరుగుతున్నది. దానిని తొలగించటానికి వైద్యులు ఇప్పటివరకూ 25 శస్త్రచికిత్సలు జరిపారు. అయినా ఫలితం లేకపోవటంతో.. 'నొప్పి భరించలేకపోతున్నా, నా చేతులను తొలగించండి' అని వైద్యులను వేడుకుంటున్నాడు అబుల్. ఆయన విజ్ఞప్తిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఢాకా మెడికల్ కాలేజీ వైద్య బృందం తెలిపింది.

# నల్లా బిల్లు కట్టని ఫడ్నవీస్

మహారాష్ట్ర సీఎం అధికార భవనం పెండింగ్ బిల్లు 7.5 లక్షలు

18 మంది మంత్రులు కూడా బీఎంసీకి బకాయి

**ముంబయి, జూన్ 24:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చిక్కుల్లో పడ్డారు. ఆయన అధికార నివాస భవనం 'వర్షా' నల్లా బిల్లు ఏగవేతదారుల జాబితాలో నమోదైంది. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.7,44,981 చెల్లించాల్సి ఉంది. అంతేకాదు సీఎంతోపాటు 18 మంది మంత్రులు సుమారు రూ.45 లక్షల మేర బిల్లులు బకాయి పడ్డారు. ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్ అధికార నివాస బంగ్లా 'దేవగిరి' రూ.4,45,055, రవాణా శఖ మంత్రి దివాకర్ రాత్వే అధికార నివాస బంగ్లా 'మేఘదూత్' రూ.1,61,719, శిశు అభివృద్ధి శాఖ మంత్రి పంకజా ముండే అధికార బంగ్లా రూ.35,033మేర నల్లా బిల్లులు చెల్లించలేదు. బీఎంసీ ఎగవేతదారుల జాబితాలో ఆశిష్ షేలార్, సుభాష్ దేశాయ్, ఏకనాథ్ షిండే, చంద్రశేఖర్ బవన్‌కులే, మహాదేవ్ జాన్‌కర్‌తోపాటు మరి కొందరి మంత్రుల పేర్లు కూడా ఉన్నాయి. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం 'సహ్యాద్రి' రూ.12,04,390 మేర బకాయి పడింది. 2018 నుంచి సీఎం, మంత్రుల అధికార నివాస భవనాల నల్లా బిల్లుల బకాయిలు పెరుగుతున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసిన కార్యకర్త షకీల్ అహ్మద్ షేక్‌కు బీఎంసీ వెల్లడించింది. కాగా ముఖ్యమంత్రి, మంత్రుల అధికార భవనాలే నల్లా బిల్లులు చెల్లించకపోతే, ఇక సామాన్యులను ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. మరోవైపు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ నల్లా బిల్లుల బకాయిలపై అధికార బీజేపీని ప్రతిపక్షాలు ఇరుకున పెట్టే అవకాశమున్నది.

**సీఎం, మంత్రుల భవనాలకు నల్లా కనెక్షన్లు తొలగించాలి**

సాధారణ ప్రజలు నల్లా బిల్లులు చెల్లించకపోతే వెంటనే కనెక్షన్ తొలుగిస్తారని, అలాంటిది లక్షల్లో బకాయి పడిన సీఎం, మంత్రుల నివాస భవనాలకు కనెక్షన్లు తొలుగించే దమ్ము, ధైర్యం బీఎంసీకి ఉందా అని ఎన్సీపీ నేత ధనుంజయ్ ముండే సోమవారం ట్విట్టర్‌లో ప్రశ్నించారు. ఇక ఎన్సీపీ ఎమ్మెల్యే జితేంద్ర అహ్వాద్ సీఎం బంగ్లా నల్లా బిల్లు తాను చెల్లిస్తానని మీడియాకు వెల్లడించారు.



'మహారాష్ట్ర సీఎం నేతలందరికీ అధినేత. ఆయన బంగ్లాకు నల్లా కనెక్షన్ తొలిగిస్తే ముఖం కడుక్కోవడం, స్నానం చేయడంలో సీఎంకు ఆలస్యం జరుగుతుంది. ప్రభుత్వ నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుంది. అలా జరుగడానికి వీల్లేదు..' అని ఆయన ఎద్దేవా చేశారు. కాగా సీఎం, మంత్రుల నివాస భవనాల నల్లా బిల్లులను 2018 నవంబర్‌లోనే చెల్లించామని, ఈ ఏడాది మే నెలలో జారీ చేసిన బిల్లుల్లో వ్యత్యాసం ఉండటంతో సరిచేయాల్సి ఉందని పీడబ్ల్యూడీ వెల్లడించింది. మొత్తం బకాయిలు ఎంత అన్నది తేలిన తర్వాత వాటిని వెంటనే చెల్లిస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు.

# విదేశాల్లో భారతీయుల నల్లధనం

# 34 లక్షల కోట్లు!

- 1980-2010 మధ్య పోగైన మొత్తమిది
- వెల్లడించిన మూడు సర్వేలు
- పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ ముందుకు చేరిన నివేదిక



**న్యూఢిల్లీ, జూన్ 24:** విదేశాల్లో భారతీయులు దాచిన నల్లధనం విలువ రూ.15 లక్షల కోట నుంచి రూ.34 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని మూడు సర్వేలు తెలిపాయి. ఈ సొమ్ము 1980-2010 మధ్య దేశ సరిహద్దులను దాటిందన్నాయి. విదేశాల్లో భారతీయుల నల్లధనంపై ఎన్ఐపీఎఫ్‌పీ, ఎన్‌సీఏఈఆర్, ఎన్ఐఎఫ్ఎం సంస్థలు విడివిడిగా సర్వే చేసి నివేదికలు రూపొందించాయి. 'దేశం లోపల.. విదేశాల్లో నల్లధనం స్థితిగతులు- ఒక సునిశిత విశ్లేషణ' పేరుతో ఈ నివేదికలు లోక్‌సభ ఫైనాన్స్ కమిటీ ముందుకొచ్చాయి. రియల్ ఎస్టేట్, మైనింగ్, ఫార్మా, పాన్ మసాలా, గుట్కా, పొగాకు, బులియన్, పసిడి, సినిమా, విద్యారంగాల నుంచే ఎక్కువగా నల్లధనం ఉత్పత్తి అవుతున్నదని, ఇవన్నీ అంచనాలేనని, నల్లధనం ఎంత మొత్తం పోగవుతున్నదో కచ్చితంగా చెప్పే విధానాలు ప్రస్తుతం అందుబాటులో లేవని, వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారం, వాటి విశ్లేషణతోనే ఈ లెక్కలు రూపొందించామని ఆ సంస్థలు తెలిపాయి.

**ఇది ప్రాథమిక నివేదిక మాత్రమే**

దేశంలో, విదేశాల్లో పోగైన నల్లధనాన్ని లెక్కించాలని కేంద్రం 2011 మార్చిలో ఈ మూడు సంస్థలను కోరింది. ఈ మేరకు ఆయా సంస్థలు అధ్యయనం చేసి కాంగ్రెస్ ఎంపీ వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీకి నివేదికలు సమర్పించాయి. కమిటీ ఈ నివేదికలను ఈ ఏడాది మార్చి 28న స్పీకర్‌కు సమర్పించింది. అయితే 16వ లోక్‌సభ గడువు పూర్తి కావడంతో ఈ నివేదికలపై చర్చ జరుగలేదు. తాజాగా 17వ లోక్‌సభ తొలి సమావేశాలు జరుగుతుండటంతో ఈ నివేదికలు లోక్‌సభ ఫైనాన్స్ కమిటీ ముందు కొచ్చా యి. 'దేశం లోపల, వెలుపల పోగైన నల్లధనాన్ని లెక్కించడం చాలా వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఈ 3 సంస్థలు విస్తృత అధ్యయనంతో అంచనాలు రూపొందించాయి. నల్లధనం లెక్కింపులో కచ్చితమైన విధానాలు లేనందున మూడు నివేదికల్లో ఒకే అంకెలు ఉండటం అసాధ్యం' అని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఈ నివేదికల ఆధారంగా విచారణ చేపట్టామని, సమయం తక్కువగా ఉన్నందున నిందితుల్లో కొంతమందినే ప్రశ్నించినట్టు తెలిపింది. దీనిని ప్రాథమిక నివేదికగా భావించాలని, మిగతా విచారణను ఆర్థిక శాఖ పూర్తిచేయాలని సూచించింది. ఈ క్రమంలో మూడు సంస్థల నివేదికలతోపాటు నల్లధనంపై నియమించిన ఏడు ప్రత్యేక దర్యాప్తు బృందాల నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నది. నల్లధనాన్ని వెనక్కి రప్పించి ప్రత్యేక పన్నులు విధిస్తే సత్ఫలితాలు వస్తాయన్నది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నూతన ప్రత్యక్ష పన్నుల విధానానికి తుదిరూపునిచ్చి చట్టంగా మార్చి.. పాత చట్టం సంక్లిష్టతలను తొలిగించాలని సూచించింది.

### నివేదికల్లోని ముఖ్యాంశాలు

- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) ప్రకా రం 1980-2010 మధ్య భారత్ వెలుపల పోగయిన నల్లధనం విలువ రూ.26 లక్షల కోట్ల నుంచి రూ.34 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్ఎం) అంచనా ప్రకారం 1990-2008 మధ్య సరిహద్దు దాటిన నల్లధనం విలువ దా దాపు 21,648 కోట్ల డాలర్లు. 2008 నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువతో పోలిస్తే రూ.9.41 లక్షల కోట్లు. ప్రస్తుతం రూ.15 లక్షల కోట్లు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ ఫైనాన్స్ (ఎన్ఐపీఎఫ్‌పీ) ప్రకారం 1997-2009 మధ్య ఏటా దేశ జీడీపీలో 0.2 శాతం నుంచి 7.4 శాతంతో సమానమైన సొమ్ము విదేశాలకు తరలింది.

### 380 కేసుల్లో నోటీసులు: నిర్మలా సీతారామన్

లెక్కలు చూపని దాదాపు రూ.12,260 కోట్ల ఆస్తులపై నమోదైన 380 కేసుల్లో ఆదాయం పన్ను శాఖ నోటీసులు జారీ చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో సభ్యులడిగిన ఓ ప్రశ్నకు ఆమె ఈ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విదేశీ నల్లధనం చట్టం కింద ఈ నోటీసులు జారీచేసినట్టు తెలిపారు. వీటిలో 68 కేసుల్లో ప్రాసిక్యూషన్ కూడా ప్రారంభమైందన్నారు. 'నల్లధనం(వెల్లడించని విదేశీ ఆదాయం మరియు ఆస్తులు), పన్ను చట్టం విధింపు-2015 ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఐటీశాఖ 380 కేసుల్లో నోటీసులు జారీ చేసింది. వీటి విలువ దాదాపు రూ.12,260 కోట్లు' అని పేర్కొన్నారు. నల్లధనం కలిగి ఉన్న వాళ్లపై సోదాలు, విచారణలు, ఆదాయం అంచనా, పన్ను/వడ్డీ/జరిమానా విధించడం వంటి చర్యలను తీసుకున్నట్టు చెప్పారు.

## నాలుగు రోజులు.. 10 రాష్ట్రాలు!

పుంజుకున్న రుతుపవనాలు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావమే కారణం..

జూన్ 23నాటికి 38శాతం లోటు వర్షపాతం నమోదు

**న్యూఢిల్లీ, జూన్ 24:** గత పన్నెండేండ్లలో ఎప్పుడూ లేనంతగా నెమ్మదించిన రుతుపవనాల గమనం ఎట్టకేలకు పుంజుకున్నది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జూన్ 19 నుంచి కేవలం నాలుగు రోజుల్లోనే రుతుపవనాలు పది రాష్ట్రాలకు విస్తరించాయి. మరో రెండు రాష్ట్రాలను తాకుటకు సిద్ధంగా ఉన్నాయి. ఆదివారం నాటికి వారణాసితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. అల్పపీడన ప్రభావంతో వారణాసి వరకు విస్తరించిన రుతుపవనాలు ముంబయి నగరాన్ని ఒకటి, రెండు రోజుల్లో చేరుకుంటాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అధికారులు తెలిపారు. 'ఒకటి, రెండు రోజుల్లో ముంబయి నగరానికి, జూన్ 25 నాటికి మహారాష్ట్ర అంతటా రుతుపవనాలు విస్తరిస్తాయి. ఆ తర్వాత, వీటి గమనం మళ్ళీ మందకొడిగా సాగుతుంది' అని ఐఎండీ అధికారి డీ శివానంద పాయ్ పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నప్పటికీ, ఈ నెలలో సంభవించిన లోటు వర్షపాతాన్ని అవి భర్తీ చేయలేదని అధికారులు తెలిపారు. ఏటా జూన్ 1 - 23 తేదీల మధ్య నమోదయ్యే వర్షపాతం కంటే ఈసారి 38శాతం లోటు వర్షపాతం నమోదైందని వాళ్ళు వివరించారు. అయినప్పటికీ, రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయన్న వార్త నీటి ఎద్దడితో అల్లాడుతున్న మధ్య భారతం, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంత వాసులకు శుభవార్త లాంటిదే. నీటి కరువుతో అలమటించిన మరఠ్వాడా, విదర్భ ప్రాంతాల్లో ఆదివారం వర్షాలు కురిశాయి. మధ్యప్రదేశ్, రాయలసీమ, తీరాంధ్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తూర్పు యూపీ ప్రాంతాల్లో రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. కర్ణాటక, తెలంగాణ, పశ్చిమ మధ్యప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో ఆదివారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. 'రానున్న రోజుల్లో రుతుపవనాలతో సంబంధం లేకుండా ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడొచ్చు. ఢిల్లీ, ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాలను రుతుపవనాలు ఎప్పుడు తాకుతాయో ఇప్పుడే చెప్పడం కష్టం' అని అన్నారు.

## యూపీ, కర్ణాటక కాంగ్రెస్ కమిటీలు రద్దు

వచ్చేవారం సీడబ్ల్యూసీ భేటీ?

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీ కమిటీలను రద్దు చేశామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎన్నికైన నేపథ్యంలో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. వీటిని పర్యవేక్షించే బాధ్యతను ఇద్దరు నేతలకు అప్పగిస్తున్నట్టు వేణుగోపాల్ వెల్లడించారు. సీఎల్పీ నేత అజయ్‌కుమార్ లాలూను తూర్పు యూపీ ఇంచార్జిగా నియమించారు. 80 ఎంపీ స్థానాలున్న యూపీలో కాంగ్రెస్ పార్టీ కేవలం రాయబరేలిలోనే గెలుపొందింది. స్వయంగా పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అమేథీలో కేంద్రమంత్రి స్మృతిఇరానీ చేతిలో ఓటమిచవిచూశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో మే నెల 25వ తేదీన రాహుల్‌గాంధీ అధ్యక్ష పదవినుంచి వైదొలుగుతానన్నారు. దీనిని సీడబ్ల్యూసీ తిరస్కరించింది. అయినా మొండిగా వ్యవహరిస్తున్న రాహుల్‌నే అధ్యక్షపదవిలో కొనసాగాలని వచ్చేవారం నిర్వహించే సీడబ్ల్యూసీ భేటీలో కోరే అవకాశం ఉన్నది.

## ఒడిశా 'గుంజీల' ఎమ్మెల్యే అరెస్టు



**భువనేశ్వర్:** పబ్లిక్‌గా ఓ ఇంజినీర్‌ను గుంజీలు తీయించిన బీజేడీ ఎమ్మెల్యే సరోజ్‌కుమార్ మెహర్‌ను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేశారు. గుంజీలు తీయించిన ఘటన ఈ నెల ఐదో తేదీన జరుగగా.. సోమవారం పోలీసులు పఠాన్‌గఢ్ ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజాపనుల విభాగం (పీడబ్ల్యూడీ)లోని ఓ గిరిజన ఇంజినీర్‌ను పఠాన్‌గఢ్ బీజేడీ ఎమ్మెల్యే సరోజ్‌కుమార్ మెహర్ ప్రజలంతా చూస్తుండగా బస్కీలు తీయించాడు. ఇంజినీర్ ఇన్ చీఫ్ చేత చెంపదెబ్బ కొట్టించాడు. దీనిపై బోలంగిర్ కలెక్టర్ ఆరిందమ్ డాకువా విచారణకు ఆదేశించారు. మరోవైపు ఇంజినీర్ భార్య ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సరోజ్‌కుమార్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం నౌపడాలోని ఓ హోటల్ నుంచి ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకొని బోలంగిర్‌కు తరలించి విచారిస్తున్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలు!

మోటార్ వెహికల్ (సవరణ) బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఇకపై భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రతిపాదనలు పొందుపరిచిన మోటార్ వెహికల్ (సవరణ) బిల్లుకు కేంద్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. అత్యవసర వాహనాలకు దారివ్వకపోయినా, మద్యంతాగి డ్రైవింగ్ చేసినా, లైసెన్స్ రద్దయినప్పటికీ డ్రైవింగ్ చేసినా రూ.10 వేలు చొప్పున జరిమానా విధించేలా నిబంధనలు పొందుపరిచారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉల్లంఘన కేసుల్లో గరిష్ఠంగా రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంది. మైనర్లు డ్రైవింగ్ తప్పిదాలకు పాల్పడినప్పుడు సదరు వాహనం యజమాని లేదా మైనర్ సంరక్షకులకు రూ.25 వేల జరిమానా, మూడేండ్ల జైలు శిక్ష విధించేందుకు, ఓవర్‌లోడ్ వాహనాలకు రూ.20వేలు జరిమానా విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది.

# ప్రజావేదికను కూలగొడతాం



మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన ఎమ్మెల్యే బాల్క సుమన్

## కేసీఆర్ కార్యదక్షతకు నిదర్శనం కాళేశ్వరం

- కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

**మహదేవపూర్(జయశంకర్ భూపాలపల్లి) :** ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యదక్షతకు కాళేశ్వరం ప్రాజెక్ట్ నిదర్శనమని చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ఆయన సందర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతలగా కాళేశ్వరం నిలువడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశక్వరం ప్రాజెక్ట్‌ను జీర్ణించుకోలేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని, వారి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్

**శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా కేశవపట్నం పీహెచ్‌సీని జాతీయ వైద్య నాణ్యతా ప్రమాణాల పరిశీలక బృందం (ఎన్‌క్యూఏఎస్) సందర్శించింది. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగం, లేబర్ రూం, ప్రయోగశాల, జాతీయ ఆరోగ్య పథకం, సాధారణ పరిపాలన ఆరు అంశాలపై పరిశీలించి, వైద్యాధికారి నుంచి సమాచారం సేకరించారు.

- స్కాంలపై విచారణ చేపడుతాం
- నవరత్నాల అమలే అజెండా
- అవినీతిని సహించేది లేదు
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఏపీ సీఎం జగన్



ప్రజావేదికలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్ . చిత్రంలో సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం ఉన్నారు.



ప్రజావేదిక భవనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గత టీడీపీ ప్రభుత్వం ఉండవల్లిలో నిర్మించిన ప్రజావేదిక అక్రమ నిర్మాణమని, దీన్ని కూల్చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కిందిస్థాయి అధికారులు అక్రమాలు చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. వ్యవస్థ ఏ స్థాయిలో దిగజారిపోయిందో చెప్పడానికే ఇక్కడ సమావేశం ఏర్పాటుచేశామని, ప్రజావేదికలో ఇదే చివరి సమావేశమని చెప్పారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో సోమవారం కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. బుధవారం నుంచి ప్రజావేదికసహా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రజావేదికను పూర్తిగా అవినీతి సొమ్ముతో నిర్మించారని సీఎం జగన్ ఆరోపించారు. అవినీతిని ఏమాత్రం సహించేది లేదని, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. దేశం మొత్తం మనవైపు చూసేలా పారదర్శకతతో పరిపాలించాలన్నారు. రాష్ట్రంలోని పేదవాళ్లందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. ఉగాదినాడు ఇండ్ల పట్టాల పంపిణీ చేపడుతామని స్పష్టంచేశారు. గతంలో జరిగిన పట్టణ ఇండ్ల నిర్మాణాల స్కాంపై విచారణ జరుపుతామన్నారు. ఇక మీదట ప్రభుత్వ దవాఖానల్లో ఎలుకలు వచ్చి పిల్లల్ని కొరకడం.. టార్చిలైట్ల వెలుగులో ఆపరేషన్లు చేయడం వంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. తమ ఎన్నికల మ్యానిఫెస్టో నవరత్నాల అమలే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులందరికీ పెన్షన్ ఇవ్వాలని, అనర్హులుంటే వారిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. రైతులకు సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు.

**సెప్టెంబర్ 2 నుంచి రచ్చబండ**

సెప్టెంబర్ రెండు నుంచి గ్రామస్థాయిలో సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన రచ్చబండ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఏపీ సీఎం జగన్ నిర్ణయించారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి సోమవారం స్పందన' పేరుతో ఒక కార్యక్రమాన్ని అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలో నూరు శాతం అమలు చేస్తామని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని వివరించారు. అందరూ చదువుకోవాలనే ఉద్దేశంతోనే అమ్మ ఒడి పథకాన్ని తీసుకొస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణకు అసెంబ్లీలో చట్టం తీసుకొస్తామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జనవరి 26 నుంచి 'అమ్మఒడి' చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు డోర్ డెలివరీ చేస్తామని, ఎన్నికలయ్యే వరకే రాజకీయాలని చెప్పారు.



కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న సద్గురు జగ్గీ వాసుదేవ్

## వైద్యులు ఆరోగ్యంగా ఉండాలి

- 'ప్రతిమ' వైద్య విద్యార్థులతో సద్గురు జగ్గీ వాసుదేవ్

**కరీంనగర్ రూరల్:** ఇతరుల ఆరోగ్యం గురించి మాట్లాడే ముందు వైద్యులు ఆరోగ్యంగా ఉండాలని ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ సూచించారు. సోమవారం ఆయన కరీంనగర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో యోగా ముగింపు కార్యక్రమానికి హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. పశ్చిమబెంగాల్‌లో వైద్యులపై జరిగిన హింసపై స్పందిస్తూ.. సమాజంలో శాం తిని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఉద్ఘాటించారు. ఆయుర్వేద, సిద్ధ, ఇతర భారతీయ వైద్య పద్ధతుల గురించి మాట్లాడుతూ.. యువవైద్యులు వ్యాధి లక్షణాలకు అతీతంగా రోగులను చూడాలని సూచించారు. ఉపవాసం వల్ల ఒనగూడే ప్రయోజనాలపై ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. కడుపు ఖాళీగా ఉన్నప్పుడే శరీరం, మెదడు బాగా పనిచేస్తాయని, శరీరంలో దిద్దుబాటు, శుద్ధీకరణ జరగాలంటే కడుపు ఖాళీగా ఉండాలన్నారు. అంతకుముందు వేదికపై సద్గురు వాసుదేవ్‌కు ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ శ్రీనివాస్, డీన్, సిబ్బంది, ఘనస్వాగతం పలికారు. 1,300 మంది వైద్య, నర్సింగ్ విద్యార్థు లు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో 'ఆస్కీ' అధ్యయనం

- ఆర్థిక అంశాలపై త్వరలోనే నివేదిక: జీ రాజేశంగౌడ్



అధికారులతో సమావేశమైన రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్థానిక సంస్థల్లో పరిపాలనా, ఆర్థికపరమైన అంశాలపై అధ్యయనం చేసేందుకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)తో ఒప్పందం చేసుకొన్నట్టు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్ తెలిపారు. స్థానిక సంస్థల్లో పలు అంశాలపై ఇప్పటికే డ్రాఫ్ట్ నివేదిక రూపొందించారన్నారు. స్థానిక సంస్థల పరిపాలన అంశాలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. దీనిపై సోమవారం ఆయన ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఆస్కీ త్వరలోనే గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో సర్వే చేసి పరిపాలన, ఆర్థిక అంశాలపై నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు. మంగళవారం నిర్వహించే వర్క్‌షాప్‌నకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, సీనియర్ ఐఏఎస్‌లు వెంకటేశం, జనార్దన్‌రెడ్డితోపాటు పలు రంగాల నిపుణులు హాజరవుతారని చెప్పా రు. స్థానిక సంస్థల్లో మెరుగుపర్చాల్సిన అంశాలపై వర్క్‌షాప్‌లో విశ్లేషిస్తామన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు చెన్నయ్య, మెంబర్ సెక్రెటరీ సురేష్ చందా పాల్గొన్నారు.

## సీపెట్‌లో డిప్లొమా కోర్సులు

- దరఖాస్తులకు 30 వరకు గడువు
- సీపెట్ సంచాలకుడు ఏవీఆర్ కృష్ణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో డిప్లొమా, పోస్ట్‌డిప్లొమా, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సుల ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీపెట్ సంచాలకుడు ఏవీఆర్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపెట్‌లో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రోసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కోర్సులు చదివినవారికి దేశ విదేశాల్లో వివిధ ప్లాస్టిక్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. శిక్షణలో ఉండగానే కంపెనీలు క్యాంపస్ సెలక్షన్‌లో విద్యార్థులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. eadmission.cipet.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉన్నదని సూచించారు. మరిన్ని వివరాలకు కోసం 9959333414 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## బీజేపీలో చేరిన అంబికా కృష్ణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో తెలుగు దేశం పార్టీకి మరో షాక్ తగిలింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, టీడీపీ నేత అంబికా కృష్ణ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఇప్పటికే టీడీపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు కాషాయ కండువాను కప్పుకొన్న సంగతి తెలిసిందే. తాజాగా అంబికా కృష్ణ కూడా బీజేపీలో చేరడంతో టీడీపీ నేతలు కంగుతిన్నారు.

# ఈవీఎంలొద్దు.. బ్యాలెట్ తేవాలి

లోక్‌సభలో తృణమూల్, బీఎస్పీ డిమాండ్

పార్లమెంట్ స్థాయీ సంఘాల నియామక ప్రక్రియ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)కు బదులు బ్యాలెట్ వ్యవస్థను తిరిగి అమలులోకి తేవాలని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యుడు సౌగతా రాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం జరిగిన చర్చలో పాల్గొంటూ తమ పార్టీ ఈవీఎంలను వ్యతిరేకిస్తున్నదని, బ్యాలెట్లు పత్రాలను తిరిగి అమలులోకి తేవాలన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో రైతుల ఆత్మహత్యలు, రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం, కశ్మీర్‌లో హత్యలు, నిరుద్యోగం, మీడియా స్వేచ్ఛ తదితర అంశాల ఊసే లేదన్నారు. లోక్‌సభలో బీఎస్పీ పక్ష నేత డానిష్ అలీ మాట్లాడుతూ ప్రధాని మోదీ జమిలి ఎన్నికలకు బదులు ఈవీఎంలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాల్సిందన్నారు. మరోవైపు ప్రభుత్వం పార్లమెంట్‌లో సభాసంఘాల నియామకానికి చర్యలు చేపట్టింది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), అంచనాల కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, ఓబీసీ సంక్షేమ స్థాయీ సంఘాల నియామకానికి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వేర్వేరు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్)లో సభ్యులైన ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత చెల్లించే కనీస పెన్షన్‌ను పెంచాలన్న అంశంపై సంప్రదింపులు జరుగుతున్నాయని కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ లోక్‌సభలో చెప్పారు. సంస్కృత విశ్వవిద్యాలయాల్లో 1,748 ఉపాధ్యాయ పోస్టులకు 800 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్ పొఖ్రియాల్ నిశాంక్ తెలిపారు.




పార్లమెంట్ ఎదుట నిరసన తెలుపుతున్న తృణమూల్ ఎంపీలు

# ఏ రాష్ర్టానికీ ప్రత్యేక హోదా ఇవ్వం

■ హోదాకు పారిశ్రామిక రాయితీలకు సంబంధం లేదు: సీతారామన్

**న్యూఢిల్లీ, జూన్ 24:** ఏ రాష్ర్టానికి ప్రత్యేక హోదా ఇచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో బీహార్‌కు చెందిన జేడీయూ ఎంపీ కౌసలేంద్ర కుమార్ అడిగిన ప్రశ్నలకు ఆమె లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రత్యేక హోదా కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, రాజస్థాన్ రాష్ర్టాల నుంచి కేంద్రానికి విజ్ఞప్తులు అందాయన్నారు. గతంలో ప్రణాళిక మద్దతు కోసం కొన్ని ప్రమాణాలమేరకు జాతీయ అభివృద్ధి మండలి ప్రత్యేక హోదాకు సిఫార్సు చేసేదని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఏ రాష్ర్టానికీ ప్రత్యేక హోదా కల్పించే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని తేల్చి చెప్పారు. అలాగే ప్రత్యేకహోదాకు, పారిశ్రామిక రాయితీలకు ఎలాంటి సంబంధం లేదని ఆమె బదులిచ్చారు.



# మోదీ గొప్ప సేల్స్‌మ్యాన్



సోమవారం లోక్‌సభలో మోదీ చిరునవ్వులు



అధిర్ రంజన్ చౌదరి

## అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చింది

మార్కెట్ చేసుకోవడంలో విఫలమై కాంగ్రెస్ చతికిలపడింది

2జీ కుంభకోణం నిజమైతే సోనియా, రాహుల్ జైల్లో ఎందుకు లేరు?

కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యలు

ప్రజాతీర్పును గౌరవించాలని బీజేపీ హితవు

**న్యూఢిల్లీ, జూన్ 24:** రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం లోక్‌సభలో అధికారపక్షం, విపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగింది. ప్రధానిమోదీ ప్రత్యర్థులు (ప్రతిపక్షాలు) ప్రజాతీర్పును గౌరవించాలని కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి పేర్కొనగా.. మోదీ గొప్ప సేల్స్‌మ్యాన్ అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. తన నిరాడంబర జీవితంపై ఇటీవల పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కిన సారంగిని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ప్రారంభించేందుకు అధికార బీజేపీ ఎంపిక చేసింది. సుమారు గంటపాటు ప్రసంగించిన ఆయన.. మోదీ నాయకత్వంపై పొగడ్తల వర్షం కురిపించారు. మోదీని స్వామి వివేకానందతో పోల్చారు. జాతీయవాదాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. వందేమాతరం నినాదంపై విశ్వాసం లేనివారికి దేశంలో నివసించే హక్కు ఉన్నదా అని ప్రశ్నించారు. మోదీని విమర్శించడమంటే.. హిమాలయ శిఖరంతో తమ తలను ఢీకొట్టుకున్నట్లేనని పేర్కొన్నారు. బాలాకోట్ దాడులకు ఆధారాలు చూపాలని ప్రతిపక్షాలు కోరడంపై ఆయన స్పందిస్తూ.. ప్రజలెవరైనా తమ తండ్రి గురించి తల్లిని ఆధారాలు కోరుతారా అని ప్రశ్నించారు. ప్రజలిచ్చిన తీర్పును విపక్షాలు గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి ' యాధృచ్ఛిక (యాక్సిడెంటల్) ప్రధాని'ని అందించిందని పరోక్షంగా మన్మోహన్ సింగ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మోదీ దేశానికి బలమైన నాయకత్వం అందించారని ప్రశంసించారు. 'విధాన పక్షవాతాన్ని' నిర్మూలించారని, అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠ పెంచారని, పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు నిర్వహించారని, పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. తనలాంటి సాధారణ వ్యక్తిని ఎంపీగా చేసినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

**మోదీ కీర్తనలో పరిధులు దాటిపోయారు..**

మోదీని కీర్తించడంలో కేంద్ర మంత్రి సారంగి అన్ని పరిధులు దాటిపోయారని, ఆయనను స్వామి వివేకానందతో పోలుస్తున్నారని కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి విమర్శించారు. సాధువును, రాక్షసుడిని పోల్చకూడదన్నారు. మోదీ ప్రభుత్వానికి పొగడ్తలు వ్యసనమయ్యాయని ఆరోపించారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ నేతలు 'కాంగ్రెస్ అంటే ఇందిర, ఇందిర అంటే కాంగ్రెస్' అని పొగిడేవారని గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్రధాని మోదీని నాలి (మురుగు) అంటూ అధిర్ తీవ్ర పదజాలంతో విమర్శించారు. దీనిపై బీజేపీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అమర్యాదపూర్వకంగా మాట్లాడొద్దని అధిర్‌కు స్పీకర్ సూచించారు. హిందీ సరిగా రాని కారణంగానే ఆ పదం దొర్లిందని అనంతరం లోక్‌సభ వెలుపల అధిర్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పారు. సభలో జరిగిన చర్చలో అధిర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ గొప్ప సేల్స్‌మ్యాన్ అని, అందుకే బీజేపీ తిరిగి అధికారంలోకి రాగలిగిందని వ్యాఖ్యానించారు. తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో చతికిలపడిందని చెప్పారు. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంపై బీజేపీ చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. అందులో తప్పు జరిగి ఉంటే యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జైల్లో ఎందుకు లేరని, ఇంకా ఎందుకు పార్లమెంటులో ఉన్నారని ప్రశ్నించారు.

**బీజేపీకి 'రాజకీయ దోపిడీ' సిండ్రోమ్**

బీజేపీ ప్రభుత్వం 'రాజకీయ దోపిడీ' అనే రుగ్మత బారిన పడిందని, తన ఘనతలను మాత్రమే హైలైట్ చేస్తూ, కాంగ్రెస్ వేసిన పునాదులను విస్మరిస్తున్నదని అధిర్ ఆరోపించారు. ఇది సత్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. హరిత విప్లవం, క్షీర విప్లవం, సాంకేతిక విప్లవాలకు కాంగ్రెస్ పార్టీనే అంకురార్పణ చేసిందని, జీడీపీ వృద్ధిరేటును పెంచిందని చెప్పారు. ఓఎన్జీసీ, ఐవోసీ, ఎన్టీపీసీ, ఎస్బీఐ, హెచ్ఏఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ హయాంలోనే ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు.

## అభినందన్ మీసాన్ని జాతీయ మీసంగా ప్రకటించండి



భారత వాయుసేన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ మీసాన్ని జాతీయ మీసంగా ప్రకటించాలని అధిర్ డిమాండ్ చేశారు. అలాగే అభినందన్ ధైర్య సాహసాలకుగాను పురస్కారం ప్రకటించాలని కోరారు. 'క్షిపణులతో పాకిస్థాన్‌ను తిప్పికొట్టామని మీరు (బీజేపీ) చెబుతున్నారు. కానీ ఆ క్షిపణులు తయారైనది కాంగ్రెస్ హయాంలోనే' అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలు తాము భారతీయులమని చెప్పుకునేందుకు సిగ్గుపడేవారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రజలు గర్వపడేలా చేసిందని ఓ విదేశీ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను అధిర్ ఖండించారు. మరి అప్పట్లో మాజీ ప్రధాని వాజపేయి కూడా భారతీయుడినని చెప్పుకునేందుకు సిగ్గుపడేవారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కరువుతో దేశం అల్లాడుతుంటే, ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా ఉందని అధిర్ మండిపడ్డారు.

## లోక్‌సభలో 'స్వచ్ఛంద ఆధార్' బిల్లు



బ్యాంకుల్లో ఖాతాలు తెరువడానికి, మొబైల్ ఫోన్ కనెక్షన్‌ను పొందడానికి వినియోగదారులు ఆధార్‌ను ఎలాంటి బలవంతం లేకుండా స్వచ్ఛందంగా ఇచ్చేందుకు సంబంధించిన బిల్లును సోమవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 2016 ఆధార్ చట్టానికి కొన్ని సవరణలు చేస్తూ, మార్చిలో తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సభ ముందుకు తీసుకురాగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఈ బిల్లు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉందని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) ఎంపీ ఎన్ కే ప్రేమచంద్రన్ ఆరోపించారు. ఈ బిల్లు కారణంగా ప్రైవేట్ టెలికాం ఆపరేటర్లకు ప్రజల సమాచారం సులభంగా లభిస్తుందని.. ఇది గోప్యతా హక్కుకు భంగం కలిగిస్తుందన్నారు. ఈ వాదనను కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఖండిస్తూ.. ఆధార్ వల్ల ప్రజల గోప్యతా హక్కుకు భంగం వాటిల్లదని, దీన్ని దేశ ప్రజలు ఆదరిస్తున్నారని, ఇప్పటికే 60 కోట్ల మందికి పైగా ప్రజలు ఆధార్‌తో సిమ్ కార్డులు తీసుకున్నారని స్పష్టం చేశారు. 18 ఏండ్ల లోపువారికి బయోమెట్రిక్ ఐడీ ప్రోగ్రాంల నుంచి మినహాయింపు ఇవ్వాలని బిల్లులో ప్రతిపాదించారు. ఆధార్ ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలకు విధించే జరిమానాలు కూడా ఈ బిల్లులో పొందుపరిచారు.

## ముస్లింలపై దాడులతో నవభారతం నిర్మిస్తారా?

ప్రధాని నరేంద్రమోదీకి ఎంపీ అసదుద్దీన్ ప్రశ్న



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ముస్లింలపై సామూహిక దాడులు పెరిగిపోతున్నాయని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. తాజాగా జార్ఖండ్‌లో ఓ యువకుడిని కొట్టిచంపిన ఘటనకు బీజేపీ, ఆరెస్సెస్‌లే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎవరైనా ముస్లింలు ఎదురుతిరిగితే వారిని ఉగ్రవాదిగానో, గోహంతకులుగానో, జాతి వ్యతిరేకులుగానో ముద్రవేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి వరుస ఘటనలతో అంతర్జాతీయ సమాజంలో మన దేశ ప్రతిష్ఠ దిగజారుతున్నదని చెప్పారు. ఒకవైపు నవభారతాన్ని నిర్మిస్తాం, మహాత్ముడి ఆశయ సాధనకు అంకితమవుతానంటున్న ప్రధాని మోదీ.. ఇంతటి హేయమైన ఘటనలను ఆపలేకపోతున్నారని ఆరోపించారు. దేశ జనాభాలో 14 శాతం ఉన్న ముస్లింలను హింసించడం ద్వారా ఎటువంటి నవభారతాన్ని నిర్మించాలనుకొంటున్నారని ఎంపీ ఒవైసీ ప్రశ్నించారు.



## నవభారత్ వద్దు.. పాత భారత్‌ను తిరిగిచ్చేయండి..

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలోనూ వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ ఈ సందర్భంగా బీజేపీపై విరుచుకుపడ్డారు. 'నవ భారతం'లో మనుషులను చూసి మనుషులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. మీ నవభారతాన్ని మీరే ఉంచుకుని, విద్వేషం, హత్యలు లేని.. ప్రేమతో నిండిన.. హిందూ, ముస్లింలు ఒకరి బాధలు ఒకరు పంచుకునే పాత భారతాన్ని తిరిగి చ్చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగిత రేటు ఎన్నడూ లేనంత అత్యధిక స్థాయికి చేరుకుందని, మైనర్లపై లైంగిక దాడి వంటి నేరాలు భారీగా పెరిగాయన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారని.. అయితే జాతిపితను హత్య చేసిన హంతకుడిని దేశభక్తుడిగా అభివర్ణించిన అధికార పార్టీ అభ్యర్థిపై (సాధ్వి ప్రజ్ఞాసింగ్) ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**భూసేకరణే రోడ్ల నిర్మాణానికి ప్రధాన అడ్డంకి:గడ్కరీ**

రోడ్ల నిర్మాణానికి భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారాలతో ముందుకు వస్తే రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులు ముందుకు వెళతాయని రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# బీజేపీలో చేరిన విదేశాంగ మంత్రి

జేపీ నడ్డా సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్న జైశంకర్

**న్యూఢిల్లీ, జూన్ 24:** కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తన మంత్రివర్గంలో జైశంకర్‌ను విదేశాంగ శాఖ మంత్రిగా నియమించడం తెలిసిందే. 1977 ఐఎఫ్ఎస్ ఆఫీసర్ జైశంకర్.. మోదీ ప్రభుత్వంలో మూడేండ్లు విదేశాంగ శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు. మంత్రిగా ప్రమాణం చేసిన ఆరు మాసాల్లోగా జైశంకర్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉన్న నేపథ్యంలో.. గుజరాత్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఆయనను బీజేపీ ప్రకటించింది.

**త్వరలో చిప్ ఆధారిత ఈ-పాస్‌పోర్టులు**

సమీప భవిష్యత్తులో ట్రావెల్ డాక్యుమెంట్లను ఆధునిక భద్రతా ప్రమాణాలతో రూపొందించేందుకు వీలుగా ఈ-పాస్‌పోర్టుల తయారీని ప్రతిపాదించినట్టు ఏడో పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. చిప్ ఆధారిత ఈ-పాస్‌పోర్టుల తయారీ కోసం ఇండియన్ సెక్యూరిటీ ప్రెస్‌తో చర్చలు ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. 'ఈ-పాస్‌పోర్టుల తయారీకి ప్రాధాన్యతనివ్వాలి. దీని వల్ల సమీప భవిష్యత్తులో ఆధునిక భద్రతా ప్రమాణాలు ప్రవేశపెట్టగలం' అని జైశంకర్ అన్నారు. పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం(పీఓపీఎస్‌కే) లేనటువంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో కొత్త పీఓపీఎస్‌కేలను ప్రారంభిస్తామని, ఏటా దాదాపు కోటి మందికి పాస్‌పోర్టులను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 505 పీఓపీఎస్‌కేలు సేవల్ని అందిస్తున్నట్టు వివరించారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవల్ని అందించినందుకు జలంధర్ పాస్‌పోర్ట్ కేంద్రం, కొచ్చిన్ పాస్‌పోర్ట్ కేంద్రం, కోయంబత్తూర్ పాస్‌పోర్ట్ కేంద్రాలకు అవార్డులిచ్చారు. పాస్‌పోర్ట్ జారీ క్రమంలో నిర్వహించే పోలీసు వెరిఫికేషన్ ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గిందని.. దీంట్లో ఏపీ, తెలంగాణ, కేరళ పోలీసుల సేవలు ప్రశంసనీయమని ఆయన అన్నారు.



జైశంకర్‌కు బీజేపీ సభ్యత్వ పత్రం ఇస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నడ్డా

# ఎస్పీతో పొత్తు ఖతం

స్వయంగా ప్రకటించిన మాయావతి.. ఇకపై అన్ని ఎన్నికల్లోనూ ఒంటరిపోరేనని స్పష్టం

ఓటమి తర్వాత అఖిలేశ్ తనకు కనీసం ఫోన్ చేయలేదని వ్యాఖ్య

**లక్నో, జూన్ 24:** 'మహాఘట్ బంధన్' కథ ముగిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మధ్య కుదిరిన పొత్తు విచ్చిన్నమైంది. సమాజ్‌వాదీ పార్టీతో స్నేహం ముగిసిందని బీఎస్పీ అధినేత్రి మాయావతి స్వయంగా ప్రకటించారు. ఇకపై చిన్న ఎన్నికల నుంచి పెద్ద ఎన్నికల వరకు అన్నింటిలోనూ ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌పైనా విమర్శలు గుప్పించారు. ఈ మేరకు సోమవారం వరుస ట్వీట్లు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమి అనంతరం అఖిలేశ్ యాదవ్ తనకు కనీసం ఫోన్ కూడా చేయలేదని ఆరోపించారు. ఓటమిపై విశ్లేషించేందుకు మాయావతి ఆదివారం బీఎస్పీ సీనియర్ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆ మరునాడే పొత్తుకు మంగళం పాడుతున్నట్టు ప్రకటించడం గమనార్హం.

**ఇక ఒంటరి పోరే..**

'2012-17 మధ్య ఎస్పీ ప్రభుత్వం రాష్ర్టాన్ని పాలించిన కాలంలో బీఎస్పీకి, దళితులకు వ్యతిరేకంగా ఎన్నో చర్యలు తీసుకున్నది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు, శాంతి భద్రతలు అదుపు తప్పడం వంటి ఎన్నో లోపాలు ఉన్నాయి.



అయినా వాటన్నింటినీ పక్కన పెట్టి దేశం కోసం లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్పీతో చేతులు కలిపాం. పొత్తు ధర్మానికి అనుగుణంగా నడుచుకున్నాం. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత ఎస్పీ నేతలు వ్యవహరిస్తున్న తీరు మమ్మల్ని పునరాలోచనలో పడేసింది. భవిష్యత్తులో ఎస్పీ-బీఎస్పీ కలిసి కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు' అని మాయావతి ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో బీఎస్పీ పార్టీ, దళిత ఉద్యమ భవిష్యత్తు దృష్ట్యా ఇకపై జరుగబోయే అన్ని ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీచేస్తామని స్పష్టం చేశారు.

**దళితులు ఎస్పీకి మద్దతు పలుకడం ఓర్వలేకే..**

మాయావతి విమర్శలపై ఎస్పీ జాతీయ కార్యదర్శి రామ్‌శంకర్ విద్యార్థి స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితవర్గాలు ఎస్పీకి, అఖిలేశ్‌కు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతున్నందునే మాయావతి అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని ఆమె నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమిలో మరో భాగస్వామి అయిన రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ స్పందిస్తూ సోమవారం నాటి పరిణామాలు ఎస్పీ-బీఎస్పీకి సంబంధించినవని, తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. 'మాకు ఎస్పీతోనే పొత్తు.. బీఎస్పీతో కాదు. కాబట్టి ఎస్పీతో మా స్నేహం కొనసాగుతుంది' అని యూపీ ఆర్ఎల్డీ అధ్యక్షుడు మసూద్ అహ్మద్ తెలిపారు. ఈ పరిణామాలపై యూపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ద్విజేంద్ర త్రిపాఠి స్పందిస్తూ.. 'పొత్తులో రెండు పార్టీల మధ్య నిబద్ధత చాలా ముఖ్యం. ఒకరికి ఇచ్చిన మాటను ఇంకొకరు నిలబెట్టుకోలేనివారు ఇక ప్రజలకు ఇచ్చిన మాటలను ఎలా నిలబెట్టుకుంటారు' అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ-ఆరెల్డీ కూటమి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. బీఎస్పీ 10 సీట్లు గెలుచుకోగా, ఎస్పీ ఐదు స్థానాలు మాత్రమే గెలుచుకున్నది. దీంతో విభేదాలు తలెత్తాయి.

# మన గగనతలంలోకి పాక్ రాలేదు

'బాలాకోట్' తర్వాత మన స్థావరాలపై దాడులు చేయలేకపోయింది

కార్గిల్ యుద్ధ సంస్మరణ కార్యక్రమంలో వాయుసేన అధిపతి ధనోవా



**గ్వాలియర్, జూన్ 24:** భారత్ అమ్ములపొదిలో రాఫెల్ యుద్ధవిమానాలు ఉంటే బాలాకోట్‌లో నిర్వహించిన వైమానిక దాడులు మరింత విజయవంతమై ఉండేవని వాయుసేన (ఐఏఎఫ్) అధిపతి బీఎస్ ధనోవా పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 20 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గ్వాలియర్ వైమానిక కేంద్రంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ధనోవా ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో బాలాకోట్‌లో నిర్వహించిన వైమానిక దాడులను ఆయన ప్రస్తావిస్తూ.. 'పాకిస్థాన్ విమానాలు మన గగనతలంలోకి ప్రవేశించలేదు. ఉగ్రవాద శిబిరాలను మేము ధ్వంసం చేశాం. మన సైనిక కేంద్రాలపై దాడులు జరుపడంలో పాక్ విఫలమైంది' అన్నారు. పౌర విమానయాన రంగం మన ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగమని ఆయన తెలిపారు. 'పాక్‌తో ఉద్రిక్తతలు తలెత్తినప్పటికీ మన గగనతలాన్ని మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. మన ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటమే ఇందుకు కారణం' అని ధనోవా పేర్కొన్నారు. ఐఏఎఫ్ సెంట్రల్ కమాండ్ అధిపతి రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. బాలాకోట్‌లో దాడులకు ముందు భారత వాయుసేన పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని కుల్ సెక్టార్‌లో దాడులు నిర్వహించేందుకు 2002 ఆగస్టు 2న నియంత్రణ రేఖను దాటిందని, మిరేజ్-2000 యుద్ధ విమానాల సాయంతో ఉగ్రవాద శిబిరాన్ని ధ్వంసం చేసిందని తెలిపారు. ఏఎన్-32 విమానం ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో కూలిపోవడంపై అడిగిన ఓ ప్రశ్నకు ధనోవా స్పందిస్తూ.. ఆధునిక విమానాలను సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అవి అందుబాటులోకి వస్తే ఏఎన్-32 విమానాలను తొలిగించి వాటిని రవాణాకు, శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగించుకుంటామని వివరించారు.

## జార్ఖండ్ మూకదాడి కేసులో 11మంది అరెస్ట్

ఇద్దరు పోలీసు అధికారుల సస్పెన్షన్

**రాంచీ, జూన్ 24:** జార్ఖండ్‌లో మూకదాడిలో ఒక వ్యక్తి మరణించిన కేసులో 11మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. తాబ్రేజ్ అన్సారీ (24) అనే యువకుడు గత మంగళవారం జంషెడ్‌పూర్ నుంచి సరాయికేల-ఖర్సావన్‌లోని కర్సోవాకు స్నేహితులతో కలిసి వస్తుండగా ఒక మూక అడ్డుకున్నది. తొలుత తమ మోటారు సైకిల్ దొంగిలించాడని ఆరోపిస్తూ తాబ్రేజ్ అన్సారీపై దాడి చేశారు. అతడు ముస్లిం అని తెలుసుకున్న దుండగులు.. జై శ్రీరాం, హనుమాన్ అని నినదించాలని ఒత్తిడి చేయగా నిరాకరించడంతో ఒక స్తంభానికి కట్టేసి గంటల తరబడి కొట్టారు. తీవ్ర గాయాల పాలైన తాబ్రేజ్ చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. దీంతో పోలీసులు, డాక్టర్లతోపాటు ఈ దాడితో సంబంధం ఉన్న వారందరిపై చర్య తీసుకోవాలని తాబ్రేజ్ భార్య షాహిస్తా పర్వీన్ డిమాండ్ చేశారు. కాగా పోలీసు అధికారులు.. చంద్రమోహన్ ఓరాన్, బిపిన్ బిహారీలను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

# మళ్లీ ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు



ఆంక్షల ఫైల్‌పై సంతకం చేస్తున్న ట్రంప్

తమ ఆర్థిక సాధనాలు ఉపయోగించుకునే వీలులేకుండా ఆదేశాలు

40 ఏండ్లుగా విధిస్తున్నారు.. కొత్తగా నష్టమేం లేదు: ఇరాన్

**టెహ్రాన్/వాషింగ్టన్:** ఇరాన్‌పై తాజాగా మరోసారి తీవ్రమైన ఆంక్షలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అమెరికా పరిధిలోని ఆర్థిక సాధనాలను ఇరాన్ అధినేతతో పాటు ఆ దేశ అధికారులెవరూ ఉపయోగించుకునే వీలులేకుండా ఈ ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. గత నలభై ఏండ్లుగా అమెరికా తమ దేశంపై ఆంక్షలను విధిస్తూనే ఉన్నదని, ఇప్పుడు విధించడానికి కొత్తగా ఏమీలేదని.. వాళ్లు విధించే ఆంక్షలు తమ దేశంపై ఎలాంటి ప్రభావం చూపవని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి అబ్బాస్ మౌసావి పేర్కొన్నారు. అయితే ఇరాన్ ప్రజల నుంచి మాత్రం అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. 'ప్రజలు ధైర్యంగా ఉండాలని నాయకులు చెబుతున్నా ఇప్పటికే ఫలితం అనుభవిస్తున్నాం. అమెరికాతో అణు ఒప్పందం జరిగినప్పుడు ఇరాన్ కరెన్సీ విలువ ఒక డాలరుకు 32వేల రియాల్స్(ఇరాన్ కరెన్సీ)గా ఉండేది. ఇప్పుడు 1,30,000రియాల్స్‌కు పడిపోయింది' అని ఓ మహిళా అకౌంటెంట్ వాపోయారు. మరోవైపు అమెరికా నూతన ఆంక్షలు అక్రమమని రష్యా పేర్కొంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రపంచదేశాలు ఒకే వేదికపైకి రావాలని కోరుతూ అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో సోమవారం సౌదీ రాజు అబ్దుల్‌జీజ్ అల్ సౌదీతో భేటీ అయ్యారు. కాగా.. గల్ఫ్ నుంచి ప్రయాణించే వివిధ దేశాలకు చెందిన చమురు నౌకల రక్షణ బాధ్యత ఆయా దేశాలదేనని డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఓ ట్వీట్ చేశారు.

**మాపై సైబర్ దాడి అబద్ధం**

ఇరాన్ నిఘా వర్గాలు, క్షిపణులను నియంత్రించే కంప్యూటర్లను అమెరికా సైబర్ సైన్యం హ్యాక్ చేసిందన్న వార్తలను ఇరాన్ తోసిపుచ్చింది. 'మా దేశంపై సైబర్ దాడి చేయడానికి వాళ్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు' అని ఇరాన్ టెలీ కమ్యూనికేషన్ మంత్రి మహమ్మద్ జావెద్ అజారారి జహ్రోమి తెలిపారు. ఇరాన్ గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించే అమెరికా నిఘా డ్రోన్‌లను కూల్చేయడానికి తాము ఇప్పటికీ వెనుకాడమని ఇరాన్ నేవీ కమాండర్ ఒకరు హెచ్చరించారు.

## పౌష్టికాహార లోపం.. వేడి వాతావరణం వల్లే!

బీహార్‌లో చిన్నారుల మృత్యువాతపై ఐఎంఏ వెల్లడి

రాష్ట్రసర్కార్‌కు, కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ/ పాట్నా, జూన్ 24:** బీహార్‌లో వందమందికిపైగా బాలలు మృత్యువాత పడటానికి పౌష్టికాహారలోపం, వేడి, గాలిలో తేమ తదితర కారణాలే ప్రధానమని భారతీయ వైద్య మండలి (ఐఎంఏ) నిర్ధారించింది. పడిగడపున లిచీ పండ్లు తినటం వల్ల ఈ అకాల మరణాలు సంభవిస్తుండవచ్చన్న వాదన సరికాదని ఐఎంఏ పేర్కొంది. బీహార్‌లో చిన్నారుల మృత్యువాతపై నలుగురు వైద్యులతో కూడిన ఐఎంఏ బృందం ఆ రాష్ట్రంలో పర్యటించి పరిస్థితులను అధ్యయనం చేసింది. డీహైడ్రేషన్, హైపోగ్లైసీమియా, వేడి వాతావరణం.. వీటికితోడు పౌష్టికాహారం కారణంగానే పిల్లలు రాలిపోయారని తమ పరిశీలనలో తేలినట్లు వెల్లడించింది. ఈ కారణాల వల్లే అక్యూట్ ఎన్సెఫలైటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) ప్రబలి చిన్నారులను బలిగొని ఉంటుందని పేర్కొంది. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు రాత్రివేళ పిల్లలకు ఉచిత భోజనాన్ని అందుబాటులో ఉంచటం ద్వారా, ఓఆర్ఎస్ ప్యాకెట్లను విరివిగా అందుబాటులోకి తేవడం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చునని వివరించింది. మరోవైపు, బీహార్‌లో ఏఈఎస్ విస్తరించడం, 100 మందికి పైగా చిన్నారులు మరణించడం తీవ్ర ఆందోళనకరమని, దీని నివారణకు తీసుకున్న చర్యలేమిటో తెలియజేస్తూ వారంలోగా అఫిడవిట్ సమర్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం కేంద్రంతోపాటు బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బీహార్‌లో ఆదివారం మరో ఇద్దరు పిల్లలు మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 152 మందికి చేరింది. మధ్యప్రదేశ్‌లో ఏఈఎస్ కారణంగా ఓ బాలుడు మరణించడంతో ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

## ఇథియోపియా సంక్షోభ సూత్రధారి కాల్చివేత

**అడిస్ అబాబా:** ఇథియోపియాలో తాజా సంక్షోభానికి సూత్రధారిగా అనుమానిస్తున్న అసమిన్యూను ఆ దేశ పోలీసులు కాల్చి చంపారు. ఈ మేరకు ఆ దేశ అధికార టీవీ చానల్ ఈబీసీ సోమవారం వెల్లడించింది. స్వయం ప్రతిపత్తి రాష్ట్రం అంహర రాజధాని బహిర్ దార్‌లో శనివారం జరిగిన కాల్పుల దాడిలో ఆ రాష్ట్ర అధ్యక్షుడు అంబచ్యూ చనిపోయారు. ఇక ఆదివారం అడిస్ అబాబాలో దేశ సైన్యాధిపతి సియరే మెకొన్నెన్‌పై అంగరక్షకులు కాల్పులు జరిపి హత్య చేశారు. ఈ రెండు ఘటనలకు గతంలో ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి అరెస్టై క్షమాభిక్షతో గతేడాది విడుదలైన అసమిన్యూకు ప్రమేయం ఉందని అనుమానించారు. ఈ దాడులతో మరో తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలం కావడంతో అంహర స్వయంప్రతిపత్తి మండలి రాజధాని బహిర్ దార్‌లోని రహస్య ప్రాంతంలో దాగిన అసమిన్యూను సోమవారం పోలీసులు కాల్చి చంపారు.

ఆట నమస్తే తెలంగాణ

క్రికెట్ సమరం WORLD CUP

కరీంనగర్ | WWW.NTNEWS.COM | మంగళవారం 25 జూన్ 2019 | 10

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 6 | 5 | 0 | 1 | +1.30 | 11 |
| 2. | ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | +0.84 | 10 |
| 3. | భారత్ | 5 | 4 | 0 | 1 | +0.80 | 9 |
| 4. | ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | +1.45 | 8 |
| 5. | బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.13 | 7 |
| 6. | శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.11 | 6 |
| 7. | పాకిస్థాన్ | 6 | 2 | 3 | 1 | -1.26 | 5 |
| 8. | వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | +0.19 | 3 |
| 9. | దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.32 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 7 | 0 | 7 | 0 | -1.63 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

వరల్డ్ కప్‌లో నేడు: ఇంగ్లండ్ X ఆస్ట్రేలియా - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు: 476 షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు: 15 ఆమిర్ (పాకిస్థాన్)

కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ మొదట బ్యాట్‌తో తర్వాత బంతితో అదరగొట్టడంతో బంగ్లాదేశ్ సునాయాస విజయాన్ని ఖాతాలో వేసుకుంది. భారత్‌పై చివరి ఓవర్ వరకు ఆశలు వదులుకోకుండా పోరాడిన ఆఫ్ఘనిస్థాన్.. ఈసారి ఆ మ్యాజిక్ రిపీట్ చేయలేకపోయింది. మొదట తమ స్పిన్ బలంతో బంగ్లాను కట్టడి చేసిన ఆఫ్ఘన్.. ఆనక అదే స్పిన్ ఉచ్చులో పడి విలవిల్లాడింది. ఫలితంగా బంగ్లా పులులు సెమీస్ అవకాశాలను మెరుగు పర్చుకోగా.. కాబూలీలు వరుసగా ఏడో ఓటమిని మూటగట్టుకున్నారు.



షకీబ్ (51, 5/29)

ముష్ఫికర్ (83)

# షకీబ్ షో

## ఆల్‌రౌండ్ ప్రదర్శనతో దుమ్మురేపిన ఆల్‌రౌండర్

### ఆఫ్ఘనిస్థాన్‌పై 62 పరుగులతో బంగ్లా విజయం.. మొర్తజాసేన సెమీస్ ఆశలు సజీవం

**సౌతాంప్టన్:** గత మ్యాచ్‌లో భారత్‌ను భయపెట్టిన పిచ్‌పై ఆఫ్ఘనిస్థాన్ మరోసారి స్ఫూర్తివంతమైన ప్రదర్శనే చేసినా.. బంగ్లా తురుపుముక్క షకీబ్ (51; 5/29) అసమాన పోరాటం ఆ జట్టు ఆశలపై నీళ్లు కుమ్మరించింది. బ్యాటింగ్‌లో అర్ధశతకంతో పాటు బౌలింగ్‌లో ఆఫ్ఘన్ టాపార్డర్‌ను బెంబేలెత్తించిన షకీబ్ బంగ్లాకు మూడో విజయాన్నందించాడు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 62 పరుగుల తేడాతో ఆఫ్ఘన్‌ను చిత్తు చేసి పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 50 ఓవర్లలో 7 వికెట్లకు 262 పరుగులు చేసింది. గత మ్యాచ్ సెంచరీ హీరో ముష్ఫికర్ రహీం (87 బంతుల్లో 83; 4 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి ఆకట్టుకున్నాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో ముజీబ్ (3/39), నైబ్ (2/56) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ 47 ఓవర్లలో 200 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ గుల్బదీన్ నైబ్ (47; 3 ఫోర్లు), సమీఉల్లా షిన్వారి(51 బంతుల్లో 49 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడారు. షకీబ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

#### మళ్లీ మెరిసిన షకీబ్..

ఆఫ్ఘన్ స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు భారత బ్యాట్స్‌మెన్ నానా తంటాలు పడ్డ పిచ్‌పై బంగ్లా మాత్రం సమిష్టి మంత్రం జపించి మెరుగైన స్కోరు చేసింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు కొచ్చి ఓపెనర్‌గా బరిలో దిగిన లిటన్ దాస్ (16) పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో బంగ్లాకు శుభారంభం దక్కలేదు. ముజీబ్ బంతిని తప్పుగా అంచనా వేసిన లిటన్ కవర్స్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ తమీమ్ (36; 4 ఫోర్లు)తో కలిసి ఇన్‌ఫామ్ బ్యాట్స్‌మన్ షకీబ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి బంగ్లా వికెట్ నష్టానికి 44 పరుగులు చేసింది. రెండో వికెట్‌కు 59 పరుగులు జతచేశాక తమీమ్ ఔటయ్యాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ముష్ఫికర్ చక్కటి షాట్లతో అలరించాడు. మరోవైపు టోర్నమెంట్‌లో ఐదోసారి హాఫ్ సెంచరీ మార్క్ చేరిన షకీబ్.. ముజీబ్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో మూడో వికెట్‌కు నమోదైన 61 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. సౌమ్యా సర్కార్ (3) మరోసారి విఫలమయ్యాడు. మధ్య ఓవర్లలో ఆఫ్ఘన్ బౌలర్లు పట్టుబిగించడంతో వరుసగా 12 ఓవర్ల పాటు ఒక్క బౌండ్రీ కూడా నమోదు కాలేదు. సింగిల్స్, డబుల్స్‌తో స్ట్రయిక్ రొటేట్ చేసిన ముష్ఫికర్ 56 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కాసేపు పోరాడిన మహ్మదుల్లా (27) క్యాచ్ ఔట్ కాగా.. ఆఖర్లో ముష్ఫికర్, మొసద్దిక్ (35) కూడా వెనుదిరిగారు.



నైబ్ (47)

#### అవసరమైనప్పుడల్లా..

టీమ్ ఇండియా బౌలింగ్‌తో పోల్చుకుంటే బలహీనమైన లైనప్ ఉన్న బంగ్లాదేశ్‌పై కష్టతరం కాని లక్ష్య ఛేదన కోసం బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్‌కు మంచి స్టార్ట్ లభించింది. ఓపెనర్లు గుల్బదీన్ నైబ్, రహ్మత్ షా (24; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 49 పరుగులు జోడించారు. వీరిద్దరు సాధికారికంగా ఆడుతూ ముందుకు సాగడంతో ఆందోళనకు గురైన బంగ్లా కెప్టెన్ మొర్తజా.. బంతిని షకీబ్ చేతికిచ్చాడు. తొలి ఓవర్‌లోనే రహ్మత్‌ను ఔట్ చేసిన షకీబ్ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. కాసేపటికే హష్మతుల్లా (11) కూడా వెనుదిరిగాడు. అయితే ఆఫ్ఘన్‌కు అసలు షాక్ మాత్రం 29వ ఓవర్‌లో తగిలింది. మూడు బంతుల వ్యవధిలో నైబ్, మొహమ్మద్ నబీ (0)ను ఔట్ చేసిన షకీబ్ కాబూలీలను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. అంతకు ముందు 104/2తో మంచి స్థితిలో కనిపించిన ఆఫ్ఘన్ కాసేపటికే అస్గర్ ఆఫ్ఘన్ (20) వికెట్ కూడా కోల్పోవడంతో.. 119/5తో కష్టాల్లో కూరుకుపోయింది. ఈ వికెట్ కూడా షకీబ్ ఖాతాలోకే వెళ్లింది. అనవసర పరుగు కోసం యత్నించిన ఇక్రామ్ (11) రనౌటయ్యాడు. ఈ దశలో నజీబుల్లా (23)తో కలిసి సమీఉల్లా పోరాడాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 56 పరుగులు జోడించి ఆశలు రేపారు. అయితే చివరి స్పెల్ వేయడానికి వచ్చిన షకీబ్.. నజీబ్‌ను ఔట్ చేసి ఆఫ్ఘన్ ఆశలను అడియాసలు చేశాడు. ముస్తఫిజుర్ లోయర్ ఆర్డర్ పని పట్టడంతో మరో 3 ఓవర్లు మిగిలుండగా ఆఫ్ఘన్ ఆలౌటైంది.

**2** విశ్వవేదికపై ఒకే మ్యాచ్‌లో అర్ధసెంచరీతో పాటు 5 వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా షకీబ్ రికార్డులకెక్కాడు. అంతకుముందు యువరాజ్ సింగ్ (2011లో ఐర్లాండ్‌పై; 5/31, 50 నాటౌట్) ఈ ఫీట్ సాధించాడు.

**1** ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ తరఫున 1000 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా షకీబ్ నిలిచాడు. ఓవరాల్‌గా ప్రపంచకప్‌లో వెయ్యి పరుగులు పూర్తి చేసుకున్న 19వ ఆటగాడు షకీబ్.

#### స్కోరు బోర్డు

**బంగ్లాదేశ్:** లిటన్ (సి) హష్మతుల్లా (బి) ముజీబ్ 16, తమీమ్ (బి) నబీ 36, షకీబ్ (ఎల్బీ) ముజీబ్ 51, ముష్ఫికర్ (సి) నబీ (బి) దౌలత్ 83, సర్కార్ (ఎల్బీ) ముజీబ్ 3, మహ్మదుల్లా (సి) నబీ (బి) నైబ్ 27, మొసద్దిక్ (బి) నైబ్ 35, సైఫుద్దీన్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు:** 9, **మొత్తం:** 50 ఓవర్లలో 262/7. **వికెట్ల పతనం:** 1-23, 2-82, 3-143, 4-151, 5-207, 6-251, 7-262, **బౌలింగ్:** ముజీబ్ 10-0-39-3, దౌలత్ 9-0-64-1, నబీ 10-0-44-1, నైబ్ 10-1-56-2, రషీద్ 10-0-52-0, రహ్మత్ 1-0-7-0.

**ఆఫ్ఘనిస్థాన్:** నైబ్ (సి) లిటన్ (బి) షకీబ్ 47, రహ్మత్ షా (సి) తమీమ్ (బి) షకీబ్ 24, హష్మతుల్లా (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మొసద్దిక్ 11, అస్గర్ (సి) (సబ్) షబ్బీర్ (బి) షకీబ్ 20, నబీ (బి) షకీబ్ 0, సమిఉల్లా , ఇక్రామ్ (రనౌట్) 11, నజీబుల్లా (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) షకీబ్ 23, రషీద్ (సి) మొర్తజా (బి) ముస్తఫిజుర్ 2, దౌలత్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 0, ముజీబ్ (బి) సైఫుద్దీన్ 0, **ఎక్స్‌ట్రాలు:** 13, **మొత్తం:** 47ఓవర్లలో 200ఆలౌట్. **వికెట్లపతనం:** 1-49, 2-79, 3-104, 4-104, 5-117, 6-132, 7-188, 8-191, 9-195, 10-200, **బౌలింగ్:** మొర్తజా 7-0-37-0, ముస్తఫిజుర్ 8-1-32-2, సైఫుద్దీన్ 8-0-33-1, షకీబ్ 10-1-29-5, మెహదీ 8-0-37-0, మొసద్దిక్ 6-0-25-1.

## ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

పరుగు ప్రారంభించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. బోయిన్‌పల్లి నుంచి మొదలైన పరుగులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. హైదరాబాద్‌ను విశ్వక్రీడా నగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. నగరంలోని ఆరు ముఖ్య కూడళ్ల నుంచి ప్రారంభమైన ఒలింపిక్ డే రన్ నిజాం కళాశాల మైదానంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రంగారావు, జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ వోఎస్డీ ప్రేమ్‌రాజ్, కోశాధికారి మహేశ్ సాగర్, నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మికాంత్ రాథోడ్, మర్రి లక్ష్మణ్‌రెడ్డి, భారత బేస్‌బాల్ మాజీ కెప్టెన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఎంపీఎల్ టీ20 టోర్నీ



**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** మహబూబ్‌నగర్ ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) 5టీ-20 క్రికెట్ టోర్నీ హోరాహోరీగా కొనసాగుతున్నది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో వీఎస్‌జీ ఇండియన్స్ జట్టు ఆల ఫోర్స్‌పై 23 పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మరో మ్యాచ్‌లో ఎంఎస్‌ఎన్ బ్రదర్స్ జట్టు 69 పరుగులతో వీవీఆర్ షాద్‌నగర్ ఫైటర్స్‌ను ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించింది. ఈనెల 26న జరిగే వేర్వేరు సెమీస్ మ్యాచ్‌ల్లో జేఆర్ వారియర్స్, ఎంఎస్‌ఎన్ బ్రదర్స్‌తో, ఎంకే సైక్లోన్..వీఎస్‌జీ ఇండియన్స్ తలపడుతాయి.

## ఆ ఓటమితో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా..



ఆర్థర్

**లండన్:** ప్రపంచకప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ చిత్తుగా ఓడిపోయిన ప్రభావం మామూలుగా లేదు. అన్ని విభాగాల్లో ఘోరంగా విఫలమై భారీ ఓటమి మూటగట్టుకున్న దాయాదిపై అటు అభిమానులకు తోడు మాజీలు విమర్శలతో దుమ్ముదులిపారు. కోహ్లీసేనకు కనీస పోటీనివ్వడంలో పాక్ ఏమాత్రం పోరాటపటిమ చూపించకపోవడంపై ఆటగాళ్లు ఫీలయ్యారో లేదో గానీ కోచ్ మిక్కీ ఆర్థర్ మాత్రం ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడట. 'గత ఆదివారం ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. కానీ దాన్ని ఒక ప్రదర్శనగా పరిగణించాను. ఒక మ్యాచ్ ఓడిపోతే..మరోటి కోల్పోవాల్సి ఉంటుంది. అందునా ఇది ప్రపంచకప్.. మీడియా ప్రతి అంశాన్ని తీక్షణంగా పరిశీలిస్తూ ఉంటుంది. అదే సమయంలో అభిమానుల అంచనాలను అందుకోవాలి. దానికి తగ్గట్లు రాణించి పోటీలో నిలువాలి' అని ఆర్థర్ అన్నాడు.

## గాయంతో రస్సెల్ ఔట్



**మాంచెస్టర్:** ప్రపంచకప్‌లో వరుస పరాజయాలతో దాదాపు సెమీస్ అవకాశాలను దూరం చేసుకున్న వెస్టిండీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, భారీ హిట్టర్ ఆండ్రీ రస్సెల్.. మోకాలి గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించా డు. టోర్నీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో మాత్రమే గెలిచిన విండీస్.. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని ఆరాటపడుతున్న తరుణంలో రస్సెల్ దూరమవడం శరాఘాతంగా మారింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఒంటిచేత్తో విజయాలు అందించిన రస్సెల్.. ప్రపంచకప్‌లో మాత్రం విండీస్ తరఫున బ్యాట్ తో ఆకట్టుకోలేకపోయాడు. ఆరింట్లో నాలుగు మ్యాచ్‌లు ఆడగా కేవలం 36 పరుగులు(12సగటు) చేశాడు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు(5.31 ఎకానమీ) తీసి ఫర్వాలేదనిపించాడు. రస్సెల్ స్థానంలో కరీబియన్ జట్టులో సునీల్ అంబ్రీస్ చోటు దక్కించుకున్నాడు.

## వేలానికి బెకర్ ట్రోఫీలు

**బెర్లిన్:** జర్మనీకి చెందిన బోరిస్ బెకర్.. టెన్నిస్ ఆల్‌టైమ్ దిగ్గజాల్లో ఒకడు. అతిపిన్న వయసులో వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలిచిన రికార్డు ఇంకా అతడి పేరిట ఉంది. 17 ఏండ్ల వయసులోనే మూడు టైటిళ్లు గెలిచి ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచాడు. ఇదంతా ఓవైపు అయితే, మరోవైపు ప్రస్తుతం బ్యాంకు రుణాలు చెల్లించేందుకు డబ్బులు లేక ఇంత వరకు సాధించిన ట్రోఫీలు, పతకాలు, వాచీలు, ఫొటోలను ఆన్‌లైన్‌లో వేలానికి పెట్టనున్నాడు. బ్రిటీష్ సంస్థ వైల్స్ హార్డీ ద్వారా వీటిని విక్రయించనున్నాడు. జూలై 11 నుంచి సంస్థ వెబ్‌సైట్‌లో వేలం ప్రారంభం కానుంది. 2017లో బెకర్‌ను రుణ ఎగవేతదారుగా బ్యాంకులు ప్రకటించాయి. 2018లోనే ట్రోఫీలను, బహుమతులను వేలం వేసేందుకు బ్యాంకులు ప్రయత్నించగా చివరి నిమిషంలో ఆ ప్రక్రియ ఆగిపోయింది.

## బాబర్.. కోహ్లీలా ఆడడం నేర్చుకో



అక్తర్

**లండన్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లీని ఆరాధించే క్రికెటర్‌గా.. అతడిలాగా అత్యుత్తమంగా ఆడడం నేర్చుకోవాలని పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్ బాబర్ ఆజమ్‌కు ఆ దేశ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్ హితబోధ చేశాడు. 'కోహ్లీని అభిమాన క్రికెటర్‌గా భావిస్తున్నప్పుడు.. నీవు కూడా అతడిలా అడటం నేర్చుకోవాలి. కఠినమైన పరిస్థితుల్లో విరాట్ ఎన్నోసార్లు చాలా పరుగులు చేశాడు. విరాట్, రోహిత్, విలియమ్సన్ లాంటి బ్యాట్స్‌మెన్ అర్ధశతకం తర్వాత వేగంగా ఆడతారు. బాబర్ అది నేర్చుకోవాలి. షాట్ల రేంజ్‌ను పెంచుకోవాలి' అని అక్తర్ సూచించాడు. గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుతంగా ఆడి విజయంలో కీలకపాత్ర పోషించిన హరీస్ సోహైల్(59బంతుల్లో 89)ను ఈ రావల్పిండి ఎక్స్‌ప్రెస్ ప్రశంసలతో ముంచెత్తాడు.

భారత్-పాకిస్థాన్ పోరాటం తర్వాత ప్రపంచమంతా ఎదురుచూస్తున్న పోరుకు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం సిద్ధమైంది. కదనరంగంలో ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ ఆటగాళ్ల పరాక్రమాన్ని చూసేందుకు అభిమానులు రెడీ అయ్యారు. అంతర్జాతీయ యవనికపై వన్డేల్లో రికార్డుల రారాజు, ప్రపంచకప్ అంటే రెచ్చిపోయే కంగూరూలు హోరాహోరీగా తలపడుతుంటే ఆ క్షణాలను ఆస్వాదించేందుకు క్రికెట్ ప్రేమికులు సన్నద్ధమయ్యారు. వరుస విజయాలతో కంగారూలు సెమీస్ చేరువలో ఉంటే.. ఇంగ్లండ్ మాత్రం అనూహ్య పరాజయాలతో బ్రేకులు వేసుకుంటూ ముందుకు సాగుతున్నది. మరి ఈ చిరకాల ప్రత్యర్థుల పోరుతో పైచేయి ఎవరిదో... నిజమైన ఫేవరెట్లం మేమేనంటూ కాలరెగరేసేదెవరో చూడాలి.

# పైచేయి ఎవరిదో?

### నేడు ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ పోరు.. లార్డ్స్ వేదికగా చిరకాల ప్రత్యర్థుల ఢీ



ఫించ్



మోర్గాన్

**లండన్:** ఇంగ్లండ్-ఆస్ట్రేలియా మ్యాచ్. అందునా ప్రపంచకప్. అదీ జరిగేది క్రికెట్ మక్కా లార్డ్స్ మైదానంలో. ఇక అభిమానుల అంచనాలు, భావోద్వేగాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇంతటి ఉత్కంఠభరిత వాతావరణంలో తలపడేందుకు ఆ రెండు జట్లు సిద్ధమయ్యాయి. టోర్నీలో ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో(10పాయింట్లు) ఆస్ట్రేలియా సెమీస్‌కు చేరువలో ఉంటే.. అనూహ్యంగా పాకిస్థాన్, శ్రీలంక చేతుల్లో పరాజయం పాలై పాలుపోని స్థితిలో ఇంగ్లండ్(8పాయింట్లు) ఉంది. సెమీస్ చేరాలంటే ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ చాలా కీలకం. ఒకవేళ ఓడితే ఆ తర్వాత జరిగే భారత్, న్యూజిలాండ్ మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ఈ పోరులో గెలిచి తీరాలని ఇంగ్లండ్ పట్టుదలగా ఉంది. మరోవైపు స్వేచ్ఛగా ఆడి ఇటీవల తమపై ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఇంగ్లండ్‌పై కసి తీర్చుకోవాలని ఆసీస్ భావిస్తున్నది.

#### మచ్చ చెరిపేసుకునేందుకు..

వన్డేల్లో 350 స్కోరు చేయడం ఇంగ్లండ్‌కు నీళ్లు తాగినంత సులభమనే ప్రశంసలు ఎన్ని వస్తున్నాయో.. ఆ జట్టు ఫ్లాట్ పిచ్‌ల పులే అన్న విమర్శలు అన్నే వినిపిస్తున్నాయి. గత మ్యాచ్‌లో శ్రీలంకతో స్వల్ప స్కోరు(233)ను ఛేదించలేక చతికిలపడ్డాక ఈ వాదనలకు మరింత బలం చేకూరింది. దీంతో బౌలింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌పై వీరవిహారం చేసి పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా సత్తా చాటగలమని చాటిచెప్పాలని మోర్గాన్ సేన పట్టుదలగా ఉంది. ఆ జట్టులో రూట్ భీకరఫామ్‌లో ఉండగా, కెప్టెన్ మోర్గాన్ ఆఫ్ఘన్ మ్యాచ్‌లో విశ్వరూపమే చూపాడు. బెయిర్‌స్టో, బట్లర్ అనుకున్న స్థాయిలో రాణించడం లేదు. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కోవాలంటే అందరూ సమిష్టిగా రాణించాల్సిందే. మరోవైపు ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్(15 వికెట్లు) ఒక్కడే టోర్నీలో ఆకట్టుకుంటున్నాడు. వోక్స్, ఉడ్ ఫర్వాలేదనిపిస్తున్నారు. కంగారూ బ్యాట్స్‌మెన్‌ను కంగారెత్తించాలంటే స్పిన్నర్ ఆదిల్ రషీద్ సత్తా చాటాల్సిందే.

#### ఓపెనర్లు అదుర్స్

ఆస్ట్రేలియాకు ప్రధాన బలం ఓపెనర్లు వార్నర్, ఫించ్. వార్నర్(447) రెండు శతకాలు, రెండు అర్ధశతకాలతో టోర్నీలో రెండో టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇంక ఫించ్ కూడా అదే స్థాయిలో రెచ్చిపోతున్నాడు. స్మిత్, ఖవాజతో పాటు మ్యాక్స్‌వెల్ మెరిస్తే ఆ జట్టుకు తిరుగుండదు. అయితే మిడిల్‌ఆర్డర్ ప్రదర్శనే ఆసీస్‌ను కొంత ఆందోళనకు గురిచేస్తున్నది. బౌలర్లలో మిచెల్ స్టార్క్ అదరగొడుతుంటే.. కమ్మిన్స్, స్టొయినిస్, జంపా అనుకున్న స్థాయిలో రాణిస్తున్నారు.

#### రాయ్ డౌటే..

ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ ఓపెనర్ జేసన్ రాయ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. మొత్తం ఆ జట్టుపై అతడు 759 పరుగులు(47.3సగటుతో) 114 స్ట్రయిక్ రేట్‌తో సాధించాడు. అయితే గాయం కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరమైన అతడు.. ఈ మ్యాచ్‌లోనూ ఆడేది అనుమానంగా మారింది.

**ప్రపంచ కప్‌లో..**

| | |
|---|---|
| ఆడిన మ్యాచ్‌లు | 7 |
| ఆస్ట్రేలియా గెలిచినవి | 5 |
| ఇంగ్లండ్ గెలిచినవి | 2 |

## ఇంగ్లండ్‌ను చూసి నేర్చుకోండి



కలీస్

**లండన్:** అంతర్జాతీయ వన్డేల్లో తిరిగి ఎలా పుంజుకోవాలో.. ఇంగ్లండ్‌ను చూసి నేర్చుకోవాలని దక్షిణాఫ్రికా జట్టుకు ఆ దేశ క్రికెట్ దిగ్గజం జాక్వెస్ కలీస్ సూచించాడు. ప్రపంచకప్‌లో వరుస పరాజయాలతో సెమీస్ అవకాశాలను సఫారీలు పూర్తిగా దూరం చేసుకున్న నేపథ్యంలో కలీస్ ఐసీసీకి రాసిన కాలమ్‌లో పలు అంశాలను ప్రస్తావించాడు. 'సరిగ్గా నాలుగేండ్ల క్రితం జరిగిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. కానీ ఇప్పుడు అదే మోర్గాన్ కెప్టెన్సీలోని ఇంగ్లిష్ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోవడంతో పాటు మెగాటోర్నీలో కప్‌ను కచ్చితంగా గెలువగల జట్టుగా కొనసాగుతున్నది. ఆ జట్టు క్రికెటర్లలో ఎలాంటి భయం కనిపించడం లేదు, తప్పులు చేసేందుకు ఎవరూ సాహసించడం లేదు. అదే దక్షిణాఫ్రికా విషయానికొస్తే.. ప్రపంచకప్‌లో డిఫెన్స్ వైఖరిని అవలంభిస్తున్నది. అయినా జట్టును మొత్తం మార్చాల్సిన అవసరం లేదు. రబాడ, ఎంగ్డీ, ఫెలుక్వాయో, మార్క్‌రమ్ లాంటి ప్రతిభ కల్గిన యువ క్రికెటర్లు ఉన్నారు. ఇలాంటి వారే భవిష్యత్తుకు పునాది లాంటి వారు. నాలుగేండ్ల కాలంలో ఇంగ్లండ్ జట్టులో ఎంతలా మారిపోయిందో వారిని చూసి మనం నేర్చుకోవాలి' అని కలీస్ అన్నాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,123 | 11,700 |
| ↘71 | ↘24 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.61 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,270 |
| 22 క్యారెట్లు | 34,100 |
| వెండి (కిలో) | 39,090 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.80 | 72.30 |
| యూరో | 75.80 | 83.80 |
| బహ్రెయిన్ దినార్ | 175.50 | 189.50 |
| కువైట్ దినార్ | 220.20 | 235.20 |
| సౌదీ రియాల్ | 17.50 | 19.30 |
| యూఏఈ దిర్హామ్ | 18.00 | 19.60 |

**చికెన్ ధరలు** (రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 124.00 |
| రిటైల్ లైవ్ | 146.00 |
| డ్రెస్డ్ | 212.00 |
| స్కిన్‌లెస్ | 241.00 |

**నెక్ (వంద గుడ్లకు)** (రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 415-00 |
| రంగారెడ్డి | 415-00 |
| మెదక్ | 415-00 |
| కరీంనగర్ | 418-00 |
| వరంగల్ | 418-00 |
| రిటైల్ ప్రైస్ | 4-75 |

## రాష్ట్రంలో ఐఐఎల్ స్టెరైల్ ఫిల్లింగ్ స్టేషన్

### రూ.75 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ



భూమిపూజ చేస్తున్న ఐఐఎల్ ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ కేంద్రస్థానంగా బయోలాజికల్ సేవలు అందిస్తున్న ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్(ఐఐఎల్)..రంగారెడ్డి జిల్లాలోని జినోమీ వ్యాలీ ఫేస్-3లో ఏర్పాటు చేయతలపెట్టిన నూతన స్టెరైల్ ఫిల్లింగ్ యూనిట్‌కు సోమవారం భూమిపూజ చేసింది. రూ.75 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌తో యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) 'అభయ్‌రబ్' సామర్థ్యం మరింత పెరుగనున్నదని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. వచ్చే ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్న ఈ యూనిట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా నిర్మిస్తున్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కే ఆనంద్ కుమార్ తెలిపారు. ప్రజా ఆరోగ్యంలో వాక్సిన్ల పాత్ర కీలకమని, అందుబాటు ధరల్లో వాక్సిన్లను రూపొందించి ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు రాష్ర్టాల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో వీటి సామర్థ్యాన్ని మరింత పెంచాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం సంస్థకు తెలంగాణలో రెండు యూనిట్లు ఉండగా,, తమిళనాడు, మరోకటి న్యూజిలాండ్‌లో ఉన్నది.

## ఐదేండ్లలో 8,582కు చేరారు

### జాతీయ బ్యాంకుల్లో పెరిగిన ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు




**న్యూఢిల్లీ, జూన్ 24:** ఐదేండ్లలో జాతీయ బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు 60 శాతానికిపైగా పెరిగారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ఓ లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన ఐదేండ్ల కాలంలో విల్‌ఫుల్ డిఫాల్టర్ల సంఖ్య 8,582కు చేరిందని వివరించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 5,349గానే ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించే స్థోమత ఉన్నా.. ఇవ్వని సంస్థలు, వ్యక్తుల్ని ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా బ్యాంకర్లు ప్రకటిస్తున్నారని మంత్రి ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. బ్యాంక్ రుణ ఎగవేతదారుల సంఖ్య గడిచిన ఐదేండ్లలో పెరిగిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. 2014-15 నుంచి పెరుగుదల నిలకడగా ఉందన్నారు. 2015-16లో 6,575, 2016-17లో 7,079, 2017-18లో 7,535 విల్ డిఫాల్టర్లు నమోదైయ్యారని చెప్పారు. కాగా, ఈ ఐదేండ్లలో రూ.7,654 కోట్ల మొండి బకాయిలను బ్యాంకులు వసూలు చేసుకున్నాయని తెలిపారు. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, దివాలా చట్టం-2016, పరారీ ఆర్థిక నేరగాళ్ల చట్టం- 2018ను తీసుకొచ్చామని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ శాఖ, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 170-184/2019-20 తేది: 20.06.2019
PR రీజియన్, నిజామాబాద్‌లో 2 BHK గృహాల నిర్మాణం చేపట్టుటకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 4743.64 లక్షలు, టెండరు షెడ్యూళ్ళను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి 24.06.2019న ఉ. 10.30 గం॥ నుండి 01.07.2019న మ. 3.00 గం॥ వరకు అప్‌లోడ్ చేయవచ్చును. ఫోన్ నం. 08462-239502, తదుపరి వివరాలకు దర్శించండి. www.tender.telangana.gov.in
సం/- రీజినల్ ఆఫీసర్, PR రీజియన్, నిజామాబాద్
DIPR RO. No. 416-DP/CL/Advt/1/2019-20, Dt: 24/06/2019

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
టెండరు ప్రకటన: తేది: 20.06.2019
NIT Ref No. 1-3/SDF/18-19, 88/SDF/18-19 1వ పిలుపు, తేది: 31.08.18, 4/SDF/18-19, 172, 176 & 177/SDF/ 18-19 1వ పిలుపు, తేది: 10.10.18, 203,204,213,223& 228/SDF/18-19 1వ పిలుపు, తేది: 20.10.18, 5 & 6/SDF/ 17-18. పాలకుర్తి, వర్ధన్నపేట్ నియోజక వర్గాలలో BT రోడ్డు పనులు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం మొ॥న పనులు చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 383.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ మరియు ముగింపు తేది: 27.06.2019న రా. 9 గం॥ నుండి 04.07.2019న మ. 3.00 గం॥ వరకు. ఫోన్ నం: 0870-2578114. తదుపరి వివరాలకు: https://tender.telangana.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్
DIPR RO. No. 420-DP/CL/Advt/1/2019-20, Dt: 24/06/2019

తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ శాఖ, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
1) NIT No.EE/08/2019-2 & EE/11/2019-3 తేది: 10-06-2019
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మంచిర్యాల జిల్లాలో రూ.43 లక్షలతో 2 దేవాలయాల అభివృద్ధి కొరకు టెండర్లు కోరబడినవి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేదీలు: (దాఖలు): 26-06-2019 నుండి 04-07-2019 వరకు. 2) NIT No: EE/09/2019, తేది: 17-06-2019 (2-వ పిలుపు). ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో రూ.217 లక్షలతో 13 దేవాలయాల అభివృద్ధి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు (దాఖలు) తేది: 28-06-2019 నుండి 06-07-2019 వరకు. పూర్తి సమాచారం కోసం చూడండి: https://tender.telangana.gov.in
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, దేవాదాయ శాఖ, హైదరాబాద్.
DIPR RO No.422-DP/CL/Advt/1/2019-20, Dt: 24/6/19

తెలంగాణ ప్రభుత్వం
వైద్య విద్యా శాఖ
1) Rc. No. CS-1/16/Laboratory Chemicals/2019, టెండరు ప్రకటన తేది: 21-06-2019
టెండరు ప్రారంభ తేదీ నుండి ఒక సంవత్సర కాలానికి కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్‌కు లేబొరేటరీ కెమికల్స్, రీఏజెంట్స్ మరియు కిట్స్ మొ॥వి సరఫరా కొరకు ఆమోదిత డీలర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. 2) Rc. No. CS-1/SPL/2019, తేది: 21-06-2019, కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్‌లో వివిధ శాఖల యొక్క పాత ఉడెన్ & ఐరన్ స్క్రాప్ బహిరంగ వేలం కొరకు వివిధ ఆమోదిత సంస్థల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. **దరఖాస్తు ధర:** ప్రిన్సిపాల్, KMC, వరంగల్ పేరున DD ద్వారా రూ. 1,000/- (ఒక్కొక్కటి). **టెండరు దరఖాస్తు విక్రయం:** 28-06-2019 నుండి 08-07-2019, ఉ. 11.00 గం. నుండి సా. 4.00 గం. వరకు. **టెండరు స్వీకరణకు ఆఖరి తేది:** 10-07-2019, సా. 4.00 గం. వరకు. **టెండరు తెరచుట:** 11-07-2019, ఉ. 11.00 గం.కు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
DIPR RO.No. 425-DP/CL/ADVT/1/2019-20, Dt: 24-06-2019 సం/- ప్రిన్సిపాల్, KMC, వరంగల్

తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్
(రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
గ్రౌండ్ ఫ్లోర్: CRO కాంప్లెక్స్, S.P. రోడ్డు, సికింద్రాబాద్-500003. చీఫ్ రేషనింగ్ ఆఫీసర్::హైదరాబాద్
నెం.PDS/ HYD/ STAGE-II(5)/2019-20 తేది: 22.06.2019
ఇ-టెండరు ప్రకటన
2019-20 సంవత్సరానికి 15 నెలల కాలానికి, అనగా **జూలై'19 నుండి సెప్టెంబరు'20** వరకు రేటు కాంట్రాక్టు ప్రాతిపదికపై హైదరాబాద్ జిల్లాలో PDS క్రింద ఆహార ధాన్యాలు/నిత్యావసర సరుకులు స్టేజి-II క్రింద రవాణా చేయుటకు (అనగా MLS పాయింట్ల నుండి FD షాపులకు- సర్కిలు వారీగా) చేపట్టుటకు, హైదరాబాద్ జిల్లాలో MLS పాయింట్లు (సర్కిళ్ళు: I, II, III, IV, V, VI, VII, VIII & IX)/బఫర్ గోదాముల నుండి FP షాపులకు/ప్రభుత్వ పాఠశాలలు/ప్రభుత్వ సంస్థలకు) స్టేజి-II రవాణా చేయుటకు చేపట్టుటకు ఆసక్తి గల పార్టీల నుండి ఇ-టెండరు కోరడమైనది.
ఇ-టెండరు ప్రకటనను https://tender.telangana.in పై చూడవచ్చును.
**ఇ-టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 26-06-2019 (బుధవారం) మ. 12.30 గం. నుండి 04-07-2019 (గురువారం) మ. 01.30 గం.వరకు. **హార్డు కాపీలలో టెండరు డాక్యుమెంట్లు దాఖలుకు ముగింపు తేది:** 04-07-2019 (గురువారం) మ. 04.30 గం.లు. **సాంకేతిక బిడ్లు తెరుచుట:** 05-07-2019 (శుక్రవారం) ఉ. 11.00 గం.లకు మరియు **ఆర్థిక బిడ్లు తెరుచుట: 05-07-2019, మ. 3.30 గంటలకు.** దరఖాస్తు ఫీజు రూ. 10,000/-లను డిడి ద్వారా **"డిస్ట్రిక్ట్ మేనేజర్, TSCSCL హైదరాబాద్"** పేరున, హైదరాబాద్ వద్ద చెల్లించబడు విధముగా చెల్లించవలెను. (ఏదేని జాతీయ బ్యాంకు నుండి)
సం/- CRO & EOED, TSCSCL, హైదరాబాద్

TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD - 500 082
T.No.e-04/HPC&HP/TSGENCO/2019
Supply, Manufacture, Testing at manufacturer's works, Inspection, Packing, Supply and delivery of FRLS (Fire Retardant Low Smoke) PVC insulated, copper power and instrumentation cables and aluminium power cables for Pulichintala Hydro Electric Scheme, Suryapet District. Value of works: ₹ 23,00,000/-. Scheduled open and **Closing Date:19.06.2019 at 17:00 Hrs & 22.07.2019 at 14:00 Hrs.**
T.No.e-05/CE/O&M/KTPP/CHP-MM/2019-20
KTPP – Procurement of BEML/BERCO/ITM Make Track Link Assembly with Track Shoes for BD-155 Dozer & undercarriage set for BD-355 Dozer. Value of works: ₹ 37,50,000/-. Scheduled open and **Closing Date:13.06.2019 at 10:30 Hrs & 04.07.2019 at 17:30 Hrs.**
T.No.e-16/CE(C&C)/SE(C&C)/DE(C)/A1/2019-20
Transportation of 5000 MT of Coal Mill rejects from KTPP mill reject yard to Bhadradri Thermal Power Station, Manuguru, Bhadradri Kothagudem Dist by road for a period of one month. Scheduled open and **Closing Date:11.06.2019 at 17:00 Hrs & 02.07.2019 at 12:00 Hrs.**
For further details: "www.tsgenco.co.in & https://tender.telangana.gov.in"

# ఆర్బీఐకి విరాల్ గుడ్‌బై





### డిప్యూటీ గవర్నర్ హోదాకి రాజీనామా చేసిన ఫైర్‌బ్రాండ్

### రిజర్వ్ బ్యాంక్ స్వేచ్ఛ కోసం మోదీ సర్కారుతో వైరం

### ప్రభుత్వ వైఖరి నచ్చకనే గతంలో తప్పుకున్న ఊర్జిత్ పటేల్

**న్యూఢిల్లీ, జూన్ 24:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ హోదాకి విరాల్ ఆచార్య గుడ్‌బై చెప్పారు. మూడేండ్ల పదవీ కాలం ముగియడానికి మరో ఆరు నెలల సమయమే ఉన్న క్రమంలో విరాల్ రాజీనామా ప్రాధాన్యతను సంతరించుకున్నది. తప్పించుకోలేని వ్యక్తిగత కారణాలతోనే తప్పుకుంటున్నానని, వచ్చే నెల 23ను మించి పనిచేయలేనని ఆర్బీఐకి విరాల్ తెలిపారు. ఈ మేరకు గత కొద్ది వారాల కిందటే విరాల్ ఓ లేఖను ఇచ్చారని సోమవారం ఆర్బీఐ సంక్షిప్త ప్రకటనలో తెలియజేసింది. కాగా, విరాల్ రాజీనామాతో గడిచిన ఏడు నెలల్లో ఆర్బీఐ నుంచి ఇద్దరు ఉన్నతస్థాయి వ్యక్తులు వెళ్లినట్లైంది. గతేడాది డిసెంబర్‌లో ఆర్బీఐ గవర్నర్ హోదాకు ఊర్జిత్ పటేల్ అనూహ్య రీతిలో బైబై చెప్పిన సంగతి విదితమే. నాడు పటేల్‌కు సైతం తన మూడేండ్ల పదవీ కాలం ముగియడానికి దాదాపు ఇంకో 9 నెలల సమయం ఉన్నది. ఇప్పుడు విరాల్ కూడా ఆరు నెలల ముందే పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. నిజానికి పటేల్ రాజీనామా చేసిన మరుసటి రోజు నుంచే విరాల్ రాజీనామాపైనా పెద్ద ఎత్తున ఊహాగానాలు మొదలైయ్యాయి.

#### చివరి సమీక్షలో భిన్నాభిప్రాయాలు

ఈ నెలలో జరిగిన ద్రవ్య సమీక్షలో ద్రవ్యలోటుపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య అభిప్రాయాలు భిన్నంగా ఉండటం గమనార్హం. దాస్ ఆశాభావం వ్యక్తం చేయగా.. విరాల్ మాత్రం ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం తీరును దాస్ సమర్థించగా.. విరాల్ వ్యతిరేకించారు.

#### ఆర్బీఐ స్వతంత్రత కోసం పోరు

రిజర్వ్ బ్యాంక్ స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తిని బలంగా కోరుకున్న విరాల్ ఆచార్య.. ఈ విషయంలో కేంద్రంతో సైతం పోరాటాన్ని జరిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ తీరును బహిరంగంగానే విమర్శించి విరాల్ వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ఆర్థిక ప్రగతి, సుస్థిరతల కోసం ఆర్బీఐ స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తి చాలా అవసరమని విరాల్ గట్టిగా విశ్వసించారు. ఈ క్రమంలోనే ఆర్బీఐ స్వాతంత్ర్యాన్ని హరించేలా ప్రభుత్వం ఏవైనా చర్యలకు దిగితే మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లు కుప్పకూలడం ఖాయమనీ హెచ్చరించారు.

#### కేంద్రంతో విభేదాలు

సున్నితమైన ఆర్బీఐ స్వేచ్ఛ అంశంపై బహిరంగంగా మాట్లాడటం.. ప్రభుత్వంతో విరాల్‌కు వైరాన్ని తెచ్చిపెట్టింది. ఆర్బీఐ మిగులు నగదు నిల్వలపై ఆర్థిక మంత్రిత్వ శాఖతో ఊర్జిత్ పటేల్ పోరుకు విరాల్ మద్దతుగా ఉండటం మోదీ సర్కారుకు మింగుడు పడలేదు. ఈ క్రమంలోనే ఒకానొక దశలో పటేల్ తర్వాత ఆర్బీఐ గవర్నర్ రేసులో ఉన్న విరాల్.. డిప్యూటీ హోదాకే పరిమితం కావాల్సి వచ్చిందన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఈ క్రమంలోనే ఊర్జిత్ రాజీనామా తర్వాత వెంటనే విరాల్ వెళ్లిపోవడం.. ఎన్నికల వేళ ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తుందన్న కారణంతో ఆగిన కేంద్రం.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సాగనంపుతోందన్న విమర్శలూ వస్తున్నాయి.

#### మార్కెట్లపై ప్రభావం చూపదు

విరాల్ రాజీనామాలో ఆశ్చర్యం ఏమీ లేదని, ఇది మార్కెట్లను ప్రభావితం చేయబోదని ఎస్బీఐ నివేదిక అభిప్రాయపడింది. ఊర్జిత్ రాజీనామా దగ్గర్నుంచి విరాల్ రాజీనామాపై ఊహాగానాలున్నాయని, కాబట్టి ఆయన రాజీనామా పెద్దగా ఆశ్చర్యపరిచేదేమీ కాదని తాజా రిసెర్చ్ రిపోర్టులో ఎస్‌బీఐ పేర్కొన్నది. జపాన్ బ్రోకరేజీ దిగ్గజం నొమురా సైతం ఇలాగే వ్యాఖ్యానించింది.

#### మిగిలింది ముగ్గురే

విరాల్ రాజీనామాతో ఆర్బీఐలో ఇక మిగులుతున్నది ముగ్గురు డిప్యూటీ గవర్నర్లే. ఎన్‌ఎస్ విశ్వనాథన్, బీపీ కనుంగో, ఎంకే జైన్‌లు ఉంటున్నారు. విరాల్ ఆచార్య.. న్యూయార్క్ యూనివర్సిటీ-స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎకనామిక్స్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2016 డిసెంబర్‌లో ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎంపికయ్యారు. 2017 జనవరిలో ఆర్బీఐలోకి వచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ.. విరాల్‌ను ఎంపిక చేసింది. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎన్నికైన అత్యంత పిన్న వయస్కుడు విరాలే కావడం విశేషం. అంతేగాక ఆరుగురు సభ్యులు కలిగిన ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీలో ఉన్న ఏకైక డిప్యూటీ గవర్నర్ విరాలే. కీలక వడ్డీరేట్ల నిర్ణయంలో ఈ కమిటీదే తుది నిర్ణయమన్న విషయం తెలిసిందే. కాగా, 45 ఏండ్ల విరాల్ రాజీనామాకు కమిటీ ఆమోదం కూడా కావాల్సి ఉన్నది.

#### ఆధిపత్య ధోరణికి నిరసనగానే: కాంగ్రెస్

ఆర్థికపరమైన కార్యకలాపాల్లో ప్రభుత్వ ఆధిపత్య ధోరణికి నిరసనగానే ఆర్బీఐలో రాజీనామాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఆర్బీఐలో మోదీ సర్కారు జోక్యం మితిమీరుతున్నదనడానికి విరాల్ రాజీనామాను ఓ ఉదాహరణగా ఆ పార్టీ అభివర్ణించింది. ఇంకా ఆరు నెలల పదవీ కాలం ఉన్నా.. విరాల్ ఆచార్య రాజీనామా చేయడం ఆశ్చర్యకరమని ఆ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా అన్నారు. మోదీ సర్కారు తీరు నచ్చక ఇద్దరు ఆర్బీఐ గవర్నర్లు, నలుగురు ఆర్థిక సలహాదారులు, ఓ నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు ఇప్పటికే రాజీనామా చేశారని ట్విట్టర్ వేదికగా గుర్తుచేశారు. ఆర్బీఐ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, స్వయం ప్రతిపత్తి కోసం విరాల్.. ప్రస్తుత బీజేపీ సర్కారుతో ధైర్యంగా పోరాడారని ప్రశంసించారు.

## పదింటిలో ఎనిమిది మారుతివే..

### ప్యాసింజర్ వాహన విక్రయాల్లో కంపెనీ దూకుడు




**న్యూఢిల్లీ, జూన్ 24:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ దూకుడు కొనసాగుతున్నది. గడిచిన నెలలో దేశవ్యాప్తంగా అమ్ముడైన తొలి పది ప్యాసింజర్ వాహనాల్లో మారుతికి చెందిన ఎనిమిదింటికి చోటు లభించగా, మిగతా రెండు హ్యుందాయ్ మోటార్‌కు చెందినవి. మే నెలలో వాహన అమ్మకాలు భారీగా పడిపోయినప్పటికీ మారుతి హవా కొనసాగడం విశేషం. మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన కంపెనీకి చెందిన స్విఫ్ట్ ఈసారి తొలిస్థానాన్ని దక్కించుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 19,208 యూనిట్లు విక్రయించి నాలుగో స్థానంలో నిలిచిన స్విఫ్ట్ ఈసారికిగాను 17,039లతో ఈ స్థానం లభించిందని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. గడిచిన కొన్ని నెలలుగా తొలి స్థానంలో ఉన్న ఎంట్రిలెవల్ కారైన ఆల్టో ఈసారి 16,394లతో రెండోస్థానానికి పడిపోయింది. మారుతికి చెందిన కాంప్యాక్ట్ సెడాన్ డిజైర్ 16,196 యూనిట్లతో ఆ తర్వాతి స్థానంలో నిలువగా, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోకు నాలుగో స్థానం వరించింది. 2018 మేలో మూడో స్థానంలో ఉన్న బాలెనో ఈసారి 15,176 యూనిట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. నూతన వ్యాగన్‌ఆర్ 14,561 యూనిట్లు అమ్ముడై తిరిగి ఐదోస్థానం లభించింది. టాప్-10 జాబితాలో మారుతికి చెందిన యుటిలిటీ వ్యాన్ ఈకో తొలిసారిగా స్థానం సంపాదించుకున్నది. గత నెలలో 11,739 యూనిట్లు అమ్ముడై ఆరోస్థానంలో నిలిచినట్లు సియామ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటితో పాటు హ్యుందాయ్ మోటార్‌కు చెందిన ఎస్‌యూవీ క్రెటా 9,054 యూనిట్లతో తిరిగి ఏడో స్థానం దక్కించుకోగా, కంపెనీకి చెందిన మరో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20కి ఎనిమిదో స్థానం లభించింది. అలాగే మారుతికి చెందిన మల్టీ-పర్పస్ వాహనమైన ఎర్టిగాకు తొమ్మిదో స్థానం(8,864 యూనిట్లు), విటారా బ్రెజ్జా(8,781 యూనిట్లు) వరుసగా స్థానాలు దక్కించుకున్నాయి. గత నెలలో ప్యాసింజర్ వాహన విక్రయాలు 18 ఏండ్ల కనిష్ఠ స్థాయి 2,39,347 యూనిట్లకు పడిపోయాయి.

## అదంత సులువు కాదు

### 2025కల్లా 100% ఎలక్ట్రిక్ టూ వీలర్, త్రీ వీలర్ల వినియోగం అసాధ్యం

### నీతి ఆయోగ్ లక్ష్యంపై హీరో, బజాజ్ ఆటో, టీవీఎస్‌లు



**న్యూఢిల్లీ, జూన్ 24:** వంద శాతం విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగంపై నీతి ఆయోగ్ నిర్దేశించుకున్న లక్ష్యాలతో ప్రముఖ ఆటో రంగ సంస్థలు గట్టిగా విభేదించాయి. ఇప్పుడున్న పెట్రో ఆధారిత వాహనాల స్థానంలో విద్యుత్ ఆధారిత వాహనాలను కేవలం ఆరేండ్లలో వాడుకలోకి తీసుకురావడం సాధ్యం కాదని హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్ మోటర్ కో అన్నాయి. 'ఇదేమీ 'ఆధార్'లా కాదు.. సాఫ్ట్‌వేర్ అంతకన్నా కాదు.. వెంటనే ప్రింట్ కార్డులు రావు' అని టీవీఎస్ మోటార్ కో చైర్మన్, ఎండీ వేణు శ్రీనివాసన్ పీటీఐతో వ్యాఖ్యానించారు. ఆటో రంగ సంస్థలన్నీ ఇందుకు సమాయత్తం కావాలని, విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగానికి వీలైన పరిస్థితులను కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచగలుగాలని చెప్పారు. 2023కల్లా 150సీసీ వరకున్న టూవీలర్ల వినియోగంపై నిషేధం విధించాలన్న నీతి ఆయోగ్ సిఫార్సును హీరో మోటోకార్ప్ ఖండించింది. 2025 నాటికి త్రీవీలర్లపైనా వేటు వేయాలన్న ప్రతిపాదనకు బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని పరిశ్రమకు హాని తలపెట్టేదిగా అభివర్ణించారు. గత వారం భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘాన్ని (సియామ్) ఈ అంశంపై రెండు వారాల్లోగా తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ నీతి ఆయోగ్ కోరిన విషయం తెలిసిందే. ప్రమాదకర స్థాయికి చేరిన వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి, పెరుగుతున్న పెట్రో దిగుమతుల భారాన్ని తగ్గించడానికి విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని పెంచాలని కేంద్రం భావిస్తున్న విషయం తెలిసిందే.

## డెవలపర్లతో వివాదానికి సత్వర పరిష్కారం

### వచ్చే నెల 1న పరిష్కార కేంద్రం ప్రారంభం.. కొమ్ము విద్యాధర్ నేతృత్వంలో కొత్త ఫోరం ఏర్పాటు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కష్టార్జితంతో ఇల్లు కొనుగోలు చేశాక డెవలపర్లతో సమస్యలు ఎదురవుతున్నాయా! సకాలంలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా బిల్డర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారా! అయితే ఇలాంటి వివాదాల్ని పరిష్కరించేందుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ప్రత్యేకంగా వివాదాల పరిష్కార కేంద్రాన్ని (తెలంగాణ రాష్ట్ర కౌన్సిలేషన్ అండ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఫోరం) ఏర్పాటు చేస్తున్నది. 2019 జూలై 1 నుంచి కార్యకలాపాల్ని ప్రారంభించే ఈ ఫోరానికి ప్రస్తుత రెరా అథారిటీ మెంబర్ సెక్రటరీ కొమ్ము విద్యాధర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇందులో నిర్మాణ, నివాసితుల సంఘాల నుంచి కొందరు సభ్యులుగా ఉండనున్నారు. బిల్డర్ల తరఫున వివాదాల్ని పరిష్కరించేందుకు క్రెడాయ్ హైదరాబాద్, క్రెడాయ్ తెలంగాణ, ట్రెడా, టీబీఎఫ్ వంటి సంఘాల నుంచి ఐదు లేదా ఆరుగురు సభ్యులను రెరా అథారిటీ ఎంపిక చేస్తుంది. నివాసితుల సంఘాల నుంచి అంతే సంఖ్యలో సభ్యులుంటారు.

#### ఏడు రోజుల్లో హాజరుకావాల్సిందే..

కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే.. ఏడు రోజుల్లోపు ఈ ఫోరం ముందు హాజరు కావాలని సదరు డెవలపర్‌ని ఫోరం ఆదేశిస్తుంది. అదే సమయంలో డెవలపర్ల తరఫున ఒకరు, మరోవైపు కొనుగోలుదారుల తరఫున మరొకరు వాదించనున్నారు. ఇరువురి వాదనలను విన్న ఫోరం చైర్మన్ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు. ఇలా, ఒక్కో వివాదాన్ని గరిష్ఠంగా 30 రోజుల్లోపు పరిష్కరించే అవకాశముంటుంది. అంతకంటే ముందే అధిక శాతం వివాదాలు పరిష్కారం అవ్వడానికి ఆస్కారమున్నది. నేటికీ మహారాష్ట్రలో బిల్డర్లు, కొనుగోలుదారుల వివాదాల్లో అధిక శాతం ఫోరం వద్ద పరిష్కారం అవుతుండటం గమనార్హం. అందుకే ఈ విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని రెరా అథారిటీ తాజాగా నిర్ణయం తీసుకున్నది. 'గతంలో ఇలాంటి పరిష్కార కేంద్రం లేకపోవడం వల్ల ఇండ్ల కొనుగోలుదారులకు న్యాయం జరగడానికి చాలా సమయం పట్టేది. ఇక నుంచి తెలంగాణ రాష్ట్రంలో సొంతిల్లు కొనేవారికి ఎలాంటి ఇబ్బందులుండవని, డెవలపర్లతో ఎలాంటి సమస్యలొచ్చినా తక్షణమే పరిష్కారం లభిస్తుంద''ని తెలంగాణ రెరా అథారిటీ చైర్మన్ రాజేశ్వర్ తివారీ తెలిపారు.

#### ఫోరం తీర్పు నచ్చకపోతే?

ఒకవేళ, డెవలపర్‌కు కానీ కొనుగోలుదారుడికి కానీ ఫోరం ఇచ్చే తీర్పు నచ్చకపోతే, తక్షణమే రెరా అథారిటీకి అప్పీలు చేసుకునే సౌలభ్యముంది. ఇందులో పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి, సాంకేతిక విషయాల్లో అనుభవమున్న అధికారి సభ్యులుగా ఉంటారు. దీనికి రెరా అథారిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఒకవేళ, అప్పటికీ ఇరువురిలో ఏ ఒక్కరికీ తీర్పు నచ్చకున్నా.. తెలంగాణ రెరా ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రస్తుతం మనరాష్ట్రంలో వ్యాట్ అప్పిలేట్ అథారిటీ రెరా ట్రిబ్యునల్ అథారిటీగా వ్యవహరిస్తుంది.

## స్విస్ సంస్థతో వీ హబ్ భాగస్వామ్యం



రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హగ్, దీప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధునిక ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర అంశాల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన సెరీ (సెక్రటేరియట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్) సంస్థ, తెలంగాణకు చెందిన 'వీ హబ్' (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్)లు కలిసికట్టుగా పని చేయడానికి అంగీకరించాయి. ఈ మేరకు రెండింటి మధ్య సోమవారం ఒప్పందం కుదిరింది. దీంతో స్విట్జర్లాండ్ విద్య, అధ్యయన, ఆధునిక ఆవిష్కరణ సంస్థలు వీ హబ్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోనున్నాయి. ముఖ్యం గా ఈ రెండింటి కలయిక వల్ల తెలంగాణ స్టార్టప్‌లు, విద్యా సంస్థలు స్విస్ సంస్థలతో కలిసి పని చేసేందుకు అవకాశం ఏర్పడింది. కాగా, తొలుత బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ వంటి వాటి మీద ఇవి అధిక ఆసక్తిని చూపించే వీలున్నది. ఈ సందర్భంగా వీ హబ్ సీఈవో దీప్తి రావుల మాట్లాడుతూ 'స్విస్‌నెక్స్ ఇండియాతో కలిసికట్టుగా పని చేయడాన్ని స్వాగతిస్తున్నాం. ఇప్పటికే పలు సమావేశాలు, స్టార్టప్ సెమినార్లు వంటివి నిర్వహించాం. స్విస్‌నెక్స్‌తో వీ హబ్ భాగస్వామ్యం అతిపెద్ద ప్రభావం చూపిస్తుంది' అన్నారు. తమ కార్యకలాపాలు వీ హబ్ భాగస్వామ్యంతో తెలంగాణ మొత్తం వ్యాపించడానికి అవకాశముందని స్విస్‌నెక్స్ ఇండియా సీఈవో సెబాస్టియన్ హగ్ అన్నారు.

## రూ.2 వేల కోట్ల సేకరణలో ఆంధ్రాబ్యాంక్

**న్యూఢిల్లీ, జూన్ 24:** హైదరాబాద్ కేంద్రస్థానంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థయైన ఆంధ్రాబ్యాంక్ రూ.2 వేల కోట్ల నిధుల సేకరణకు బ్యాంక్ బోర్డు ఏకగ్రీవంగా అనుమతినిచ్చింది. ఈ నిధులను క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ లేదా పబ్లిక్ ఆఫర్ లేదా నాన్-కోర్ అసెట్ లేదా ప్రిఫరెన్షనల్ అలాట్‌మెంట్ షేర్లను విక్రయించడం ద్వారా సేకరించాలనుకుంటున్నది. ఈ ప్రతిపాదనకు సంబంధించి సోమవారం సమావేశమైన బ్యాంక్ బోర్డు అనుమతినిచ్చినట్లు బీఎస్‌ఈకి సంస్థ సమాచారం అందించింది.




# రేడియో నాటక ప్రయోక్త శ్యామలాదేవి మృతి


ఆకాశవాణి విశ్రాంత నాటక ప్రయోక్త శ్యామలాదేవి (ఫైల్ ఫొటో)

**తెలుగు యూనివర్సిటీ:** ఆకాశవాణి విశ్రాంత నాటక ప్రయోక్త, స్వాతంత్ర్య సమరయోధురాలు, కాంగ్రెస్‌నేత భోగరాజు పట్టాభి సీతారామయ్య మనుమరాలు ఎంజీ శ్యామలాదేవి(88) సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మరణించారు. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన శ్యామలాదేవి ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో, అనంతరం 1960 నుంచి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలోనూ సేవలందించారు. కన్యాశుల్కం నాటకంలో బుచ్చమ్మగా నటించి శ్రోతలను ఆకట్టుకున్నారు. ఉదరనిమిత్తం, బహుకృతవేషం నాటకాల్లో శ్యామలాదేవి మంచి పాత్రలు పోషించారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసే ఉదయ తరంగణి కార్యక్రమంలో అమ్మపాత్ర ఎంతో ప్రాచుర్యం పొందింది. శ్యామలాదేవి మచిలీపట్నంలో స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆమెకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.




## విహారి పుస్తకం ఆవిష్కరణ


సచివాలయంలో విహారి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని పర్యాటక స్థలాలను గురించి వివరించేలా నితిన్ విహారి రచించిన 'విహారి' పుస్తకాన్ని పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఏ సీజన్‌లో ఎలాంటి ప్రదేశాలకు వెళ్లాలో, అక్కడి వసతులు, హోటల్స్, టూరిస్టు ప్రాంతాలు తదితర పూర్తి సమాచారం ఈ పుస్తకంలో ఉందని చెప్పారు. పర్యాటక ప్రాంతాల గురించి కండ్లకుకట్టినట్టు నితిన్ రచనలు ఉంటాయని కొనియాడారు.

'స్వర్ణ' సాహితీ పురస్కారానికి

## ఎంట్రీల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు కవులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో ఏటా ఉత్తమ కవితలను ఎంపికచేసి ఘంటసాల సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో స్వర్ణసాహితీ పురస్కారం అందజేస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన తల్లిదండ్రులు స్వర్ణ నరసింహం, సుబ్బమ్మ పేరిట ఏటా ఏపీ ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండలో ఈ పురస్కారాలను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉత్తమ కవితా పురస్కారం కింద రూ.10 వేల నగదు, జ్ఞాపిక అందజేస్తామని.. ఈ ఏడాది పద్యకవితా సంపుటాల నుంచి పురస్కార గ్రహీతను ఎంపికచేస్తామన్నారు. రెండు తెలుగు రాష్టాలకు చెందిన కవులు, రచయితలు తమ కవితలను జూలై 31లోగా పంపాలని, పూర్తి వివరాలకు 9705188974 నంబర్లో సంప్రదించాలని సూచించారు.






నమస్తే తెలంగాణ

జిందగీ

మంగళవారం 25 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## ఆయుష్షు పెంచే బెండ



- బెండలో పుష్కలంగా లభించే పీచు పదార్థం రక్తంలోని చక్కెర నిల్వల స్థాయిలను నియంత్రించి వాటిని క్రమబద్ధీకరిస్తుంది. అందుకే మధుమేహ రోగులు ఏమాత్రం సంశయించకుండా దీన్ని తినొచ్చు. క్లోమంలోని బీటా కణాలను ఉత్పత్తి చేసి ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచేలా చూసేందుకు బెండకాయ పనిచేస్తుంది.
- బెండకాయలో ఉండే పీచు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, గుండె జబ్బులు రాకుండా చూసే శక్తి ఉంది. రోజూ బెండ తింటే అందులోని పాలిఫినాల్స్ యాంటీ ఆక్సిడెంట్లలాగా పనిచేసి గుండె రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను నివారిస్తుంది.
- రోజులో శరీరానికి అవసరమైనంత విటమిన్ సి బెండకాయ తింటే లభిస్తుంది. విటమిన్ సి కారణంగా వ్యాధి నిరోధక శక్తి పెరిగి పలు రకాల ఇన్‌ఫెక్షన్‌లు, రోగాలు దరిచేరవు. అధిక బరువుకు చెక్ పెట్టేందుకు కూడా ఇది బాగా పనిచేస్తుంది.
- హానిచేసే ఫ్రీరాడికల్స్‌ను నాశనం చేసి వాటి బారి నుంచి కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలు రాకుండా బెండకాయ కీలకపాత్ర పోషిస్తుంది. ఇందులో అత్యధిక మొత్తంలో ఉండే యాంటీఆక్సిడెంట్లే దీనికి ప్రధాన కారణం. బెండకాయలో పుష్కలంగా లభించే పీచు కారణంగా కొలొరెక్టల్ కేన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది.
- చిన్న పిల్లల్లో పుట్టుకతో వచ్చే మెదడు సంబంధిత సమస్యలకు బెండకాయ మంచి మందులాగా పనిచేస్తుంది. బెండలోని ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బీ9 వంటివి మెదడు నరాలకు బలాన్నిస్తాయి. బెండలోని ఫోలేట్, విటమిన్ బీ9 అనే విటమిన్లు మెదడు పని తీరును మెరుగు పరిచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి.



**పెయింటింగ్.. మట్టి బొమ్మలు.. డ్రాయింగ్.. ఇలా తీరొక్క కళల గురించి అందరికీ తెలుసు.. కానీ కిల్‌కారి ఆర్ట్ గురించి మీరు ఎక్కువగా విని ఉండరు.. ప్రతీ ఒక్కరికీ ఒక ఊహ ఉంటుంది.. మీరు మనసులో అనుకున్న రూపాన్ని.. బొమ్మ మాదిరిగా తీర్చిదిద్దడమే ఈ కళ. ఎప్పటికైనా ఒక ఆర్టిస్ట్‌గా నిలదొక్కుకోవాలని అనుకునే వాళ్లకు.. శ్రీముఖి గైడెన్స్ ఇచ్చి కళను బతికిస్తున్నది.. వర్క్‌షాపులు నిర్వహించి ఎందరినో ఆర్టిస్టులుగా తీర్చిదిద్దుతున్నది..**





# కిల్‌కారి.. ఊహల కళలకారి!

చిన్నతనంలో బొమ్మలు తయారు చేయాలనుకుంటారు. వద్దులే అని సరిపెట్టుకుంటారు. వయసు పెరిగే కొద్ది డ్రాయింగ్ నేర్చుకుందాం అనుకుంటారు. అన్ని రంగులు కొని ప్రాక్టీస్ మొదలెడుతారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా అనుకున్న విధంగా అయితే రాదు. సహనం నశిస్తుంది. దాన్ని కూడా పక్కన పడేస్తారు. బయట ప్రదేశాలు చూడ్డానికి వెళ్లినప్పుడు మట్టిబొమ్మలు, శిల్పాలను చూసినప్పుడు వీటిని ఇంత అందంగా తీర్చిదిద్దిన కళాకారుడికి సలాం అంటూ మనసులో అనుకుంటాం. ఎప్పటికైనా ఒక్క బొమ్మనైనా తయారు చేయాలనుకుంటాం. వాటికి ఏమి కావాలో ఎలా చేయాలో తెలియక తికమక పడుతాం. చిన్నప్పట్నుంచి కన్న కలల్ని కలలుగా వదిలేయకుండా ఊహించుకున్న అందాలను కళా రూపంలోకి తీర్చిదిద్దాలనుకునే వారు శ్రీముఖి నిర్వహిస్తున్న 'కిల్‌కారి' వర్క్‌షాప్‌లో పాల్గొంటే చాలు.. మీ ఊహల్ని చిత్రీకరించుకోవచ్చు.

**నయా ట్రెండ్..**

శ్రీముఖి హైదరాబాద్ అమ్మాయి. ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోనే చదువుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్ ఆర్ట్ కాలేజ్‌లో ఆర్ట్ కోర్సు చేసింది. యేడాదికి రెండు, మూడుసార్లయినా హైదరాబాద్‌కు వచ్చేది. అలా వచ్చిన ప్రతిసారీ తను నేర్చుకున్న ఆర్ట్స్‌ని తెలంగాణాకు పరిచయం చేయాలనుకుంటుండేది. శ్రీముఖి తండ్రి చేసేది బిజినెస్ అయినా ఆమెకు మాత్రం ఆర్ట్స్‌పై మమకారం ఎక్కువ. కూతురు కావాలన్నది ఏనాడు వద్దనేవాడు కాదు తండ్రి. శ్రీముఖిని ప్రోత్సహిస్తుంటాడు. ఆర్ట్స్ కోర్స్ పూర్తి అయింది. ఆమెకు ఆర్ట్స్‌తో పాటు చిన్నతనం నుంచి డిజైనింగ్ కూడా ఇష్టం. శ్రీముఖి ఆర్టిస్ట్‌గానే కాకుండా స్టైలిస్ట్‌గా కూడా రాణించాలనుకున్నది. తెలంగాణా ప్రజలకు ఆమె నేర్చుకున్న కళల్ని ఎలా తెలియజేయాలో అర్థం కాలేదు. ఫ్రెండ్స్‌తో తన భావాలను పంచుకున్నది. వీటికి వర్క్‌షాప్ కరెక్ట్ అని వారు సలహా ఇచ్చారు. శ్రీముఖికి కూడా వాళ్ల మాటలు నచ్చాయి. వర్క్‌షాప్‌కు 'కిల్‌కారి' అని పేరు చెప్పింది ఒక ఫ్రెండ్. నచ్చి తన వర్క్‌షాప్‌లకు ఆ పేరు పెట్టింది. 'కిల్‌కారి' అంటే పిచ్చుకలు చేసే శబ్దం అని అర్థం.

**వారం రోజులు పాటు..**

యేడాది క్రితం బంజారాహిల్స్‌లోని లమాకాన్‌లో వర్క్‌షాప్ నిర్వహించడానికి అన్నీ సిద్ధం చేసుకున్నది శ్రీముఖి. మరి ప్రజలకు సమాచారాన్ని ఎలా అందజేయాలి. అందుకు సోషల్ మీడియాని వేదికగా మార్చుకున్నది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో కిల్‌కారి పేరుతో పేజీ క్రియేట్ చేసింది. వర్క్‌షాప్ సమాచారం కూడా పోస్ట్ చేసింది. మొదటి వర్క్‌షాప్ అయినా చాలామంది హాజరయ్యారు. పిల్లలు పెద్దలు చాలామంది మార్కెట్లో దొరికే ఫేస్‌మాస్క్‌ల్ని ఇష్టపడుతుంటారు. మొదటి ఆర్ట్‌గా శ్రీముఖి ఫేస్ మాస్క్ తయారీ గురించి వివరించింది. పీఓపీ బ్యాండేజ్‌ని ముఖం మీద పెట్టి స్టిక్కర్‌తో అంటించి వాటికి రంగులు అద్దితే అచ్చు వారిని చూసుకున్న ఫీలింగ్ వస్తుంది. ఎవరు తయారు చేసుకున్న ఫేస్‌మాస్క్‌లు వారితోనే ఇంటికి తీసుకొని వెళ్లచ్చు. ఫేస్‌మాస్క్‌లకు కావాల్సిన మెటీరియల్ శ్రీముఖి అందిస్తుంది. మెటీరియల్ ఖర్చు వారిదే. ఇలా మొదటి వర్క్‌షాప్ విజయవంతంగా జరిగింది. ఫేస్‌మాస్క్ ఒకటే కాదు. కావాల్సిన ఆకారాన్ని ఆర్ట్ రూపంలో తీసుకొస్తుందామె. కిల్‌కారితో శ్రీముఖి చాలామంది దృష్టిలో పడింది. ఆమెను కాంటాక్ట్ అవ్వడం మొదలుపెట్టారు. ఒక్కొక్కరికి ఒక్కో ఐడియా ఉంటుంది. అదే ఐడియా కావాలనుకునే వారందరికీ కలిపి వర్క్‌షాప్ కండక్ట్ చేస్తుంటుంది. మెటల్ ఎంబోసింగ్ ఆర్ట్ కావాలని చాలామంది అడగడంతో ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించింది.

**స్టైలిస్ట్‌గానూ రాణిస్తున్నది..**

శ్రీముఖి నిర్వహించిన వర్క్‌షాప్‌కు 200 మంది హాజరయ్యారు. మెటల్ ఎంబోసింగ్‌కు కావాల్సిన మెటీరియల్ తీసుకున్నారు. వీటి ఖర్చు రూ. 500 నుంచి రూ. 2500 వరకు ఉంటుంది. ముగ్గురిని ఒక టీంగా తయారు చేసి స్టెప్ బై స్టెప్ ఎలా చేయాలో చెబుతుంది శ్రీముఖి. ఇది ఒక్క రోజులో అయిపోయేది కాదు. కనీసం ఐదు రోజులు పడుతుంది. పని పూర్తి కాగానే ఎవరి ఆర్ట్ వారు చేతిలో పట్టుకొని ఫొటోలు తీసుకుంటుంది శ్రీముఖి. వీటిని గుర్తుగా ఆల్బమ్‌లో దాచుకుంటున్నది. సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద, హీరోయిన్ అనుపమకు డిజైనర్, స్టైలిస్ట్‌గా చేస్తున్నది శ్రీముఖి. షాపింగ్‌మాల్స్‌లో దొరికే చీరలు కొనకుండా సిద్దిపేటలో చీరలు తయారు చేసే నేతన్నల దగ్గరకు వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నది. తెలంగాణలో వైభవంగా జరుపుకొనే బతుకమ్మ చీరలు, గొల్లబామ చీరల్ని ప్రత్యేకంగా డిజైన్ చేపించుకుంటూ హ్యాండ్‌లూమ్స్‌ని ప్రోత్సహిస్తున్నది.

### స్టూడియో స్పేస్..

నెలకు చాలా ప్రదేశాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాం. ఇలా పలు చోట్ల కాకుండా ఒకే చోట నిర్వహిస్తే బాగుంటుంది. అప్పుడే దీనికంటూ ఓ గుర్తింపు, ప్రత్యేకత ఉంటుంది. వర్క్‌షాప్ కోసం త్వరలో ఒక స్టూడియో స్పేస్ తెరువాలనుకుంటున్నాను. అందుకు కావాల్సిన పనులన్నీ జరుగుతున్నాయి. ఇది గనుక సక్సెస్ అయితే వర్క్‌షాపులు కాకుండా ఆర్ట్ కోర్సు కూడా ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నాను. ఆర్ట్స్ పనిలో పడి డిజైనింగ్‌ను మర్చిపోను. ఆర్ట్స్ నా ప్రొఫెషన్ అయితే స్టైలిస్ట్ నా ప్యాషన్. రెండూ నా కళ్లలాంటివి. దేన్నీ వదులుకోను. రెండింటినీ బ్యాలెన్స్ చూసుకుంటూ ముందుకు వెళ్తాను. నాకు ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి మా నాన్న ఉన్నాడు. ఆదరించడానికి అమ్మ, భరోసా ఇవ్వడానికి చెల్లి ఉన్నది. ఇంతమంది ప్రోత్సాహంతో ముందుకు నడుస్తున్న. డిజైన్ వర్క్‌షాప్ మీద ఈ నెల 29, జూలై 13/14న (కలర్స్, మ్యాచింగ్, మిక్సింగ్ అండ్ మ్యాచింగ్), జూలై 20/21న డిజైనింగ్ మీద వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను.

**మిగతా వివరాల కోసం :**

https://www.facebook.com/kilkaari.theartco/,
https://www.instagram.com/kilkaari.theartco/ని సంప్రదించొచ్చు.



...వనజ వనిపెంట

చిన్న యాదగిరి గౌడ్

## యూనివర్సిటీ నుంచి పరిశోధనా కేంద్రానికి!



**ఇంటికే పరిమితమైన మహిళల్ని పరిశోధనల్లో భాగస్వాములుగా చేయాలనుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రంగా పేరున్న సీఈఆర్‌ఎన్ మహిళలను ఎంపిక చేస్తున్నది. యూనివర్సిటీ నుంచి ఆమె ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉన్నది.**

పంజాబ్ యూనివర్సిటీకి చెందిన మంజిత్ కౌర్ శాస్త్రీయ పరిశోధనకు మహిళల్ని ప్రోత్సహిస్తున్నది. సైన్స్, గణితం, సాంకేతిక పరిజ్ఞానానికి మహిళల కంటే పురుషులనే ఎంపిక చేసుకుంటున్నారు. అంతేకాకుండా పరిశోధనా కేంద్రాల్లో 14 శాతం మాత్రమే మహిళలు ఉన్నట్లు పరిశోధనలో తేలింది. మంజిత్ కౌర్ 1970లో పంజాబ్ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ చేసింది. డాక్టరేట్ అందుకున్నాక ఛండీగఢ్‌లోని ఎంసీఎండీఏవీ కాలేజ్‌లో మూడేండ్లు లెక్చరర్‌గా చేసింది. ఆ తర్వాత పీయూలో సీనియర్ లెక్చరర్‌గా చేసింది. జీవితం ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలియదు. కౌర్ జీవితం కూడా అలానే మలుపు తిరిగింది. 1989లో యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్(సీఈఆర్ఎన్)లో కౌర్‌కు ఉద్యోగ అవకాశం వచ్చింది. కానీ కౌర్ వెళ్లలేదు. కొన్నిరోజుల తర్వాత కౌర్ పనిచేస్తున్న యూనివర్సిటీకి ఒక ప్రొఫెసర్ వచ్చి మహిళలు పరిశోధనా కేంద్రంవైపు అడుగులు వేయాలి. దానికి యువత అవసరం ఎంతో ఉందని ప్రసంగించారు. అక్కడున్న కౌర్‌తో మాట్లాడి సీఈఆర్ఎన్‌లోకి రావాలంటూ కోరారు. ఆమె ప్రొఫెసర్ పదవీ విరమణ తీసుకొని 1989లో సీఈఆర్ఎన్‌లో చేరింది. ఆ తర్వాత కౌర్ చాలా ప్రయోగాలు చేసింది. ఆమెతో పాటు చాలామంది అమ్మాయిలకు అవకాశం కల్పిస్తున్న మంజిత్ కౌర్ ఆదర్శంగా నిలుస్తున్నది.

## టూత్‌పేస్టు అందానికి కూడా..



**టూత్ పేస్టు పళ్లను శుభ్రం చేయడానికి మాత్రమే అనుకుంటే పొరపాటే. పేస్టుతో ఇంకా చాలా లాభాలున్నాయి. రంగు రంగుల పేస్టుల కంటే తెల్లని పేస్టు అందాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది. ఈ చిన్న చిట్కాలు పాటించి టూత్‌పేస్టుతో అందాన్ని పొందవచ్చు.**

- ముందుగా టూత్‌పేస్టు ప్యాక్‌పై ఉండే ఇంగ్రిడియంట్స్‌ను చూడాలి. తక్కువ ఫ్లోరైడ్ శాతం ఉన్న టూత్‌పేస్టును మాత్రమే వాడాలి. ముఖ్యంగా తెలుపు రంగులో ఉన్న టూత్ పేస్టు మాత్రమే ముఖానికి పేసుకోవాలి.
- ఒక గిన్నెలోకి కొంచెం టూత్‌పేస్టు తీసుకోవాలి. అందులో తేనె వేసి కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసి వదిలేయాలి. 15 నిమిషాల తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే మొటిమల సమస్య తగ్గిపోతుంది.
- ఒక గిన్నెలో కొంచెం టూత్‌పేస్టు, ఉప్పు తీసుకుని కాస్త నీరు పోసి కలపండి. ఈ మిశ్రమాన్ని రాసే ముందు ముఖానికి ఆవిరి పట్టండి. దీనివల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. కొన్ని నిమిషాల తర్వాత ఉప్పు, పేస్టు మిశ్రమాన్ని ముఖానికి రాసుకోండి. 10-15 నిమిషాల తర్వాత చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా రోజూ చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
- ముడతలు, మచ్చలను తొలిగించి, చర్మాన్ని బిగుతుగా చేయడంలో టూత్‌పేస్టు బాగా పనిచేస్తుంది. ముడతలు ఉన్న ప్రదేశంలో పడుకునే ముందు కొద్దిగా టూత్‌పేస్టు రాసి వదిలేయాలి. ఉదయాన్నే చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఎండ వల్ల చర్మం కందితే కాస్త నిమ్మరసం, పేస్ట్ కలిపి రాయాలి.
- టూత్‌పేస్టును ముఖానికి పట్టించే ముందు చేతిభాగంలో రాసుకుని చూడాలి. దురద అలర్జీ వస్తే టూత్‌పేస్టును ముఖానికి వాడొద్దు. కొందరికి స్కిన్ ఎలర్జీ ఉంటుంది. ఇలాంటి వారు టూత్‌పేస్టును ముఖానికి రాయకపోవడమే మంచిది.



## డాక్టర్ గంజాయి!

**కొందరి పేర్లు విచిత్రంగా ఉంటాయి. అవి కొందరికి ఇష్టమైతే మరికొందరికి అస్సలు నచ్చనే నచ్చవు. ఐదో తరగతి వరకూ ఆమెకు కూడా తన పేరు నచ్చలేదు. కానీ ఆ తర్వాత ఆమె తన పేరుతోనే ప్రత్యేక గుర్తింపును పొందింది.**

వాషింగ్టన్‌కు చెందిన మారిజానా పెప్సీకి 46 ఏండ్లు. ఇటీవల ఆమె డాక్టరేట్ పొందింది. తన పేరు గురించి తాను చిన్నప్పటి నుంచి ఎదుర్కొన్న సమస్యల్ని ఆమె సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకున్నది. ప్రస్తుతం ఆమె పోస్టు సామాజిక మాధ్యమాల్లో సంచలనమవుతున్నది. మారిజానా అంటే తెలుగులో గంజాయి. ఎలాంటి నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులు ఆమెకు ఆ పేరు పెట్టారో తెలియదు. కానీ.. ఐదో తరగతి వరకు ఆమె పేరంటే అస్సలు ఇష్టం ఉండకపోయేది. కానీ ఆ తర్వాత మాత్రం ఆమె పేరే ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. క్లాస్ రూమ్‌లో మారిజాన అని ఉపాధ్యాయుడు పిలవగానే విద్యార్థులంతా ఆమె వైపు చూసేవారు. టీచర్లు, విద్యార్థులు ఆటపట్టించేవారు. మారిజానా 'తరగతి గదిలో ఉపాధ్యాయుల ప్రవర్తన'పై పరిశోధన చేసి 'విస్కాన్సిన్ కార్డినల్ స్ట్రిచ్ విశ్వ విద్యాలయం' నుంచి డాక్టరేట్ పొందారు. ఇప్పుడు పీహెచ్‌డీ చేసిన ఆమెను అందరూ డాక్టర్ గంజాయి అని పిలుస్తుంటే గర్వంగా ఉందని చెబుతున్నది. డాక్టరేట్ పొందిన అనంతరం ఆమె పేరును ద్వేషించినవారంతా ప్రేమించడం మొదలు పెట్టారు. 'పేరును బట్టి కాదు. మనిషి గుణాన్ని బట్టి వారిపై అభిప్రాయం ఏర్పర్చుకోవాలి' అని సోషల్ మీడియాలో ఆమె పెట్టిన పోస్టు వైరల్ అవుతున్నది.

## ఒత్తిడిని జయించండిలా..



**ఈమధ్య కాలంలో ఒత్తిడి కారణంగా పలువురు అనేక సమస్యల్ని మూటగట్టుకుంటున్నారు. ముఖ్యంగా జుట్టు రాలడం, గుండెపోటు, ఇతర అనేక వ్యాధులకు ఒత్తిడి కారణమవుతున్నది. ఈ చిన్న టిప్స్ పాటిస్తే ఒత్తిడిని జయించవచ్చు.**

- పుస్తక పఠనం జ్ఞాన సముపార్జనకే కాదు మానసిక ప్రశాంతతను కూడా చేకూర్చుతుంది. మీరెంత బాధలో ఉన్నా ఒక పుస్తకాన్ని చదవడానికి ప్రయత్నించండి.
- స్ట్రెస్‌ను పారదోలడంలో మెడిటేషన్‌ను మించిన మెడిసిన్ లేదు. ప్రశాంతమైన స్థలంలో కూర్చుని రిలాక్స్ కండి. తరువాత కళ్లు మూసి ధ్యానం చేయండి. శ్వాసపై ధ్యాసే ధ్యానం. ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత కూడా పెరుగుతుంది.
- స్ట్రెస్‌గా ఫీలయినప్పుడు మీకు నచ్చిన, నమ్మదగ్గ వ్యక్తితో మాట్లాడండి. మీ కష్టాలు వారితో పంచుకోండి. వారితో మాట్లాడడం వల్ల మీ మనసు కాస్త తేలికవుతుంది. స్ట్రెస్‌గా ఫీలయినప్పుడు ముఖ్యంగా మీరు సాధించిన విజయాల్ని తలచుకుంటే మరింత ఎనర్జీ వస్తుంది.
- మీ దృష్టిలో జీవితమంటే ఏమిటి? మీ స్ట్రెస్‌కు మీ దృష్టికోణమే కారణమా? అదే కారణమైతే సరికొత్త కోణంలో జీవితం గురించి ఆలోచించడం ప్రారంభించండి. కొత్త అభిరుచుల వైపు మొగ్గు చూపాలి. తద్వారా స్ట్రెస్‌ను జయించవచ్చు.
- మనసుకు ఒత్తిడి కలిగినప్పుడు మనకిష్టమైన పనిని చేస్తే ఒత్తిడి పోతుంది. ఇష్టమైన వ్యాపకం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. ఇష్టమైన సంగీతం వినడమో, కథలు, కవిత్వం చదవడమో, రాయడమో, ఇష్టమైన వారిని గుర్తు చేసుకోవడమో వంటివి చేస్తే ఒత్తిడి దూరమవుతుంది.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
మంగళవారం 25 జూన్ 2019

## తేలు విషంతో మేలు

పదార్థశాస్త్రం



**వృశ్చికం (తేలు) విషంలో కొన్ని అంటువ్యాధులకు చికిత్స చేయగల పదార్థ మిశ్రమాలను శాస్త్రజ్ఞులు గుర్తించారు. దీనితో ఔషధాలను సృష్టించే విషయమై వారి ఆలోచనలు సాగుతున్నాయి.**

తేలుకొండిలో ఉండేదంతా విషమే కాదని, కొన్ని రకాల సూక్ష్మజీవులవల్ల వ్యాపించే అంటువ్యాధులకు చికిత్స జరుపగల గుణాలతో కూడిన కొత్త పదార్థ మిశ్రమాలు అందులో ఉన్నాయని తాజాగా శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఇవి రంగు మార్చే లక్షణాలతో ఉన్నాయని, కొన్ని సూక్ష్మజీవులు సృష్టించే ఇన్‌ఫెక్షన్స్ (అంటువ్యాధులు)తో పోరాడే స్వభావాన్ని కలిగి ఉన్నట్టు వారు చెబుతున్నారు. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తూర్పు మెక్సికోలోని తేలు విషంలో ఈ పదార్థ సమ్మేళనాలను గుర్తించారు. వీటిని ప్రయోగశాలలో వేరు పరిచి చూడగా అవి కణజాలంలో ప్రత్యేకించి చిట్టెలుకలోని అంటువ్యాధి కారక సూక్ష్మక్రిమి 'స్టాఫ్లికోక్కస్' (staphylococcus) ను చంపేయడమే కాక మానవుల్లో క్షయవ్యాధికి కారణమయ్యే 'ట్యుబర్క్యులసిస్' (tuberculosis) సూక్ష్మజీవుల్నీ అడ్డుకొన్నట్టు పసిగట్టారు. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ఆన్‌లైన్ పత్రికలో ఇటీవల ప్రచురితమైన ఈ పరిశోధనా వ్యాసం 'తేళ్లు, పాములు, నత్తలు వంటి జీవుల విషాల్లోని శక్తివంతమైన ఔషధ లక్షణాల'పై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించింది. ముఖ్యంగా తేలు విషం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది. కారణం, అవి కేవలం వర్షకాలంలోనే బయటికి వచ్చి పట్టుబడతాయని వారన్నారు.

## రాక్షసబల్లితోపాటు నల్లి

జీవశాస్త్రం



**మన రక్తం పీల్చే నల్లి సుమారు పదికోట్ల సంవత్సరాల కిందటే భూమిపై రాక్షసబల్లితోపాటు సంచరించినట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.**

భూమిపై నల్లులు సుమారు 50 మిలియన్ (5 కోట్లు) సంవత్సరాల కిందట, అప్పటి గబ్బిలాలతోపాటు పుట్టినట్లు ఇప్పటి దాకా భావిస్తున్న శాస్త్రవేత్తల అంచనా పొరపాటు అని తేలింది. అంతకంటే (50-65 మిలియన్ సం||లు) ముందే అంటే 115 మిలియన్ (11.5 కోట్లు) ఏండ్ల క్రితం నాటి క్రెటేసియస్ (Cretaceous) యుగంలో రాక్షసబల్లుల కాలం నాటికే అవి జీవించి ఉన్నట్టు వారు కనుగొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్ (ఇంగ్లాండ్), యూనివర్సిటీ మ్యూజియమ్ బెర్గెన్ (నార్వే), డ్రెస్డెన్ విశ్వవిద్యాలయం (జర్మనీ)కు చెందిన పరిశోధకుల బృందం సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కొన్ని డజన్ల నల్లుల డీఎన్ఏలను వారు ఈ సదర్భంగా పరిశోధించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజియంలలోని నల్లుల నివాసప్రాంతాలనుంచి వారు వివిధ నమూనాలను సేకరించారు. సిమిసిడా (Cimicidae) కుటుంబానికి చెందిన రక్తం పీల్చే పరాన్నజీవులలో మానవాళిని పట్టిపీడించే రెండు రకాల (సాధారణ నల్లి: క్లయిమెక్స్ లెక్చరియస్ , ఉష్ణమండల నల్లి : క్లయిమెక్స్ హెమిప్టెరస్) వారు ప్రధానంగా గుర్తించారు. ఇవి కూడా సుమారు 47 మిలియన్ సంవత్సరాలుగా మనుగడలో ఉన్నట్టు వారు చెబుతున్నారు.

ప్రకృతి పాఠం

## బల్లి జారని తనం

**నిలువు గోడలపైన, సీలింగ్‌లపైన, నున్నని తలాలపైన కిందపడకుండా పాకుతూ వెళ్లే బల్లుల్ని చూసినప్పుడల్లా ఎవరికైనా ఒళ్లు జల్లుమంటుంది. కానీ, అసలు వాటి 'జారని తనం' అందరినీ ఆశ్చర్యపరుస్తుంది.**

పలు రకాల టేపులు, బ్యాండేజీలు, గ్లౌజులు, గోడలకు అతుక్కునే వస్తువులు, స్పైడర్‌మేన్ దుస్తులు, సిలికాన్ వేఫర్లు, ఇంకా పలు ప్లాస్టిక్, సిలికాన్ వస్తువులు, కార్బన్ నానోట్యూబ్‌లతోపాటు ఏకంగా కృత్రిమ చర్మం, రోబోలు సైతం బల్లి జారని పనితనం ఆధారంగా తయారవుతున్న వాటిలో ఉన్నాయి. మనుషులు నీళ్లపై నడిచేలా, సైనికులు ఎత్తయిన ప్రాకారాలను పాకేందుకు వీలుగా ఈ సాంకేతికతతో పలు వస్తువుల తయారీకి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. అంతరిక్షంలో జీవిత కాలం ముగిసిన కృత్రిమ ఉపగ్రహాలు, వాటి విడిభాగాలను సేకరించేందుకు ఆకర్షణీయమైన శక్తితో కూడిన 'మెకానికల్ గ్రిప్పర్ల'ను తయారుచేయాలని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. ఎంతటి నున్నని తలాలకైనా అంటుకుపోయే గుణం గల ప్యాచ్‌లనూ తయారు చేస్తున్నారు. వీటిని కాళ్లు, చేతులకు ధరించి ఏకంగా నిలువు, గాజు గోడలపైకి పాకుతూ వెళ్లగల రోజులు రావచ్చు.

బల్లులు, తొండల పాదాలలో బిలియన్ల సంఖ్యలో అతిసూక్ష్మ వెంట్రుకలు ఉంటాయి. ఇవి మన తలవెంట్రుకల సైజులో 10-20 రెట్లు చిన్నవి. సెటా (setae)లుగా పిలిచే వీటి ఆధారంగానే ఈ జంతువులు కావలసినంత బలాన్ని పొంది జారకుండా నిట్టనిలువున పాకుతూ వెళతాయని పరిశోధకులు అంటున్నారు. పెద్ద తొండలు (geckos) సాధారణంగా 4.4 పౌండ్ల బరువును మోయగలవు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు సిలికాన్ మైక్రోవెడ్జ్‌లను కనుగొన్నారు. వీటి ఆధారంగా 'నాసా' జెట్ ప్రొపెల్షన్ ప్రయోగశాలల్లో రోదసిలోని కాలుష్య వస్తువులను సేకరించడానికి కృత్రిమ రోబోలను తయారుచేశారు. స్టిక్‌రోబో (Stikbot) లుగా పిలిచే వీటిని పై యూనివర్సిటీకి చెందిన మెకానికల్ ఇంజినీర్ మార్క్ కుటోస్కై కనిపెట్టారు. ఈ రోబోలతో కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే, 60-70 అంతస్థుల బంగళాల్లోకి ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సరే ఇవి వెళ్లి అక్కడ అవసరమయ్యే సహాయక చర్యలు చేపట్టగలవని పరిశోధకులు




అంటున్నారు. అచ్చం బల్లి మాదిరిగానే ఈ రోబోకూడా గోడలపైకి పాక్కుంటూ వెళ్లిపోతుందని వారు అంటున్నారు. 'జెకోస్కిన్'గా పిలిచే ఒక రకమైన కృత్రిమ చర్మాన్ని బల్లి జారని తనాన్ని పోలిన సాంకేతికతతో తయారుచేశారు. కార్బన్ ఫైబర్ లేదా కెల్వార్‌తోపాటు ఎలస్టోమర్లు (పాలియూరోథీన్ లేదా పాలీడైమిథైల్ సిలోకోన్)ల సంయుక్త కలయికతో దీనిని సృష్టించారు. దీని గోడలకు టీవీలు, కంప్యూటర్లను పడిపోకుండా అంటించవచ్చు. అలాగే, పలు వైద్య, పారిశ్రామిక, వస్త్ర, గృహోపయోగ రంగాల్లో పలు రకాల అవసరాలకూ దీనిని వినియోగిస్తున్నారు. ఈ జెకోస్కిన్‌ను గాజు, లోహం, చెక్క వంటి అత్యంత సున్నితమైన, జారుడు గుణం గల తలాలపైన అమర్చి, దానికి వేటినైనా అతికించుకోవచ్చు. ఇదే కోవలో జెకోటేప్, షూపోల్స్ (బూట్లకు అతుక్కొనే సోల్), జెకోబ్యాండేజీలు, బయోడిగ్రేడెబుల్ బ్యాండేజీలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. సిపాయిలు, స్పైడర్‌మేన్‌లలా గోడలపైకి పాకేందుకు హ్యాండ్‌ప్యాడ్‌లు కూడా జెకో టెక్నాలజీతో రూపొందాయి. అలాగే, కొన్ని రకాల బల్లులు, తొండలు నీళ్లపైన వేగంగా నడచుకుంటూ వెళ్లడం వెనుకగల వాటి పనితనపు రహస్యాన్ని పరిశోధకులు కనుగొన్నారు. మధ్య అమెరికాలోని 'బాసిలిక్స్' (Basilisks) అనే బల్లులపై హార్వర్డ్ యూనివర్సిటీలో విస్తృత అధ్యయనాలు జరిపి ఈ మేరకు అవి నీటిలో ఎలా మునిగిపోకుండా నడవగలుగుతున్నాయో కనుగొన్నారు. వీటి చాకచక్యం ఆధారంగా మనిషిని కూడా నీటిపై నడిపించేలా కొన్ని రకాల యంత్రాలను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'హైడ్రోఫోబిక్ లెగ్స్' వల్ల ఆ బల్లులు నీళ్లపై తేలిగ్గా నడవగలుగుతున్నట్టు వారు గుర్తించారు.

**-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**

వ్యవసాయ శాస్త్రం




**'ఇస్టా' సమావేశాలతో ఇష్టకామ్యార్థ సిద్ధి**

# బంగారు విత్తన తెలంగాణ!




**బంగారు తెలంగాణ సంస్థాపనకు యథార్థ బీజం పడుతున్నది. యాదృచ్ఛికంగానైతేనేం, అటు కాళేశ్వరం భారీ బహుళార్థ సాధక ప్రాజెక్టు ప్రారంభోత్సవం, ఇటు 32వ 'ఇస్టా' సదస్సు ఇంచుమించు ఏకకాలంలో తెరపైకి వచ్చాయి. నాణ్యమైన ఉత్తమ విత్తనాలు, గంగోదకం వంటి శుద్ధ నదీజలాలు సమకూరుతున్న శుభవేళ ఇది. సంపద్వంతమైన భౌగోళిక పరిసరాలకు పుట్టినిల్లు అయిన తెలంగాణలో సారవంతమైన మట్టినేలలకూ కొదువ లేదు. వాతావరణ పరిస్థితులొక్కటే అనుకూలించవలసింది. ఇంక, సస్యశ్యామల తెలంగాణం అవతరించకుండా ఉంటుందా! ప్రపంచానికే 'తెలంగాణను సీడ్ బౌల్' (విత్తన భాండాగారం)గా, 'గ్లోబల్ సీడ్ హబ్' (అంతర్జాతీయ విత్తన కేంద్రం)గా మార్చాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష సఫలమై, మన బంగారు తెలంగాణకు పూలబాట వేస్తుంది.**

**భారతీయుల్లో** ప్రత్యేకించి తెలుగువారి సంకల్ప బలాన్ని ప్రస్ఫుటంగా నిరూపించిన సందర్భాలు ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించక ముందు, దేశానికే 'విత్తన భాండాగారం'గా నాటి ఆంధ్రప్రదేశ్ వినుతికెక్కిన ఘనతలో మన ప్రాంతం వాటా ఎంతో. ఇవాళ సహజ సిద్ధమైన తన సత్తాను చాటుకోవడంలోనూ తెలంగాణ ముందుంటున్నది. 2015లోనే తెలంగాణను 'దేశానికే కాదు, యావత్ ప్రపంచానికే విత్తన భాండాగారం' (సీడ్ బౌల్) గా మార్చాలన్న బృహత్ లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఆ మేరకు సల్పిన కృషి ఫలితంగా ఈ కొన్నేండ్లలోనే దానిని నెరవేర్చుకొనే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాం. మన రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పం ఈ అరుదైన అద్భుత ఘనతను తప్పక సాధిస్తుందన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. వాటిలో ఒకటే ప్రస్తుత అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 32వ 'ఇస్టా' సదస్సు.

ఎంతటి మహా వృక్షానికైనా విత్తు స్థాయిలోనే అత్యంత సత్తా ఉంటుందన్నది సత్యం. అంతటి విలువైన, నాణ్యమైన విత్తనాల సృష్టికి మన తెలంగాణ ఎంత అనుకూలమంటే ప్రపంచ దేశాల్లో పండే పంటలన్నీ ఇక్కడ పండేంతగా! గత ఐదేండ్లుగా మన సీఎం కేసీఆర్ రైతు అనుకూల విధానాలతోపాటు నాణ్యమైన, బంగారం వంటి విత్తనాల తయారీ కోసం దిశానిర్దేశంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ కృషిలో భాగంగానే ఇప్పుడు ఆసియా ఖండంలోనే తొలిసారిగా 'ఇస్టా' (32వ అంతర్జాతీయ విత్తన పరీక్షా సంస్థ సదస్సు: International Seed Testing Association Congress- 2019: 32nd ISTA)కు రాష్ట్రప్రభుత్వం ఆతిథ్యమిస్తున్నది. రైతు సమగ్ర వికాసానికి మూలస్తంభం వంటి విత్తన నైపుణ్యాల్ని, నిలువ సామర్థ్యాలను మరింతగా ఇనుమడింపజేసి, రాష్ట్రాన్ని ప్రపంచానికే విత్తన భాండాగారంగా మార్చడానికి ఈ 8 రోజుల (ఈనెల 26 నుంచి జూలై 3 వరకు) సమావేశాలు తగిన రీతిలో దోహదపడగలవు.

భౌగోళికంగా ప్రత్యేకించి వివిధ రకాల పంటల సాగుకు అత్యంతానుకూలమైన ప్రాంతంగా తెలంగాణ ఏనాటి నుంచో ప్రసిద్ధికెక్కింది. 'వ్యవసాయం దండగ కాదు, పండుగ' అనే జీవితసత్యాన్ని నిజం చేయాలన్న దృఢ సంకల్పంతోనే భూసార పరీక్షలనుంచి నాణ్యమైన విత్తనాల వరకు అనేక రకాల కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నది. 'రైతుబంధు', బ్యాంకు రుణాలు వంటి వాటిద్వారా రైతులందరికీ ఆర్థిక కష్టాలు తీర్చడంతోసహా చాలినంత సాగునీటితో అధిక దిగుబడికీ కావలసిన పరిస్థితులను కల్పించడం వరకూ అన్నీ అందులో భాగమే. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 41 లక్షల హెక్టార్ల మేర ఖరీఫ్, 13 హెక్టార్ల మేర రబీ సీజన్‌లో పంటభూముల విస్తీర్ణం ప్రతి ఏటా ఉంటున్నట్టు 2015లోని అధికారిక అంచనాలు చెబుతున్నాయి. దేశంలోనే అత్యధిక విత్తన భర్తీ రేటు, 60 శాతం వరకు విత్తనోత్పత్తి మన రాష్ట్రంలోనే ఉంటున్నట్టు వ్యవసాయశాఖ నిపుణులు ఇదివరకే వెల్లడించారు. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో 90 శాతం హైబ్రీడ్ వరి వంగడాలు ఉత్పత్తవుతున్నాయని, హైబ్రీడ్ జొన్నమేత (గడ్డి), సజ్జ విత్తనాల ఉత్పత్తిలో నిజామాబాద్ జిల్లా ఒక 'దుర్గం' వంటిదనీ వారు అభివర్ణించారు. వరి, మొక్కజొన్న, శనగ, వేరుశనగ, సోయాబీన్ పంటల విత్తనోత్పత్తిలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలువగా, దాదాపు 90 శాతం హైబ్రీడ్ విత్తనాలు సైతం ఇక్కడే ఉత్పత్తవుతుండడం మరో విశేషం.

రేపటి నుంచి మొదలవుతున్న 'ఇస్టా' సమావేశాలలో మొత్తం 700 మందికి పైగా పరిశోధకులు, విధాన కర్తలు, నిపుణులు పాల్గొంటుండగా, వారిలో 80 దేశాలకు చెందిన వారు 400 మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో సుమారు రూ. 500 కోట్ల విలువ చేసే విత్తనాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వ్యవసాయ రంగానికి కావలసిన సాగునీరు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా అందగలదని, దీంతో ప్రస్తుత, భవిష్యత్ కాలంలో రైతాంగం సుస్థిర సాగుతో అధిక దిగుబడిని సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశాలలో సాంకేతిక, సాంకేతికేతర సమావేశాలు రెండూ విడివిడిగా జరగడమేకాక కొత్తగా, నవీన ఆవిష్కృత విత్తన సాంకేతికతపైనా ప్రత్యేక సెషన్స్ ఉంటాయని వారు అన్నారు. సుమారు 1500 మంది విత్తన రైతులతో ప్రత్యేక సమావేశాలనూ ఏర్పాటు చేశామనీ వారు తెలిపారు. ఇదే సమయంలో 150వ విత్తన పరీక్షా వార్షికోత్సవాన్ని కూడా జరుపుతారు.

**-దోర్బల బాలశేఖరశర్మ**

**సమగ్ర విత్తనాభివృద్ధే లక్ష్యంగా...**

*32వ 'ఇస్టా' సదస్సు ప్రధాన ఇతివృత్తం (Theme) గా 'మారుతున్న ప్రపంచంలో విత్తన సాంకేతికత, నాణ్యత' అనే అంశాన్ని ప్రకటించారు. విత్తన నాణ్యతకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా వున్న పరిశోధకులు, విశ్లేషకులు, సాంకేతిక నిపుణులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రతినిధులు అందరినీ ఒక్కచోటుకు చేర్చడమే దీని ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు. విత్తన విజ్ఞాన శాస్త్ర, సాంకేతికతలో ఇటీవలి ఆధునిక ప్రగతిని సదస్సులో చర్చించి, ఈ మేరకు సరికొత్త సమాచారాన్ని, ఆధునిక భావనలను పరస్పరం పంచుకొనే అవకాశం పలువురికి లభిస్తుందని వారన్నారు. సదస్సు బృహత్ ఎజెండాలో భాగంగా 'భవిష్యత్ తరాల కోసం విత్తన నాణ్యతా స్థిరీకరణ, విత్తన వ్యాధి విజ్ఞాన మార్పులలోని సవాళ్లు, విత్తన ఆరోగ్య స్థిరీకరణ, మారే పర్యావరణంలో విత్తనోత్పత్తి, విత్తన నాణ్యతలోని కొత్త సాంకేతికతలు- నవీన విధానాలతోపాటు విత్తన పరిపుష్టి పరీక్ష, ఆచరణ సాధ్యతలోని అభివృద్ధి పనులు' వంటి అంశాలు ఉన్నాయి.*

పనితనం

## కదిలే మెట్లపై ప్రయాణం



ఎలివేటర్ (లిఫ్ట్)లో లేని కొత్త సౌకర్యాలు ఎస్కలేటర్ (కదిలే మెట్లు)లో ఉంటాయి. ఒక అంతస్థు నుంచి మరో అంతస్థుకు ఒకేసారి పదుల సంఖ్యలో మనుషులను చేరవేసే యాంత్రిక సాధనమిది. సుమారు 100 హార్స్‌పవర్ మోటారుతో ఓపెన్ ఫ్లోర్లలో ఎక్కడానికి, దిగడానికి ఒకేసారి పనిచేసే దీనిపై ప్రయాణం అత్యంత సౌకర్యవంతమేకాక సులభతరం కూడా. ఒక జత పెద్ద గొలుసు ఉచ్చు, మరొక జత గెయిర్లతో, కన్వెయర్ బెల్టు సాయంతో పనిచేసే ఈ కదిలే మెట్ల 'లిఫ్ట్' తక్కువ దూరానికి (రెండంతస్థుల నడుమ) మనల్ని చేరవేస్తుంది. మెట్లు నిరంతరం ఏటవాలుగా పైకి- కిందికి తిరుగుతుంటాయి కనుక, కదిలే మెట్లపై పడిపోకుండా నిలబడగలిగితే సరి. మొత్తం పైకి కాని, లేదా పూర్తిగా కిందికి గాని వచ్చిన తర్వాత వెంటనే అప్రమత్తంగా ఉపరితలంపైకి అడుగులు వేయాలి. లేకపోతే, స్లిప్ అయి పడిపోయే ప్రమాదమూ ఉండవచ్చు.

ఎవరేమన్నారు?



భయంకరమైన, ప్రత్యక్షంగా కనిపిస్తున్న విషయం ఏమిటంటే, మన సాంకేతికత మానవత్వాన్ని మించిపోవడం!

**- పాల్ బెర్గ్**
నోబెల్ బహుమతి గ్రహీత,
అమెరికన్ బయోకెమిస్ట్,

✻ పుట్టినరోజు: 30 జూన్ 1926

## దంతరక్షణ సూత్రం

సుచరిత




పొద్దున లేవగానే, రాత్రిళ్లు పడుకోవడానికి ముందు ప్రతి ఒక్కరికీ తప్పని నిత్యజీవన క్రియ దంతధావనం. దంతాల శుభ్రత, ఆరోగ్యానికే కాక నోటి దుర్వాసన నివారణకూ ఇది తప్పనిసరి. కుడిచేతి చూపుడు వేలుకు ఉప్పు లేదా పిడకల్ని కాల్చిన బొగ్గును పట్టుకొని పళ్లు తోముకొనే రోజుల నుంచి స్టయిల్‌గా నోట్లో పేస్టుతో కూడిన బ్రష్ వేసుకొనే కాలం ఇప్పుడు వచ్చింది. ఈ ప్రక్రియ ఇంతటి ఆధునికతను సంతరించుకోవడం వెనుక ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉన్నది. క్రీ.పూ. 5000 సంవత్సరాలకు పూర్వమే ఈజిప్టులు దంతాలను శుభ్రపరచుకోవడానికి ఒక రకమైన పొడిని వాడారు. వేపపుల్లలను నోట్లో వేసుకొని నమిలి బ్రష్‌లా చేసి, పండ్లను శుభ్రం చేసుకొనే విధానం గత కొన్ని శతాబ్దాలుగా, అనేక దేశాలలో వాడకంలో ఉన్నది. ఎద్దు చర్మం నుంచి మొదలుకొని ఎముకల చూర్ణం వరకు దంతధావనానికి ప్రాచీనకాలంలో ఉపయోగపడని పదార్థం లేదేమో. పొడి రూపాన్ని కాస్తా చిక్కని ద్రవరూపానికి తేవడానికి ముందుకూడా ఎంతో కసరత్తే జరిగింది. 9వ శతాబ్దంలో ఇరాక్‌లో ఒక డిజైనర్ తొలితరం టూత్‌పేస్టును తయారుచేసినట్టు చరిత్ర. ఐతే, ఆ పేస్టు దేనితో తయారైందన్న దానిపై మాత్రం చరిత్రకారులకు స్పష్టత లేదు. 19వ శతాబ్దంలో బ్రిటన్‌లో మొట్టమొదటి ఆధునాతన టూత్ పౌడర్‌ను వాడగా, 2000 కల్లా పేస్ట్ వాడకం మొదలైంది. ఇప్పటికి పలు రకాల టూత్‌పేస్టులు వచ్చేశాయి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఐడీబీఐలో 600 మేనేజర్లు

**ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) పీజీ డిప్లొమా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సు ద్వారా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఏ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**




- **మొత్తం ఖాళీలు:** 600 (జనరల్-273, ఈడబ్ల్యూఎస్-30, ఓబీసీ-162, ఎస్సీ-90, ఎస్టీ-45, పీహెచ్‌సీ-24)
- **కోర్సు పేరు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్
- ఈ కోర్సును ఐడీబీఐ, మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత
- **వయస్సు:** 2019 జూన్ 1 నాటికి కనిష్ఠంగా 21 ఏండ్లు, గరిష్ఠంగా 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** మొదటి తొమ్మిది నెలలకు రూ. 2500/-(ట్రెయినింగ్ పీరియడ్), ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో మూడు నెలలకు రూ. 10,000/-, స్టయిఫండ్ చెల్లిస్తారు. ఏడాది కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులను అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఏ) హోదాలో పే స్కేల్ రూ. 23,700-42,020/- ఉంటుంది.
- **సర్వీస్‌బాండ్:** ఎంపికైన అభ్యర్థులు ఐడీబీఐ బ్యాంక్‌లో మూడేండ్లపాటు సర్వీస్ చేయాల్సి ఉంటుంది లేదా సర్వీస్ పూర్తిచేయకపోతే రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 700/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 150/-)
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ ఉమ్మడి రాతపరీక్ష కేవలం ఇంగ్లిష్/హిందీలో మాత్రమే ఉంటుంది.
- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతి తప్పు జవాబుకు 1/4 మార్కులను తగ్గిస్తారు.
- **శిక్షణ కేంద్రం:** మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, బెంగళూరు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడతోపాటు దేశవ్యాప్తంగా 94 సెంటర్లలో పరీక్షను నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **పరీక్ష తేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** www.idbi.com

ఆన్‌లైన్ పరీక్ష సిలబస్:

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | గరిష్ఠ మార్కులు |
|---|---|---|
| లాజికల్ రీజనింగ్, డాటా అనాలిసెస్ & ఇంటర్‌ప్రిటేషన్ | 60 | 60 |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 40 | 40 |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 40 | 40 |
| జనరల్/ఎకనామీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ | 60 | 60 |
| మొత్తం | 200 | 200 |

### టీఎంసీలో ఫెలోషిప్

**అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ పరిధిలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) విశాఖపట్నంలోని సెంటర్ కోసం కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**




- **పోస్టు:** టీఎంసీ ఫెలోషిప్
- **కాలపరిమితి:** ఏడాది
- **విభాగాలు:** గైనిక్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, హెడ్ &నెక్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరి, అనెస్థీషియా, మెడికల్ ఆంకాలజీ, పాథాలజీ, రేడియో-డయాగ్నసిస్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, న్యూక్లియర్ మెడిసిన్.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 2, విశాఖపట్నంలోని టీఎంసీలో
- **వెబ్‌సైట్:** http://tmc.gov.in

**ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలోని ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ & అలైడ్ సర్వీసెస్ కంపెనీ ఖాళీగా ఉన్న సెక్యూరిటీ స్క్రీనర్ ( కాంట్రాక్టు ప్రాతిపదికన ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

### ఎయిర్‌పోర్ట్ అథారిటీలో 272 ఖాళీలు




- **పోస్టు పేరు:** సెక్యూరిటీ స్క్రీనర్స్
- **మొత్తం పోస్టులు:** 272
- **స్టేషన్ల వారీగా ఖాళీలు:** కోల్‌కతా-87, అలహాబాద్-42, కాలికట్-87, చెన్నై-56
- **అర్హతలు:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, బీసీఏఎస్ బేసిక్ ఏవీఎస్ఈసీ సర్టిఫికెట్ (బీసీఏఎస్ స్క్రీనర్/ఇన్‌లైన్ స్క్రీనర్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. హిందీ/ఇంగ్లిష్, స్థానిక (ప్రాంతీయ) భాషల్లో పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 2019 జూన్ 1 నాటికి 45 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 25,000-30,000 జీతం చెల్లిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/- (ఎస్సీ/ఎస్టీ, మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు)
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా. నాన్ ఏవీఎస్ఈసీ అభ్యర్థులకు ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ) నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీలు:** జూన్ 28, 30 & జూలై 5, 7
- **వెబ్‌సైట్:** www.airportsindia.org.in

### సీఈసీఆర్ఐలో ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

**తమిళనాడు(కరైకుడి)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈసీఆర్ఐ) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం ఖాళీలు:** 7 (ప్రాజెక్ట్ అసిస్టెంట్-6, జేఆర్ఎఫ్-1)
- **అర్హత:** ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్), ఎంటెక్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** Central Electrochemical Research Institute, Karaikudi
- **ఇంటర్వ్యూ తేదీ:** జూలై 5
- **వెబ్‌సైట్:** www.cecri.res.in

### బీఈసీఐఎల్‌లో

**న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.**

- **మొత్తం పోస్టులు:** 15
- **పోస్టుల వారీగా:** అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-1, డాటా అనలిస్ట్-1, సైబర్ క్రైమ్ థ్రెట్ ఇంటెలిజెన్స్ ప్రొఫెషనల్స్-2, బిజినెస్/రిసెర్చ్ అనలిస్ట్-6, సొల్యూషన్ ఆర్కిటెక్ట్-2, ప్రోగ్రామ్ మేనేజర్-2, లీగల్ అసిస్టెంట్-1
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 5
- **వెబ్ సైట్:** www.becil.com.

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 25 జూన్ 2019



రాశీఖన్నా, సాయిధరమ్‌తేజ్‌లపై క్లాప్‌నిస్తున్న దిల్‌రాజు

## 'ప్రతిరోజు పండగే' ప్రారంభం

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రతిరోజూ పండగే' సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం జరుపుకుంది. మారుతి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2యూవీ పిక్చర్స్ పతాకంపై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి దిల్‌రాజు క్లాప్‌నిచ్చారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కుటుంబ కథా చిత్రమిది. చక్కటి వినోదం, హృదయాల్ని స్పృశించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. సాయిధరమ్‌తేజ్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది' అన్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ ఇది. సత్యరాజ్, రావు రమేష్ పాత్రలు కీలకంగా ఉంటాయి. ఉన్నత విలువలతో తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. విజయకుమార్, రావు రమేష్, మురళీశర్మ, అజయ్, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, సత్య శ్రీనివాస్, సుభాష్, భరత్‌రెడ్డి, గాయత్రీ భార్గవి, హరితేజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జైకుమార్ వసంత్, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాబు, సహనిర్మాత: ఎస్.కె.ఎన్, రచన-దర్శకత్వం: మారుతి దాసరి.

## నితిన్-కీర్తిసురేష్ 'రంగ్‌దే'


నితిన్


కీర్తిసురేష్

వరుస చిత్రాల్ని అంగీకరిస్తూ జోరుమీదున్నాడు నితిన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'భీష్మ' ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నది. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం ఆదివారం ప్రారంభోత్సవం జరుపుకున్న విషయం తెలిసిందే. వచ్చే నెలలో షూటింగ్ మొదలుకానుంది. ఇదిలావుండగా నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ 'రంగ్‌దే' పేరుతో మరో చిత్రాన్ని తెరకెక్కించబోతున్నది. 'గివ్ మీ సమ్ లవ్' ఉపశీర్షిక. వెంకీ అట్లూరి ('తొలిప్రేమ' ఫేమ్) దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్ కథానాయికగా నటించబోతున్నది. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. ఈ సినిమాకు పీసీ శ్రీరామ్ ఛాయాగ్రహణ బాధ్యతల్ని నిర్వర్తించబోతున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


అధర్వమురళి, వరుణ్‌తేజ్

## వాల్మీకి నయా లుక్

పాత్రలపరంగా ప్రయోగాలు చేయడానికి ముందుంటారు వరుణ్‌తేజ్. కెరీర్ తొలినాళ్ల నుంచి ప్రతి సినిమాలో విభిన్నంగా కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారాయన. తాజా చిత్రం 'వాల్మీకి' కోసం సరికొత్త అవతారం ఎత్తారు. సోమవారం ప్రీ టీజర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. సంభాషణలు లేకుండా నేపథ్య సంగీతంతో కూడిన ఈ టీజర్‌లో మెలికలు తిరిగిన మీసం, పొడవాటి గడ్డంతో కంటికి సూర్మా పెట్టుకొని చేతిలో తుపాకీతో మాస్ లుక్‌లో వినూత్నంగా కనిపించారు వరుణ్‌తేజ్. మీరెప్పుడు చూడని సరికొత్త లుక్‌లో తాను కనిపిస్తానని వరుణ్‌తేజ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తమిళ చిత్రం 'జిగర్తాండ' ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నది. తమిళ నటుడు అధర్వ మురళి ఈ సినిమాతో తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 6న విడుదలకానుంది.


రాజశేఖర్, స్కార్లెట్ విల్సన్

## ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

'గతంలో పరాజయం ఎదురైతే కోడిరామకృష్ణ, ముత్యాల సుబ్బయ్య లాంటి దర్శకులు నన్ను కాపాడుతారనే ధైర్యం, విశ్వాసం ఉండేవి. ఇప్పుడు ఆ నమ్మకాన్ని ప్రవీణ్‌సత్తారు, ప్రశాంత్‌వర్మ అందిస్తున్నారు' అని అన్నారు రాజశేఖర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కల్కి'. ప్రశాంత్‌వర్మ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. అదాశర్మ, నందితాశ్వేత, పూజిత పొన్నాడా కథానాయికలు. ఈ నెల 28న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. దర్శకుడు ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ '1983 బ్యాక్‌డ్రాప్‌లో సాగే పీరియాడికల్ సినిమా ఇది. నా శైలికి భిన్నమైన కథ కావడంతో చాలా పరిశోధన చేసి తెరకెక్కించాను. వాణిజ్య హంగులతో కూడిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెలుగు ప్రేక్షకులకు నవ్యమైన అనుభూతిని పంచుతుంది. సాయితేజ ఈ చిత్రానికి కథను అందించారు. ఎవరి కథను కాపీ కొట్టి సినిమా చేయలేదు' అని తెలిపారు. విభిన్నమైన కథాంశంతో ప్రశాంత్‌వర్మ ఈ సినిమా చేశారని, 'గరుడవేగ'ను మించి ఈ చిత్రం విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత సి.కల్యాణ్ పేర్కొన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ ''గరుడవేగ'తో నాకంటూ ఓ మార్కును సృష్టించారు ప్రవీణ్ సత్తారు. ఆ లక్ష్యాన్ని దాటాలనే ఆలోచనలతో ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం. 'త్వరలో ప్రవీణ్ సత్తారు దర్శకుడిగా సి.కల్యాణ్ నిర్మాణంలో 'గరుడవేగ-2' చేయబోతున్నాను. భవిష్యత్తులో కొత్త దర్శకులతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను'అని చెప్పారు. ''గరుడవేగ' తర్వాత ఆ స్థాయికి తగిన కథ కోసం ఏడాది పాటు ఎదురుచూశాం. ప్రశాంత్‌వర్మ టీమ్ చెప్పిన కథ నచ్చి అతడి దర్శకత్వంలోనే సొంతంగా నిర్మించాలని అనుకున్నాం. సి.కల్యాణ్ తాను ఈ సినిమాను నిర్మిస్తానంటూ ముందుకొచ్చారు'అని జీవిత చెప్పింది.


తమన్నా


డైమండ్ రత్నబాబు, ఆది, కిరణ్‌రెడ్డి, పృథ్వీ, సాయికార్తీక్, శ్రీకాంత్

## బుర్రకథ బ్రేక్‌నిస్తుంది

'రెండు బ్రెయిన్‌లతో పుట్టిన ఓ యువకుడి కథ ఇది. కన్‌ఫ్యూజన్ లేకుండా అర్థవంతంగా దర్శకుడు రత్నబాబు ఈ సినిమాను తెరకెక్కించారు' అని అన్నారు ఆది సాయికుమార్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'బుర్రకథ'. డైమండ్ రత్నబాబు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకాంత్ దీపాల, కిషోర్, కిరణ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మిస్తీ చక్రవర్తి, నైరాషా కథానాయికలు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలకానుంది. హీరో వెంకటేష్ చిత్ర ట్రైలర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆదిసాయికుమార్ మాట్లాడుతూ 'నాకు మంచి సక్సెస్ వచ్చి చాలా రోజులుంది. ఈ సినిమా బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది. కుటుంబ విలువలతో సరదాగా సాగుతుంది. ప్రతి ఒక్కరం ఇష్టపడి ప్రేమించి చేసిన సినిమా ఇది' అని తెలిపారు. 'ప్రతిభను ప్రోత్సహించే వాళ్లు ఇండస్ట్రీలో తక్కువ మంది ఉన్నారు. హీరో ఆదితో పాటు నిర్మాతలు నన్ను, నా కథను నమ్మి ఈ సినిమా చేశారు. ప్రీక్లైమాక్స్ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తాయి. హిట్టు సినిమా చేశామనే నమ్మకంతో ఉన్నాం. అభి, రామ్ పాత్రలు భిన్న పార్శ్వాలతో సాగుతూ నవ్విస్తాయి' అని డైమండ్ రత్నబాబు చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిదని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పృథ్వీ, మిస్తీ చక్రవర్తి, గాయత్రి గుప్తా, సాయికార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## 100కోట్ల చేరువలో...




షాహిద్‌కపూర్, కియారా అద్వాణీ జంటగా నటించిన 'కబీర్‌సింగ్' (తెలుగు 'అర్జున్‌రెడ్డి' రీమేక్) బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనాల్ని సృష్టిస్తున్నది. శుక్రవారం ప్రేక్షకులముందుకొచ్చిన ఈ చిత్రంపై విమర్శకులు మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. అయితే బాక్సాఫీస్ రేసులో మాత్రం దూసుకుపోతున్నదీ చిత్రం. తొలి వారాంతంలోనే దాదాపు 70కోట్లు వసూళ్లు సాధించినట్లు ముంబయి ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. మరో రెండు రోజుల్లో ఈ చిత్రం వందకోట్ల మైలురాయిని చేరుకుంటుందని చెబుతున్నారు. తెలుగు మాతృకకు దర్శకత్వం వహించిన సందీప్‌రెడ్డి వంగా హిందీ వెర్షన్‌ను డైరెక్ట్ చేశారు. షాహిద్‌కపూర్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రమిదని చిత్ర బృందం ప్రకటించింది. హిందీ నేటివిటీకి అనుగుణంగా స్క్రిప్ట్‌లో స్వల్ప మార్పులతో ఈ చిత్రాన్ని రూపొందించారు.

## తలచినదే జరిగినదా..


రామ్‌కార్తిక్, ఊర్వశి పరదేశి

'ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచులతో పాటు తెలుగు సినిమా ధోరణిలో మార్పులువచ్చాయి. కొత్తదనంతో కూడిన రియలిస్టిక్ ఎంటర్‌టైనింగ్ సినిమాల్ని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఆ కోవలోనే దర్శకుడు సూర్యతేజ కంటెంట్‌ను నమ్మి కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు' అని అన్నారు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ. రామ్‌కార్తిక్, ఊర్వశి పరదేశి జంటగా నటిస్తున్న చిత్రం 'తలచినదే జరిగినదా'. సూర్యతేజ.జి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. షైన్ పిక్చర్స్ పతాకంపై శేఖర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సి.కల్యాణ్ క్లాప్‌నివ్వగా, మామిడి హరికృష్ణ కెమెరా స్విఛాన్ చేశారు. సంజీవ్‌కుమార్ గౌరవదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ 'సూర్యతేజ రెండేళ్లు శ్రమించి ఈ కథను తయారుచేసుకున్నాడు. దర్శకులు, నటీనటుల ప్రతిభను నిర్మాతలు నమ్మినప్పుడే వినూత్న ఇతివృత్తాలతో కూడిన చిన్న సినిమాలు వస్తాయి. పాషనేట్ ఫిలింమేకర్స్ కలిసి చేస్తున్న ఈ సినిమా కొత్తతరం ఆలోచనలకు ప్రతిరూపంగా ఉంటుంది' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ ''జెర్సీ'తో పాటు పలు చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేశాను. 2000 సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటనతో ప్రస్తుత కాలానికి ఉన్న సంబంధం ఏమిటన్నది సినిమాలో ఆసక్తిని పంచుతుంది. ఫిక్షన్ థ్రిల్లర్ హంగులకు వినోదాన్ని మేళవించి రూపొందిస్తున్నాం' అని తెలిపారు. జూలై 8 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి రెండు షెడ్యూళ్లలో సినిమాను పూర్తిచేస్తామని, హైదరాబాద్.. గోవాలో చిత్రీకరణ జరుపుతామని నిర్మాత చెప్పారు. తెలుగులో తన తొలి చిత్రమిదని కథానాయిక పేర్కొన్నది. పోసాని కృష్ణమురళి, సత్య, సత్యం రాజేష్, కేదార్ శంకర్, నళిని కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిహిరామ్స్, ఎడిటర్: గ్యారీ, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎస్. వర్మన్.

## సాగరతీరంలో విలాసం

తమ స్టార్‌డమ్‌ను ప్రతిబింబించేలా ఖరీదైన విల్లాలు, అపార్ట్‌మెంట్స్ కొనుగోలు చేయడం సినీతారలకు పరిపాటే. తాజాగా మిల్కీబ్యూటీ తమన్నా ఖరీదు చేసిన ఓ అపార్ట్‌మెంట్ ముంబయి సినీ వర్గాల్లో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. ముంబయిలో సంపన్నులు నివసించే ప్రాంతమైన వెర్సోవాలో దాదాపు 17కోట్లతో ఓ విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసింది తమన్నా. 14వ అంతస్తులో ఉండే ఈ అపార్ట్‌మెంట్‌ను దాదాపు నలభైవేల స్కేర్‌ఫీట్ వైశాల్యంలో సకలహంగులతో నిర్మించారట. ఈ అపార్ట్‌మెంట్ నాలుగువైపుల నుంచి అరేబియా సముద్ర దృశ్యం కనువిందు చేస్తుందట. ఈ ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోసమే తమన్నా మరో నాలుగుకోట్లు వెచ్చించాలని నిర్ణయించుకుందట. ముంబయిలో సముద్రతీరానికి దగ్గరగా ఉన్న ప్రశాంతమైన లొకేషన్ కావడంతో మార్కెట్ రేటు కంటే అధిక మొత్తంలో డబ్బు చెల్లించి తమన్నా ఈ ఫ్లాట్‌ను సొంతం చేసుకుందని తెలిసింది. దక్షిణాదిలో పేరున్న కథానాయికలు ముంబయిలో ఇంతటి విలాసవంతమైన ఫ్లాట్‌ను ఖరీదు చేయడం చాలా అరుదని అంటున్నారు.

## సామాజిక ఇతివృత్తంతో..


నీతుగౌడ

శ్రీకాంత్, సునీల్ ప్రధాన పాత్రలను పోషిస్తున్న చిత్రం 'జైసేన'. వి. సముద్ర దర్శకుడు. అభిరామ్, శ్రీకార్తికేయ, ప్రవీణ్, హరీష్ గౌతమ్ కథానాయకులుగా నటిస్తున్నారు. వి. సాయి అరుణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'సేన జైసేన యుద్ధం చేయ్' అనే గీతాన్ని ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు బి.గోపాల్ విడుదలచేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ 'ఇందులో పోలీస్ అధికారిగా నా పాత్ర సీరియస్‌గా సాగుతూనే నవ్విస్తుంది. 'రేపటి పౌరులు' మాదిరిగా చక్కటి సందేశంతో దర్శకుడు సముద్ర ఈ సినిమాను రూపొందించారు' అని తెలిపారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ 'సామాజిక ఇతివృత్తంతో రూపొందుతున్న పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రమిది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. సమాజంలో మార్పు కోసం ప్రయత్నించే నలుగురు యువకులకు ఎలాంటి అవరోధాలు ఎదురయ్యాయన్నది ఆకట్టుకుంటుంది. రాజకీయ నాయకులు, యువతలో ఆలోచనను రేకెత్తిసుంది. శ్రీకాంత్, సునీల్ పాత్రలు, నటన సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ, ప్రవీణ్, నీతుగౌడ పాల్గొన్నారు.

## కాకతీయుడి సమరం


శిల్ప, తారకరత్న, యామిని

తారకరత్న కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాకతీయుడు'. వి.సముద్ర దర్శకుడు. లగడపాటి శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. జూలై మొదటివారంలో సినిమా విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. ఊరి శ్రేయస్సును కాంక్షిస్తూ ఓ యువకుడు సాగించిన పోరాటం ఆసక్తిని పంచుతుంది. తారకరత్న ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఆయన బాడీలాంగ్వేజ్‌కు సరిపోయే కథ, కథనాలతో దర్శకుడు సముద్ర ఈ సినిమాను తెరకెక్కించారు. మంచి సినిమాగా సెన్సార్ సభ్యుల ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. శిల్ప, యామిని, రేవతి కీలక పాత్రలను పోషిస్తున్నారు.


సౌమ్య మీనన్

## మహాలక్ష్మి మూవీ మేకర్స్ చిత్రం

రంజిత్, సౌమ్యమీనన్ నాయకానాయికలుగా మహాలక్ష్మి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రం ద్వారా రామకృష్ణ మైలా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. పత్తికొండ కుమారస్వామి నిర్మాణ సారథ్యంలో యం.రవికుమార్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, నిర్మాత భరత్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోతగా సాగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించే అంశాలుంటాయి' అన్నారు. 'మా సంస్థ ద్వారా కొత్తవారిని ప్రోత్సహించాలనుకుంటున్నాం. వచ్చే నెలలో షూటింగ్ మొదలుపెడతాం. తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్లాన్ చేశాం. అన్ని వర్గాలను మెప్పించే అంశాలున్న చిత్రమిది' అని నిర్మాత తెలిపారు. చక్కటి భావోద్వేగాలు మేళవించిన కథాంశమిదని హీరో రంజీత్ పేర్కొన్నారు. రావు రమేష్, వి.కె.నరేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాలిరెడ్డి, సంగీతం: అనూప్‌రూబెన్స్, దర్శకత్వం: రామకృష్ణ మైలా.